thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

సంపుటి - 20 సంచిక - 340 | కరీంనగర్ ఆదివారం, 15 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రాయపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బం దులు ఎదురవుతున్నట్టు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.



## హంగ్ మున్సిపాలిటీలపై నజర్..
## మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది.

ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లోని మల్కాజిగిరి క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు.. తదుపరి కార్యాచరణపై చర్చించారు. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలు 'హస్త'గతం అవుతాయని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఈ సమావేశానికి పలువురు సీనియర్ నేతలూ హాజరయ్యారు.

## తెలంగాణలో మరో మహాజాతర రెడీ.. నేటి నుంచి మూడు రోజుల పాటు

ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర అయిన మేడారం మహాజాతర విజయవంతంగా పూర్తి అయిన సంగతి తెలిసిందే. రెండున్నర కోట్లకు పైగా భక్తులు.. మేడారం తరలివచ్చి సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో జాతర వచ్చేసింది.

రాష్ట్రంలో మేడారం జాతర తర్వాత అత్యంత వైభవంగా జరిగే మరో జాతరగా గుర్తింపు పొందిన ఏడుపాయల వనదుర్గాభవాని మాత మహా జాతర నేడు ప్రారంభం కానుంది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వద్ద జరిగే ఈ జాతరకు లక్షలాది మంది భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరానున్నారు. మంజీరా నది ఏడు పాయలుగా విడిపోయి మధ్యలో వెలిసిన ఆ వనదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 3 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు మెదక్ జిల్లా యంత్రాంగం.. ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఏడుపాయల వద్ద మంజీరా నది.. ఏడు పాయలుగా విడిపోయి.. వనదుర్గమ్మ అమ్మవారి పాదాల చెంత నుంచి ప్రవహిస్తుంది. ఈ పవిత్ర క్షేత్రానికి ప్రతీ సంవత్సరం లక్షలాది మంది భక్తులు వచ్చి దర్శించుకుంటారు. ఈసారి ఏడుపాయల మహాజాతరలో భాగంగా తొలిరోజు మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని.. భక్తులు మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. ఆ తర్వాత వనదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక రెండో రోజైన ఫిబ్రవరి 16వ తేదీన ఏడుపాయల జాతరలోనే అత్యంత ముఖ్యమైన ఘట్టమైన బండ్ల ఉత్సవాన్ని అత్యంత కోలాహలంగా నిర్వహించనున్నారు. ఈ బండ్ల ఉత్సవానికి.. ఏడుపాయల చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి భక్తులు తమ ఎడ్లబండ్లను రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించి తీసుకువస్తారు. వాటిని ఆలయ చుట్టూ ప్రదర్శనగా తిప్పుతూ తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఇక జాతర చివరి రోజైన ఫిబ్రవరి 17వ తేదీన రథోత్సవంతో ఈ మహా క్రతువు ముగియనుంది. ఇక ఈ ఏడుపాయల జాతరకు కేవలం స్థానిక మెదక్ జిల్లా నుంచి మాత్రమే కాకుండా సిద్దిపేట, సంగారెడ్డి, నిజామాబాద్, వికారాబాద్, కామారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్ నుంచి కూడా భక్తులు వస్తారు. తెలంగాణ



నుంచి మాత్రమే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు కూడా లక్షల్లో తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారందరికీ.. ఎలాంటి ఇబ్బందులు రాకుండా వాటిని అనుగుణంగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడుపాయల జాతరకు వచ్చే భక్తులు స్నానాలు చేసే సమయంలో వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మంజీరా నదిలోకి సరిపడినన్నీ నీటిని విడుదల చేయడంతో పాటు.. ఘాట్ రోడ్లకు మరమ్మతులు, నీళ్లలో బారికేడ్లను నిర్మించడం.. ఆలయ పరిసరాల్లో తాగునీటి సరఫరాపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఏడుపాయల జాతర కోసం వచ్చే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి స్పెషల్ బస్సులను నడపనుంది. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి.. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

# బడ్జెట్‌పై రేవంత్ సర్కార్ కసరత్తు!

## కొత్త బడ్జెట్ పై 16 నుండి సన్నాహక చర్చలు

## వివిధ కారణాలతో సమీక్షల్లో జాప్యం




హైదరాబాద్ : వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక అంచనా బడ్జెట్ రూపకల్పనలో తెలంగాణ సర్కార్ నిమగ్నమైంది. ఇందులో భాగంగా ఈ నెల 16 నుండి సన్నాహక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. డిప్యూటీ సీఎం. భట్టి విక్రమార్క విభాగాల వారీగా వచ్చిన ప్రతిపాదనలపై ఆయా శాఖల మంత్రులు, అధికారులతో సమీక్షించనున్నారు. ఇప్పటికే వివిధ శాఖల నుండి తమకు కావాల్సిన నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు అందినా, వాటిపై సమీక్షలు నిర్వహించడంలో జాప్యం జరిగింది.

గతనెల 24 నుంచి శాఖల వారీగా ఆర్థిక శాఖ సన్నాహక సమావేశాల ను నిర్వహించాలని నిర్ణయించినా ముఖ్యమంత్రి రేవంతరెడ్డి విదేశీ పర్యటనలకు తోడు, సమక్క సారలమ్మ జాతర తదితర కారణాల వల్ల సమీక్షల్లో జాప్యం జరిగింది. దీనికి తగినట్లుగా ప్రస్తుతం రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి.

**ఆర్థిక శాఖకు చేరిన నిధుల ప్రతిపాదనలు....** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. నిన్ననే ఫలితాలు కూడా వచ్చాయి. అధికార పార్టీ మెజార్టీ స్థానాల సైతం సాధించింది. ఈనెల 16 నుంచి బడ్జెట్ సన్నాహక సమావేశాలను నిర్వహించాలని ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఏ శాఖకు సంబంధించి ఏ రోజు సమావేశానికి రావాలనే అంశంపై అధికారులు కనరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డితో డిప్యూటీ సీఎం విక్రమార్క భేటీ అయ్యారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయం, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పట్టించుకోని విషయాల గురించి చర్చించారు. రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన, ఏయే రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే అంశాలపై వారు చర్చించినట్టు తెలిసింది.

**డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతిపాదనలపై కీలక సమీక్షలు....** ప్రధానంగా ఆరు గ్యారంటీలు, పలు డిక్లరేషన్లు, ఇతర హామీలను అమలు చేయడంతో పాటు, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విడుదల చేసింది. ఆ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉండాలనే దానిపై వీరిరువురి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం. కాగా తెలంగాణ రాష్ట్ర 2026-27 అంచనా బడ్జెట్కు సంబంధించి శాఖల వారీగా అవసరాలపై ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు అందాయి. గత నెల 23 నుంచి ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్లో శాఖల వారీగా ఆన్లైన్లో ఆయా శాఖలు బడ్జెట్ ప్రతిపాద నలను సమర్పించాయి. ముఖ్యంగా ఆదాయాలు, వ్యయాలు, పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన నిధులు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది సంఖ్య, వారి జీతాలు మరియు భత్యాలపై అయ్యే ఖర్చు వంటి అంశాలను కలుపుకొని అంచనాలను రూపొందించాయి. ఈ ప్రతిపాదనలను సంబంధిత విభాగాల ముఖ్య కార్యదర్శులు సమీక్షించి, వాస్తవ అవసరాలు తదితర అంశాలపై వ్యాఖ్యలతో ఆర్థిక శాఖకు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం సమీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

**మార్చికి రూ.2.60 లక్షల కోట్ల ఆదాయం!...** గతేడాదికన్నా 10 శాతం అదనంగా పన్నుల ఆదాయం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది. 2024-25 బడ్జెట్‌లో పన్నుల ద్వారా రూ.1.64 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని లక్ష్యాన్ని పెట్టుకోగా చివరికి రూ.1.40 లక్షల కోట్లు వచ్చింది. ఈ ఏడాది కూడా రూ.లక్షన్నర కోట్లు రావచ్చని అధికార వర్గాలు తెలియజేస్తున్నాయి. వచ్చే ఏడాది బడ్జెట్‌కు పన్నుల ద్వారా ఆదాయ లక్ష్యాలను ప్రభుత్వం మరింత పెంచుతుందా లేక రూ.1.75 లక్షల కోట్లకే పరిమితం చేస్తుందా అనేది పన్నుల వసూళ్ల శాఖలు ఇచ్చే ప్రతిపాదనలను బట్టి తేలనుంది. గ్లోబల్ సమిట్, మూసీ పునరుజ్జీవం, ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) వంటి వాటితో ప్రధానంగా వచ్చే ఏడాది రియల్ ఎస్టేట్ రంగం మరింత పుంజుకుంటుందని రిజిస్ట్రేషన్లపై ఆదాయం బాగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఏడాది పన్నేతర ఆదాయం, కేంద్రం నుంచి గ్రాంట్లు కలిపి రూ.53 వేల కోట్లకు పైగా రావచ్చని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. కానీ ఇప్పటివరకు రూ.11 వేల కోట్లలోపే వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్‌లో వీటిని మరింత పెంచాలా లేదా ఇదే స్థాయిలో కొనసాగించాలా అనే చర్చ సాగుతోంది. అన్నిశాఖల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తామని, అవి అందిన తర్వాత ఆదాయ లక్ష్యాల అంచనాల్లో మార్పులుంటాయని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.2.84 లక్షల కోట్ల ఆదాయం రావాలి. కానీ మార్చి నాటికి ఇది రూ.2.60 లక్షల కోట్లకు పరిమితం కావచ్చని, దీన్ని బట్టి కొత్త బడ్జెట్ ప్రతిపాదనలుంటాయని అధికారులు తెలిపారు.



## యూరప్, అమెరికా అయిపోయింది..

# మోదీ నెక్స్ట్ టార్గెట్ 'గల్ఫ్'

ప్రపంచ వాణిజ్య యుద్ధాలు, ట్రంప్ టారిఫ్ వార్‌తో ప్రపంచ వ్యాప్తంగా సప్లయ్ చైన్ దెబ్బతింటోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కారణంగా చాలా దేశాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. భారత్‌పై ట్రంప్ 2.0 విధించిన టారిఫ్‌లతో ఫార్మా, టెక్స్‌టైల్, జెమ్స్ తదితర రంగాలు ఒడిదుడుకులకు లోనయ్యాయి. చాలా మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ తరుణంలో మోదీ తన చాణక్యంతో వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టారు. అమెరికాను మించిన ఒప్పందాలు చేసుకుంటూ టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై పడకుండా చేశారు. ఆస్ట్రేలియా, యూకే, యూఏఈ, యురోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో షాక్ అయిన ట్రంప్ ఇప్పుడు దిగి వచ్చారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి సై అంటున్నారు. అదీ మనం చెప్పినట్లుగా, మన కండీషన్స్ అంగీకరిస్తూనే.

**గల్ఫ్ దేశాలపై ఫోకస్..** ప్రపంచ వాణిజ్య యుద్ధాల మధ్య భారత్, యూరోపియన్ యూనియన్, అమెరికాతో ఒప్పందాల తర్వాత గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)లోని ఆరు దేశాలతో ఫ్రీ ట్రేడ్ ఒప్పంద చర్చలు ప్రారంభించింది. యూఏఈ, ఒమాన్‌తో ఇప్పటికే అమలులో ఉన్న ఒప్పందాలు ఆధారంగా, సౌదీ అరేబియా, ఖతర్, కువైత్, బహ్రెయిన్‌తో సంబంధాలు బలోపేతమవుతాయి. ఈ చొరవ భారత విదేశీ వ్యాపార వ్యూహానికి కొత్త ఊపిరి పోస్తుంది.

**ఎగుమతులు, పెట్టుబడుల ఊపు..** ఒప్పందం విజయవంతమైతే, ఆహార ఉత్పత్తులు, ఫార్మా, టెక్నాలజీ ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. గల్ఫ్ దేశాల నుంచి ఇన్వెస్ట్‌మెంట్‌లు మాన్యుఫాక్చరింగ్, ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో ప్రవేశిస్తాయి. ఇది ఉద్యోగాలు, జీడీపీ వృద్ధికి దోహదపడుతుంది. ఇప్పటికే యూఏఈతో విస్తరణ జరిగిన మోడల్, మిగతా దేశాలకు మార్గదర్శకంగా పనిచేస్తుంది.

**వ్యూహాత్మక ప్రాముఖ్యత..** గల్ఫ్ దేశాలు ప్రపంచ ఇంధన వనరుల 40% నియంత్రిస్తున్నాయి. ఈ ఒప్పందం భారత ఇంధన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. వాణిజ్య రక్షణను పెంచుతుంది. గల్ఫ్ దేశాలు ఆయిల్ ఆధారిత ఆర్థిక వ్యవస్థల నుంచి డైవర్సిఫై అవుతున్న సమయంలో, భారత మార్కెట్ వారికి ఆకర్షణీయంగా మారుతోంది. ఇది ద్వైపాక్షిక వ్యాపారాన్ని రెట్టింపు చేసే అవకాశం ఉంది. టారిఫ్ ఆంక్షలు, నిబంధనల సమన్వయం సవాళ్లుగా ఉన్నాయి. అయితే, వ్యూహాత్మక బలం, మ్యూచువల్ లాభాలు చర్చలను వేగవంతం చేస్తాయి. విజయం సాధిస్తే, భారత వాణిజ్యం మెరుగుపడుతుంది. గ్లోబల్ అనిశ్చితుల మధ్య భారత ఆర్థిక స్థిరత్వాన్ని బలపరుస్తుంది.

# చిన్న పత్రికలపై చిన్న చూపు తగదు

### ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
### -టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్
### -17న"ఛలో సమాచార భవన్"కు పిలుపు



హైదరాబాద్, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన "ఛలో సమాచార భవన్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల కమిషనర్ కార్యాలయం(సమాచారభవన్) ఎదుట జరిగే జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల నిర్వహకులుజర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు, చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్ధతిని తుంగలో తోక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులం దరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ...కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ,పీఆర్జీఐరిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కరీంనగర్ మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశాం: బండి సంజయ్



హైదరాబాద్: అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజెక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశా రు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ.1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు.




## ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదు: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14: తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.




## మున్సిపల్ ఫలితాలతో ఆ రెండు పార్టీల పొత్తుకు తొలి అడుగు: కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 14: మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. 'జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆర్ఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.




## మున్సిపల్ జోష్.. రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్..!

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు గుడ్ న్యూస్ చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది. ఈరోజు (శనివారం) సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి తన నివాసంలో మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

## మున్సిపల్ ఎన్నికల్లో మతాన్ని రెచ్చగొట్టినా బీజేపీ ఏం సాధించలేకపోయింది: మహేశ్ గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 : నిజామాబాద్ కార్పొరేషన్‌ను తామే కైవసం చేసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఈరోజు (శనివారం) సమావేశం అవుతానని.. ఈ భేటీలో కార్పొరేషన్‌ల గురించి చర్చించి అన్ని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ వేదికగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. కరీంనగర్ కార్పొరేషన్ కూడా తమ ఖాతాలోకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీపీఐ నేతలతో మాట్లాడుతున్నామని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జగిత్యాలలో కాంగ్రెస్ వారే ఛైర్మన్‌గా ఉంటారని స్పష్టం చేశారు.

**జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుస్తాం..** మున్సిపల్ ఎన్నికల్లో మతాన్ని రెచ్చగొట్టినా బీజేపీ ఏం సాధించలేకపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ ఎన్నికల్లో 90 శాతం గెలవాలని రూల్ ఏమైనా ఉందా..? అని ప్రశ్నించారు.

కవితకు ఈ ఎన్నికలు ఉత్సాహాన్ని ఇచ్చి ఉండవచ్చని అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉండదని చెప్పుకొచ్చారు.



జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా అత్యధిక స్థానాలను గెలుస్తామని జోస్యం చెప్పారు. హైదరాబాద్ గ్రేటర్ ఎన్నికల్లో కూడా తామే విజయం సాధిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.




ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్ నేత గురుప త్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నిన కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా పై అభియోగాలు దాఖలైన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాన్‌హటన్‌లోని ఫెడరల్ కోర్టులో నిఖిల్ గుప్తా తన నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు అమెరికా అటార్నీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. దాని ప్రకారం.. గురువారం గుప్తా యూఎస్ మెజిస్ట్రేట్ జడ్జి సారా నెట్‌బర్న్ ముందు హాజరయ్యారు. ఈ క్రమంలో కిరాయి తీసుకొని పన్నూని హత్య చేయడానికి ఒప్పుకోవడం, దానికి ప్లాన్ చేయడంతో పాటు మనీలాండరింగ్ కుట్ర వంటి మూడు నేరారోపణలను అతడు అంగీకరించాడు. వీటన్నింటికీ కలిపి అతడికి 40 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై మే 29న న్యాయస్థానం శిక్ష విధించనుంది. తాజా పరిణామాలపై గుప్తా తరఫు న్యాయవాదులు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని భగ్నం చేశామని గతంలో అగ్రరాజ్యం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కుట్ర కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా ప్రమేయం ఉందంటూ అమెరికా అటార్నీ కార్యాలయం ఆరోపించింది. ఇందుకోసం అతడికి ఓ భారత ప్రభుత్వ అధికారి నుంచి ఆదేశాలు అందాయని ఆరోపణలు చేసింది. ఈ క్రమంలోనే చెక్ రిపబ్లిక్ అధికారులు గుప్తాను అరెస్టు చేశారు. ఆ తర్వాత అమెరికా ఒత్తిడి నేపథ్యంలో అతడిని అగ్రరాజ్యానికి అప్పగించారు. భారత ప్రభుత్వాధికారిపై అమెరికా చేసిన ఆరోపణలను కేంద్రం తీవ్రంగా ఖండించింది. ఈ కేసులో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కాగా, తాజా పరిణామాలపై భారత్ ఇప్పటివరకు స్పందించలేదు.


# తెలుగునేలలపై శైవమత వ్యాప్తి



చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిఢవిల్లింది. క్రీ.పూ.2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీశ శివాచార్యుడు స్థాపించాడు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, క్రీ.పూ.1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్లు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత ఆరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ.253--277) రాజైన ఏహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలై నాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హారీతి ఆలయం నిర్మించ బడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హారీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్ర సేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృథ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ.358నుండి 569వరకు 210 ఏళ్ళు తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ.440-495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జునునికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్ఠించినదని చెప్తున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద ఆవయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధారా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ.850–895) వేములవాడలో బద్దెగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ.7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజ వాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ.1100-70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టదకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగా తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవా యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళు...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిషాసుర మర్దిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# నూతన ఆవిష్కరణల రూప కర్త గెలీలియో

## – ఫిబ్రవరి 15... గెలీలియో జయంతి



గెలీలియో గెలీల ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలీస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు. గెలీలియో గెలీలి (జననం 1564 ఫిబ్రవరి 15..మరణం 1642 జనవరి 8) ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు. గెలీలియో కాలం అనగా 16 వ శతాబ్దం వరకు క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే ప్రాచుర్యంలో ఉండేవి. సృష్టిలోని సత్యాలనన్నిటినీ స్వచ్ఛమైన ఆలోచనల ద్వారా మాత్రమే వివరించ వచ్చును. ప్రయోగాల ప్రమేయం ఏ మాత్రం అవసరం లేదన్నది అరిస్టాటిల్ సిద్ధాంతాల్లోని పెద్ద లోపం. అరిస్టాటిల్ సిద్ధాంతంతో ఏకీభవించని గెలీలియో పీసా గోపురం 180 అడుగుల ఎత్తు పైనుంచి 100 పౌండ్లు, 1 పౌండు బరువు గల రెండు ఇనప గుండ్లను ఒకేసారి క్రిందికి వదలి, అవి రెండూ ఒకే కాలంలో భూమిని చేరుకుంటాయని ప్రయోగం ద్వారా నిరూపించాడు. గురుత్వ త్వరణం గూర్చి ఆ కాలం నాటికే అర్థం చేసుకో గలిగాడు. 20 సంవత్సరాల వయసులో అయన ఒక రోజు ప్రార్థన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళలో చర్చి సేవకుడు దీపాలు వెలి గించగా ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఆ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఆయన డోలన కాలాలను గణించటం విశేషం. వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం గురించి పరిచయం ఉంది కాబట్టి కాల నిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. పాండువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ప్రధానాచార్యునిగా చేరాడు. అక్కడే గెలీలియో యాంత్రిక శాస్త్రం రచించాడు. ఇది సామాన్యులకు కప్పీలు, తులాదండాలు, వాలుతలాల ద్వారా బరువులు సులభంగా ఎత్తడానికి ఉపకరించింది. ఆ సమయంలోనే వాయు థర్మామీటర్ ను, పల్లపు ప్రాంతం నుంచి ఎత్తుకు నీటిని చేరవేసి వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాన్ని, గణితంలో వర్గాలు, వర్గమూలాలు కనుగొనే కంపాస్ పరికరాన్ని కనుగొన్నారు. ఆ సమయంలోనే లోలకాలు, వాయు తలాలపై కూడా కీలకమైన ప్రయోగాలు చేశాడు. గెలీలియో మొట్టమొదటి నాణ్యత గల టెలిస్కోప్ నిర్మాత. ఆయన టెలిస్కోప్ గురించి విని సింగ్ ఆరోరియా మహారాజు వెనిస్ కు రమ్మని కబురు చేశాడు. ఆయన టెలిస్కోప్ చూసి ఎంతోమంది ఆశ్చర్య పడ్డారు. వెనిస్ చర్చి పైభాగానికి వెళ్ళీ ఎంతో దూరంలో ఉన్న నౌకలను పది రెట్లు దగ్గరగా ఎంతో మంది గెలీలియో టెలిస్కోప్ ద్వారా చూడ గలిగారు. ఆయనను ప్రశంసించారు. ఈ టెలిస్కోప్ గెలీలియో పరిశోధనలో ముఖ్యమైనది. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించ గలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు. గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించాడు. పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు. ఈ టెలిస్కోప్ ను ఉపయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతంను బలపరిచాడు. క్రీ.శ 1616 లో గెలీలియో, సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ద్వందంగా ప్రకటించాడు. అప్పటికే మత గ్రంథాలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భూకేంద్రక సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కోపర్నికస్ సిద్ధాంతాన్ని నిషేధించి, కొందరు మతాధికారులు గెలీలియో ప్రయోగాలు మత వ్యతిరేకమైనవని తీర్మానించారు. తన ప్రయోగాలను ఎన్నటికీ బహిర్గతం చేయనని ప్రమాణం తీసుకున్నారు. ఈ ప్రకటనకు ఆగ్రహం చెందిన చర్చి మతాధికారులు గెలీలియో ఎటువంటి ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. దీంతో క్రీ.శ.1630 వరకు గెలీలియో నోరు విప్పలేక పోయాడు. అయినా ఆయన తన వాదాలను విడిచి పెట్టలేదు. వాటిని పుస్తక రూపంలో వెలువరించాడు. 1632లో వెలువడిన ఈ "Dialogues concerning the two chief world systems" అనే గ్రంథం ఐరోపా ఖండంలో సారస్వత వేదాంత గ్రంథానికి ఉదాహరణగా పేర్కొంటారు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను వెల్లడించాడు. అయితే ఈ గ్రంథాన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్థించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. క్రీ.శ. 1637 లో పాపం గెలీలియో గుడ్డి వాడయ్యాడు. అంతటి మహానుభావుడు శిక్షను అనుభవిస్తూనే 1642, జనవరి 8 తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర్ఖత్వం బలిగొంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# నేటి తరానికి ఆదర్శం....ధర్మబిక్షం సేవాభావం


## - ఫిబ్రవరి 15...తెలంగాణ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మబిక్షం జయంతి



ఆయన స్వాతంత్ర్య సమర యోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం..బొమ్మగాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళు కొనుగోలు లాంటి కార్యక్రమా లలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచు కున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి,కమ్యూనిస్టు పార్టీతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి,ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు. తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చు కున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. 1951-73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952-57, 1957-62, 1962-67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991-96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా. 1992-95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని, భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మబిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# అలుపెరుగని పోరాట యోధుడు లోక్ సత్తా శ్రీనివాస్

## నరెడ్ల శ్రీనివాస్ యాదిలో...ఫిబ్రవరి 15... పోరాట యోధుని వర్ధంతి



నరెడ్ల శ్రీనివాస్ అంటే తెలియక పోవచ్చు కాని, లోక్ సత్తా శ్రీనివాస్ అనగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. చాలా మంది ఆయనను లోక్ సత్తా శ్రీనివాస్ అనే పిలిచేవారు. సామాజిక న్యాయం, ఉద్యమాలకు ఆయన కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచారు. ఉత్తర తెలంగాణలో గత ఆ నాలుగు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉద్యమా లతో ఆయన భాగస్వామ్యం లేని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు. లోక్ సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్ సత్తా అంటే శ్రీనివాస్. శ్రీనివాస్ అంటే లోక్ సత్తా అని పేరెన్నిక గన్నారు. అవినీతి, అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్ లో ఉన్న అన్ని ఉ ద్యమ వేదికలు ఆయనవే. గత సామాజిక ఉద్యమా లతో ఆయనకు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. ఆయన ప్రతి ఉద్యమం లో క్రియాశీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఉద్యమాలను నిర్మించారంటే సమంజసంగా ఉంటుంది. ఉ ద్యమాల నిర్వహణలో అలుపెరగక, ఏనాడూ రాజీ పడక, మొక్కవోని ధైర్యంతో, చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠిత కార్యదీక్ష తో, అంకిత భావంతో, అన్నింటినీ మించి చిత్తశుద్ధితో, ఉద్యమాలలో మమేకమైన పోరాట యోధుడు. 1955లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో నిరుపేద కుటుంబంలో నరెడ్ల శ్రీనివాస్ జన్మించిన శ్రీనివాస్... యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, బ్యాంకు మేనేజర్ గా ప్రమోషన్ మీద కొంత కాలంగా రాష్ట్రం విడిచి వెళ్ళిన సందర్భంలోనూ, ఏనాడూ ఉద్యమ కార్యా చరణను ఆయన వదిలి పెట్టలేదు. వినియోగదారుల మండలి తరపున వందలాది కేసులు వేసి హక్కులను పరిరక్షిం చేందుకు కృషి చేశారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించడం లో కృషి చేసిన వారిని సన్మానించి ప్రోత్స హించేవారు. పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తి చూపడంలో, ప్రజా సమస్యలతో పాటు, సామాన్య బాధితుల న్యాయం కోసం పోరాడ డంలో ఆయన వ్యక్తిత్వం అనన్య సామాన్యం. ఉమ్మడి రాష్ట్ర వినియోగ దారుల మండలి అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందరికీ అందు బాటులో ఉండేలా కిరాయి ఇల్లు వేదికగా, కరీంనగర్ వినియోగ దారుల మండలి నిర్వాహక బాధ్యునిగా, వేలాది కేసులను ఆయన పరిష్కరించారు. అన్యా యానికి గురైన వారు తమకు న్యాయం తప్పక జరుగుతుందని నమ్మకంతో, లోక్ సత్తా ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా సలహాలు సూచనలు అందించ డమే కాక, వెంట ఉండి సహకరించే వారు. హుజురాబాదులో జన్మించిన 69ఏళ్ళ శ్రీనివాస్... విద్యార్థి జీవితం లోనే ప్రగతిశీల భావాలు కలిగి, ఆనాటి పోరాట, విప్లవ యోధుల సాహచర్యంతో ఎదిగారు. 1970వ దశక ప్రారంభంలో మిత్రులతో కలిసి హుజురాబాద్ లో సాహితీ సంస్థ స్థాపనకు చొరవ చూపి, మహాకవి శ్రీశ్రీని ఆహ్వానించి, హుజురాబాద్ లో సమావేశాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ లో ఉద్యోగంలో చేరారు. ప్రగతి శీల, భావజాల పరిధిని విస్తృత పరుచుకుని, తన లాంటి భావాలున్న వారితో జత కట్టారు. ఒకనాడు జర్నలిస్టులకు వేదికగా, ఎందరో జర్నలిస్టులను తయారు చేసి, జర్నలిస్టుల తయారీ కర్మాగా రంగా విలసిల్లిన, విజయ కుమార్ సంపాదకత్వంలో వెలువ రించిన 'జీవగడ్డ పత్రికలో వారం వారం 'పెన్నుపోటు' పేర కాలమిస్టు గా పని చేశారు. ఆకాలంలో జీవగడ్డలో పని చేసిన అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, ఆనాడు జిల్లాలో విధులు నిర్వర్తించిన సీనియర్ జర్నలిస్టు మిత్రులు దేవులపల్లి అమర్, దామెర్ల సాయిబాబా, ఎస్. కే.జకీర్ తదితరులతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు. కరీంనగర్ వినియోగదారుల మండలి స్థాపించి వినియోగ దారుల పరిరక్షణ చట్టం కింద, రశీదో, బిల్లో, ఏ చిన్న ఆధారం తోనైనా సరే, ఫోరం కోర్టుల్లో వేలాది కేసులు వేస్తూ మోస పోయిన వినియోగ దారులకు లక్షలాది రూపాయల నష్ట పరిహారాలు వచ్చేలా కృషి చేశారు. అలాగే సమాచార హక్కు చట్టాన్ని మరొక ఆయుధంగా చేసుకుని సామాన్యు లకు అండగా నిలిచారు. ఈ చట్టం కింద భూ కబ్జాలు, గ్రానైట్ రాళ్ళ సంభకోణాల లాంటివి బహిర్గత పరిచి, ప్రభుత్వానికి కోట్ల రూపాయల లబ్దిని చేకూర్చారు. లోక్ సత్తా బాధ్యునిగా, జయప్రకాష్ నారాయణను కరీంనగర్ పలు మార్లు రప్పించి, చిత్తశుద్ధితో పని చేశారు. సమాజంలోని అవినీతి అక్రమాలపై అలుపెరుగని, అవిశ్రాం త పోరాటం చేసి, ఆశయ సాధనకు కృషి చేసిన పోరాట యోధుడు, నరెడ్ల చివరికి కరోనా మహమ్మారి తోనూ పోరాటం చేసి, ఓటమి పాలై, పోరాట యోధుని గానే 2021 ఫిబ్రవరి 15న తనువు చాలించారు. ఆయన పోరాటం ఎందరికో స్ఫూర్తి దాయకం అయిందనేది వాస్తవం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు

## సంపాదకీయం

# రీల్స్ పిచ్చితో మృత్యువు ఒడిలోకి.. ఈ విచిత్ర ధోరణి మారేదెన్నడు?

ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీ అభివృద్ధితో పాటు మనిషి ఆలోచన ధోరణి కూడా పూర్తిగా మారిపోతోంది. జీవితంలో ఉన్నత విలువలు నేర్చుకోవాల్సిన యువత.. బంగారు భవిష్యత్తు కోసం పాటుపడకుండా పాపులారిటీని సంపాదించుకోవడానికి రీల్స్ మోజులో పడి మృత్యువాత పడుతున్నారు.. తల్లిదండ్రులు తమ పిల్లలు తమనేదో ఉద్ధరిస్తారు అనుకుంటే.. ఈ పిల్లలు మాత్రం ఇలా రీల్స్ మోజులో భిన్నమైన పనులు చేస్తూ స్వర్గస్తులవుతూ వారికి తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారని చెప్పాలి. ఇకపోతే ఇలా సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ లో ఊహించని విన్యాసాలు చేస్తూ సమాజానికి సిగ్గుచేటుగా మారుతున్నారు. మరి ఈ విచిత్ర ధోరణి మారేదెన్నడు? పబ్లిసిటీ అనే ఒక్క పేరుతో సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత.. వివిధ సోషల్ మీడియా యాప్ లను ఉపయోగిస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాజంలో గుర్తింపు రావాలి అంటే నలుగురికి సహాయపడే పనులు చేయాలి లేదా తమకంటూ ఒక ఉన్నతమైన హోదాను కల్పించుకోవాలి. విద్యలో మందంజులో ఉండడం లేదా సమాజానికి ఉపయోగపడే ఏదైనా ఆవిష్కరణకు పాటుపడడం లాంటివి చేస్తే ఖచ్చితంగా మీరు ఎలాంటి పనులు చేయకుండానే మీ ప్రతిభ మీకు ఊహించని గుర్తింపును అందిస్తుంది. అంతేకాదు ఆ గుర్తింపు అనేది మనం చేసే పనులను బట్టి ఉంటుంది.. సొంత తెలివితేటలను ఉపయోగించకుండా అడ్డదారిలో వెళ్తూ ఇలా చేయరాని పనులు చేసి ప్రజలలో క్రేజ్ దక్కించుకోవడానికి ప్రయత్నం చేస్తూ.. ఇలా ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకరేమో వేగంగా వెళ్లే ట్రైన్ నుంచి దూకి స్టంట్ చేస్తారు. ఇంకొకరేమో నేరుగా లోతైన బావుల్లోకి దిగుతూ తామేదో గొప్పగా విన్యాసం చేస్తున్నామని చూపిస్తూ అందరి చేత ఔరా అనిపించుకోవడానికి అతి కష్టమైన విన్యాసాలు చేస్తూ ఉంటారు. ఇంకొంద మంది ఏకంగా ప్రాణాలనే హరించిపచేసే ఆహారాలను తింటూ ప్రాణాలు కోల్పోతున్నారు. అందులో భాగంగానే ఇటీవల ఫిలిప్పీన్స్ లో ఒక మహిళ ఫుడ్ ఇన్ఫ్లుయెన్సర్ 'డెవిల్ క్రాబ్' అనే పీత తిని మృత్యువాత పడ్డారు. 51 సంవత్సరాల ఎమ్మా అనే మహిళ తన స్నేహితులతో కలిసి పలావన్ ప్రావిన్స్ లోని ప్యేటో ప్రిన్సెసాలో ఉన్న మడ అడవులకు వెళ్లారు. అక్కడ కొబ్బరి పాలు వేసిన గుల్ల చేపలు వండిన తీరును, ఫాలోని ఆస్వాదిస్తూ తినడాన్ని ఎమ్మా తన టిక్ టాక్ ఫాలోవర్ల కోసం చిత్రీకరించారు. ఆ మరుసటి రోజు ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్పృహ కోల్పోయి , ఆమె పెదవులు ముదురు నీలం రంగులోకి మారాయి. హుటాహుటిన ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఇక వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆమె ఫిబ్రవరి 6న మృతి చెందింది. డెవిల్ క్రాబ్ అనే పీతను ఆమె తిన్నట్టుగా వైద్యులు తెలిపారు. వీటిలోని విష పదార్థాలు వంట ప్రక్రియలో కూడా నాశనం కావట. పైగా తిన్న కొన్ని గంటల్లోనే పక్షవాతం లేదా మరణానికి కారణమవుతాయని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా గత ఆరు రోజుల క్రితం యూపీలో ఉరికి సంబంధించిన రీల్ తీయడానికి ప్రయత్నించిన యువతి పొరపాటు జరిగి ప్రమాదవశాత్తు నిజంగానే ఉరికి బలయింది. బన్నా జిల్లాలోని మోహిని అనే 27 ఏళ్ల యువతి ఉరికి సంబంధించిన రీల్ తీద్దామని ప్రయత్నించింది. దానికనుగుణంగా ఫ్యానుకు తాడు కట్టి , తన మెడ చుట్టూ ఉచ్చు బిగించుకుంది. ఈ చిత్రాలను ఆమె మొబైల్లో చిత్రీకరించింది కూడా.. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ ఆమె కొద్దిసేపటి తర్వాత ప్రాణాలు కోల్పోయింది. తన నాలుగేళ్ల పాప తలుపు తీసేసరికి ఆమె విగత జీవిగా పడి ఉంది. తన తల్లికి ఏం జరిగిందో తెలియక ఆ చిన్నారి పెద్దగా ఏడ్చేసరికి చుట్టుపక్కల వారు వచ్చి చూడగా.. ఆమె ఫ్యాన్ కు వేలాడుతూ కనిపించింది. ఇక సమాచారం అందుకున్న పోలీసులు ప్రాథమిక విచారణలో రీల్స్ తీసే తొందరలో పొరపాటున స్టూలు జారీ ప్రమాదం జరిగి ఉండవచ్చని తెలిపారు. ఇది ఆ రెండు ఘటనలు మరువకముందే మరో ఘటన అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. కడపకు చెందిన ముబారక్ వస్త్ర దుకాణంలో పనిచేసేవాడు. అతడు గత వారం రోజుల క్రితం తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై రీల్స్ చేస్తూ దాదాపు మూడు కిలోమీటర్ల వరకు వెళ్ళాడు. ఇక వాహనం అదుపు తప్పడంతో ఇద్దరు కిందపడ్డారు. ముబారక్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యారు. రీల్స్ మోజులో పడి ఇలా బైకులపై స్టంట్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు ఇలా ఈ రీల్స్ మోజులో ఎంతోమంది యువత ప్రాణాలు కోల్పోవడం నిజంగా బాధాకరం అనే చెప్పాలి. అటు ప్రభుత్వాలు ఇటు అధికారులు ప్రజలలో అవేర్నెస్ తీసుకురావడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా.. ఇలాంటి కొన్ని యాప్స్ కారణంగా యువత తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. యువత అంటే కొంతవరకు తెలియని వైనం అని అనుకోవచ్చు.. కానీ వయసు మీద పడిన వారు కూడా ఇలా రీల్స్ పిచ్చిలో చేయరాని పనులు చేస్తూ అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. ఇకనైనా ఇలాంటి ఆలోచనలను పక్కనపెట్టి సవ్య దిశలో అడుగులు వేస్తూ సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలవాలని ఆశిద్దాం..

# భక్తుల కోరికలు నెరవేర్చే వేములాడ రాజన్న.. శివరాత్రికి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ముస్తాబు





వేములవాడ పుణ్య క్షేత్రంలో వెలసిన దేవుడు వేములవాడ రాజన్న గా తెలుగు నాట ఎంతో ప్రసిద్ధి. ఈ ఆలయానికి పౌరాణిక, చారిత్రిక ప్రాముఖ్యత ఎంతో ఉంది. వేముల వాడ పూర్వ నామం లేంబుల వాటిక. కాలక్రమంలో "లేంబుల వాడ" గా ఆ తర్వాత "వేముల వాడగా" రూపాంతరం చెందినది. ఈ ఆలయాన్ని చోళ రాజులలో ప్రముఖుడైన రాజ రాజ నరేంద్రుడు నిర్మించినట్లు చరిత్రకాధారాలున్నాయి. క్రీ.శ. 750 నుండి 175 సంవత్సరాలపాటు చాళుఖ్యులు, ఇక్ష్వాకులు. పరిపాలించినట్లు ఇక్కడ లభ్యమైన చారిత్రక ఆదారాలను బట్టి తెలుస్తున్నది. ఒకనాడు ఈ ప్రాంతం శైవ, వైష్ణవ, జైన మతాలకు కేంద్రంగా వుండేదని తెలుస్తున్నది. అనంతర కాలంలో ఈ ప్రాతం కాకతీయుల, డిల్లీ సుల్తానుల ఆధీనంలో వున్నట్లు చరిత్రను బట్టి తెలుస్తున్నది. రాజ రాజేశ్వరుని వేములవాడ రాజన్న అని ప్రేమతో పిలుచు కుంటారు. ప్రధాన ఆలయంలో రాజరాజేశ్వరునికి కుడి వైపున రాజ రాజేశ్వరీ అమ్మవారు, ఎడమ వైపున లక్ష్మి సమేత గణపతి ఉన్నారు. ఆలయ ముఖ ద్వారం పై గజలక్ష్మి, సింహ ద్వారానికి ఎదురుగా అనంత పద్మనాభ స్వామి ఆలయం వున్నది. ఆలయం చుట్టూ బాల రాజేశ్వర, విఠలేశ్వర, ఉమామహేశ్వర, బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయాలున్నాయి. సమీపంలో నగరేశ్వర, వేణుగోపాలస్వామి మొదలగు ఆలయాలున్నాయి. జగన్మాత స్వరూపిణి అయిన బద్ది పోచమ్మ ఆలయం కూడ వున్నది. దేవాలయం ప్రక్కనే వున్న ధర్మకుండం (పుష్కరిణి) చాల పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు. దక్ష యజ్ఞ సమయంలో వీరభద్రుని చేతిలో చేతులు కోల్పోయిన సూర్యభగవానుడు, ఈ పుష్కరిణిలో స్నానం చేయగా చేతులు వచ్చాయని పురాణ గాధ. దేవేరి శ్రీ పార్వతీ రాజరాజేశ్వరీదేవి సమేతుడై శ్రీ రాజరాజేశ్వరుడు లింగరూపంలో వెలసి నిత్య పూజలందు కుంటున్నాడు. శ్రీ కాశీనగరి, చిదంబరపురి, శ్రీశైల, కేదారాది శివక్షేత్రాల వలె వేములవాడ క్షేత్రం మహిమాన్వితమై భక్తకోటిని తరింప జేస్తున్నది.

లేంబాల వాటికగా, భాస్కర క్షేత్రంగా, హరిహర క్షేత్రంగా నామాంతరాలు కలిగివున్న ఈ క్షేత్ర ప్రశస్తి భవిష్యత్తోత్తర పురాణంలోని రాజేశ్వర ఖండంలో పేర్కొన బడింది. కృత యుగంలో దేవేంద్రుడు లోక కంటకుడైన వృత్తాసురుడు అనే రాక్షసుని సంహరించి తదనంతరం సంక్రమించిన బ్రహ్మహత్యా పాతకం తొలగించేందుకు పలు క్షేత్రాదులు తిరుగుతూ వేములవాడ క్షేత్రానికి విచ్చేసి ధర్మకుండ పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని అర్చించి పునీతుడైనట్టు రాజేశ్వర ఖండంలో వివరించ బడింది. త్రేతాయుగంలో దక్షుడు గంధమాదన పర్వతంపై యజ్ఞం చేయగా, శివ యజ్ఞ భాగలేమితో యున్న మంత్ర పూతమైన హవిస్సును సూర్యుడు తీసుకొని తన నిజబాహువులు కోల్పోయాడట. శతవత్సరముల అనంతరం సూర్యుడు విప్రుల సూచనలపై ఈ క్షేత్రంలో స్వామివారిని ఆరాధించి తిరిగి బాహువులు పొందినట్లు, అందుకే ఈ క్షేత్రానికి భాస్కర క్షేత్రమని పేరు వచ్చినట్లు పురాణాంతర్గత కథనం. దండకారణ్య ప్రాంత సంచారణ సమయంలో శ్రీ సీతారామ లక్ష్మణులు, అరణ్య వాసంలో పంచ పాండవులు ఈ క్షేత్రాన్ని సందర్శించి పూజలు చేసినట్లు, స్వామివారి కృపకు పాత్రులైనట్లు స్థలపురాణ విదితం. కాశీ, చిదంబరం, శ్రీశైలం, కేదారేశ్వరం లను పావనం చేసిన తరువాత శివుడు వేములవాడ వేంచేసాడని పురాణ కథనం. ఏ ఆలయంలోలేని ప్రత్యేక సాంప్రదాయం ఈ ఆలయంలో వున్నది. పిల్లలు పుట్టని దంపతులు పిల్లలు కలగాలని స్వామి వారికి మొక్కుకొని, పిల్లలు కలిగాక ఆ బాలునితో, ఒక కోడె దూడను తెచ్చి, ఆలయం చుట్టు తిప్పి ముందున్న స్థంబానికి కట్టి వెళతారు. దీన్నే కోడే మొక్కు అంటారు. కోడే దూడను తెచ్చుకోలేని దూర ప్రాంతం వారి సౌకర్యార్థం ప్రస్తుతం ఇక్కడ ఆ సమయానికి కోడే దూడలను అద్దెలకు ఇస్తారు. మహా శివ రాత్రి వంటి పర్వ దినాలల్లో కోడే మొక్కు చెల్లించుకొనే వారి సంఖ్య వేలలో వుండడాన్ని బట్టి చూస్తే ఈ ఆలయ ప్రాశస్త్యం ఎంత గొప్పదో తెలుస్తుంది. అదే విధంగా స్వామివారికి బెల్లం సమర్పించడం కూడ ఇక్కడున్న మరో ఆచారం. మరెక్కడాలేని మరో ఆచారం కూడ ఇక్కడ మరొకటి వున్నది. రోగాల బారిన పడిన లేక ఇతర కష్టాల బారిన పడిన స్త్రీలు రాజరాజేశ్వరునికి మొక్కుకొని అవి తీరాక ఆది బిక్షువు అడుగు జాడల్లోనే జీవితాంతం బిక్షాటన వృత్తిగా చేసుకొని, పార్వతిగా మహా శివునికే అంకితమై పోతారు. అలాంటి వారు ఈ ప్రాంతంలో వేల సంఖ్యలో వుంటారు. శివరాత్రి రోజున మూడు లక్షలకు పైగా భక్తులు రాజరాజేశ్వర స్వామిని సేవించుకుంటారు. ఆ రోజున ప్రత్యేక పూజలు జరుపుతారు. వంద మంది అర్చకులతో మహాలింగార్చన జరుపుతారు. అర్ధరాత్రి వేళ శివునికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తారు. రాత్రివేళ దీపాలంకరణలతో దేవాలయం దేదీప్యమానంగా వెలుగుతూ ఉంటుంది. భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. వేములవాడ కరీంనగర్‌కు 36 కిమీల దూరంలో కరీంనగర్ – కామారెడ్డి దారిలో ఉంటుంది. హైదరాబాద్ నుంచీ, కరీంనగర్ నుంచీ ఎక్స్ ప్రెస్ బస్సులు నడుస్తుంటాయి. ఈ నెల 15న మహా శివరాత్రి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. 15న ఆది వారం ఉదయం 3.30నుండి 3.40వరకు ఆలయ శుద్ధి, మంగళ వాద్యాలు, 3.40నుండి 4.20వరకు సుప్రభాతం, 4.30నుండి 6వరకు ప్రాతః కాల పూజ, అనువంశిక అర్చకుల దర్శనం, 7గంటలకు టిటిడి మరియు 8గంటలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన పట్టు వస్త్రాల సమర్పణ, సాయంత్రం 4గంటలకు శివ దీక్షా స్వాముల దర్శనం, 6.05గంటలకు శ్రీ స్వామివారి కళ్యాణ మంటపంలో మహా లింగార్చన, రాత్రి 11.35కు లింగోద్భవ కాలమందు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# ప్రాచీన శిల్పకళకు ప్రతిరూపంధర్మపురి శివాలయం.. శివరాత్రికి ముస్తాబైన రామలింగేశ్వరాలయం...



భారత దేశ ప్రాచీన సంస్కృతీ సభ్యతలకు నిలయంగా సనాతన సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా, వేదవేదాంగ శాస్త్రాగమ, నృత్య గీత నాట్యాది సకల కళలయందు నిష్ణాతులైన ధార్మిక కార్యాదరణా సక్తులైన ప్రజానీకంతో, మరెచ్చటా కానరానన్ని ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్న పలు దేవాలయాల సముదాయం కలిగి, రాష్ట్రంలో సుప్రసిద్ధ ప్రాచీన పవిత్ర గోదావరి తీరస్థ తీర్థంగా, పుణ్య క్షేత్రంగా మిగుల ప్రాచుర్యం పొందింది నాటి అవిభక్త కరీంనగర్, నేటి నూతన జగిత్యాల జిల్లాలోని ధర్మపురి క్షేత్రం. శ్రీలక్ష్మీనరసింహ, శ్రీరామలింగేశ్వరస్వాముల దేవాలయాలు, మసీదూ పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ, ముస్లిం మత సామరస్యానికి సాక్షీ భూతంగా నిలిచియుంచీ క్షేత్రరాజం. గంభీర గౌతమీనది తీరాన వెలసి, అలనాటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబమై పౌరాణిక ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని దక్షిణ కాశిగా పేరెన్నికగనుటకు మూలకారణమైనది ఈ క్షేత్రం లోని శ్రీరామచంద్ర స్థాపిత శ్రీరామలింగేశ్వరాలయం. భృగు మహర్షి త్రిమూర్తులను పరీక్షించిన నేపథ్యంలో, కైలాస మేగిన సందర్భంలో, నిత్యానందంలో మునిగి తేలుతూ, ఆ మహర్షి రాకను గమనింపని పార్వతీ పరమేశ్వరులను గాంచిన భృగు మహర్షి, శివుడు లింగరూపులో ఉంటూ, ఎవరిచేత పూజింపబ డకుండునట్లు శాపమిచ్చెనని పురాణాలు విశదీకరిస్తున్నాయి. తన శాప విముక్తి పరమ శివుడు, మహా విష్ణువును గురించి ఘోర తపస్సు చేయగా రామావతారంలో, ధర్మపురి క్షేత్రంలో స్వయంగా తాను లింగాన్ని ప్రతిష్టించి, పూజించి శాప నిమోచనం కలిగించ గలనని మహా విష్ణువు వరమిచ్చినట్లు స్థానిక పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. రామావతారంలో దశరథుని ఆజ్ఞానుసారం వనవాస దీక్షలో, దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి క్షేత్రానికి ఏతెంచిన శ్రీరాముడు అలనాటికే వెలసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈశాన్యాన, సైకత (జసుల) లింగాన్ని ప్రతిష్ఠ చేసినట్లు, శ్రీరామునిచే స్థాపించ బడినందున శ్రీరామలింగేశ్వరుడని నామాండితుడై నట్లు స్థల పురాణం స్పష్టం చేస్తున్నది. ఆరవ శతాబ్దంలో స్థాపించబడి, ఎనిమిదవ శతాబ్దాంతం వరకూ వర్ధిల్లిన చాకుక్య రాజుల ప్రాభవంలో పునర్మించ బడిన రామేశ్వరాలయంలోని గణేశ విగ్రహములు అలనాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. క్రి.శ.973 నుండి 1140 వరకు పాలించిన కల్యాం చాళుక్యుల వంశానికి చెందిన విక్రమార్క బిరుదాంకితుడుగు ఆరవ విక్రముని (1076–1126) నాటి శిలాశాసనం ఈ ఆలయంలో ఉంది. ఇందులో ఈ చాళుక్యరాజు పరమేశ్వర, రణ రంగభైరవ, మార్వల భైరవ, ఆయత గంధ వారణ, విక్రమాదిత్య బిరుదులతో ప్రశంసింప బడినాడు. శాలివాహన శకం 1168 పరాభవ నామ సంవత్సర కాలం నాటి కాకతి గణపతి దేవుని శిలాశాసనం రామేశ్వరాలయంలో పూర్వపు చాళుక్య స్థంభం పైనే చెక్కబడి ఉంది. గణపతి దేవుడు ఇచటి రామేశ్వర, చండికల అంగరంగ వైభోగములకు గావించిన కొన్ని దానములు శాసనములలో పేర్కొనబడినవి. చాళుక్య శైలిలో బొజ్జ ఎత్తుగా నుండి, సహజమైన ఏనుగు తలను కలిగి, మానవ రూపంలేని గణపతి విగ్రహం ఆలయ సముదాయంలో నుంది. శివాలయ శిఖర నిర్మాణంలో చాళుక్య శైలి ఉంది. శిఖరం చాపాకృతిని పోలి. కిందనుండి పైకి ఎక్కుపెట్టిన విల్లులా ఉంది. శిఖర సౌందర్యానికి పైన ఆమలకములు వృత్తకారంలో చుట్టూరా కలిగి, ఆంతకుపైన కలశం, తూర్పున శుక నాసం ఉన్నాయి. శుక నాసం చిలుక ముక్కు లాగ ముందుకు పొడుచుకు వచ్చిన గూడు, శిఖర నిర్మాణం ఉత్కళ శైలిలో, లింగరాజ స్వామి ఆలయం (భువనేశ్వర్) దేవాలయ శఖరాకృతిని పోలి ఉంది. ప్రవేశ మంటపం తర్వాత దూరంగా గర్భాలయంలో మొదట ముఖ మంటపం ఉండి. మధ్యన గల రంగ శిల ప్రాచీనంగా నర్తకీమణుల వేదిక, నేడు అది వల్ల బండ.తర్వాత చీకటిగా.నుండే అంత రాళం, అపైన గర్భ గృహం. అందు శ్రీరామచంద్ర స్థాపిత సైకత (జముక) లింగం, ముఖ మంటపము, ప్రవేశ మంటపము, గర్భ గృహములు, ఆలయ ప్రాంగణంలో దాటితే శివుని దర్శనం. అలయ ప్రాంగణంలో మూడు ద్వారాలకు ఆభిముఖంగా నల్లరాతితో నిర్మించిన ఆభరణాలు అధికంగా గల, పీఠంపై ఉబ్బెత్తు హారాలు గలిగి, కాకతీయ ఆల యాలలోవలె శిలాకృతులు, జిలుగు నగిశీలు, మెడలో గంటలు, మువ్వల పట్టి, మెడ పట్టెడలు, గంగడోలు, వంపు తిరిగిన మెడ, వృహణాలతో నందులు ఉన్నాయి. పైకప్పుపై అపురూపాలైన ఏక ముఖ ద్వి దేహ నందులు నాలుగు మూలల ఉండేవి. సాలహార పునర్నిర్మాణ సమయంలో కూల్చి వేయడం జరిగింది. దేవాలయం కప్పుకన్నా ఎత్తుగా, నిటారుగా 15అడుగుల ఎత్తు ఉన్న ధ్వజ స్థంభం (విజయ స్థంభం) ఉంది. శివాలయ ఈశాన్య భాగాన గణపతికి ప్రత్యేక గుడి ఉంది. ఇది కూర్చొని ఉన్న భారీ విగ్రహం. చాళుక్యుల కాలం నాటి విగ్రహానికి కుడి చేతులో గద ఉంది, నాగభంధం కలదు .ఎడమ చేతిలో గండ్రగొడ్డలి వంటి ఆయుధం, ఎడమ కింది చేతిలో మోదకాలు (ఉండ్రాళ్ళు) ఉన్నాయి. చెవులు చేటంత విశాలంగా ఉన్నాయి. రెండు వీర గల్లుల శిల్పాలున్నాయి. పదాతిదళపు వీరుడు శతృవులను చీల్చి చెండాడు తున్న దృశ్యం, ప్రాంగణం బయట నాగిని విగ్రహముంది. పైన నాగుల ఐదు పడగలతో కింద స్త్రీమూర్తి, చివర తోక, లేకుండా ఉంది. ఎనిమిది చేతుల మహిషాసుర మర్ధిని విగ్రహం ఉంది. అలాగే అపురూపాలైన బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ లేదా వరాహ పురాణంలో చెప్పబడిన యోగీశ్వరి ఆదిగా సప్తమాతృకల విగ్రహాలున్నాయి. ఓకే పీఠంపై చతురస్రాకార శిల్పమిది. ఇరు పార్శ్వా లలో గణపతి వీర భద్రుని విగ్రహాలు ఉన్నాయి. ప్రధాన దైవత లింగం కాక, ముఖ మంటపంలో వాయవ్యాన కాశీ విశ్వనాథుడు పేరుతో పూజలందుకునే 4 అడుగుల ఎత్తుగల లింగం ఉంది. దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి గోదావరిలో స్నానమాచరించి, శివ పూజ చేసేందుకు, హనుమంతుని లింగం తెమ్మని కాశీకి పంపగా, ప్రతి ప్రతిష్టించే సమయానికి ఆంజనేయుడు రాని స్థితిలో, సైకత లింగ ప్రతిష్ట గావించారని, ఆలస్యంగా ఏతెంచిన హనుమ సేవలు వ్యర్థం కాకుండా, హనుమల్లింగాన్ని ప్రతిష్ఠచేసి, ఆ లింగాన్ని పూజించాకే, గర్భాలయంలోకి వెళ్ళేలా నియమం శ్రీరాముడు ఏర్పరచారని స్థల పురాణం స్పష్ట పరుస్తున్నది. ఆలయంలో 13వ శతాబ్దం కాలంనాటి చండిక విగ్రహం కలదు. ఈ విగ్రహంలో అమ్మవారు చక్రస్తని, త్రిశూల, ఖడ్గహస్త, మకుట ధారిణి, చతుర్భుజ, శూల ధారిణిగా ఉంది. కాశీ విశ్వనాథుని పక్కన ప్రాచీన పార్వతీదేవి శిల్పం, మహిషాసుర మర్ధిని, షణ్ముఖుడు (కుమార స్వామి), ఉమా మహేశ్వరులు విడివిడిగా నల్ల శిలపై మలచబడి ఉన్నాయి. ఆలయంలో విక్రమాదిత్యుని, గణపతి దేవుని, ప్రధాన ద్వార కడప ముందర, బంకుళ్ళలో, దక్షిణ ప్రవేశ ద్వార స్థంభం, నైరుతి దిశలో ప్రహరీగోడ బాహ్యాది ఆరు శాస నాలున్నాయి. చుట్టూ రథం తిరిగేంత ప్రాంగణం, 10 అడుగుల ప్రహరీ కలిగి ఉన్నదీ ఆలయం. చారిత్రిక నేపథ్యం ప్రకారం, క్రీ.శ.1309లో ఢిల్లీనేలిన అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాఫూర్, ఇందూరు (నిజామాబాద్ ) మీదుగా ధర్మపురి మార్గంలో కాకతీయుల పైకి దండెత్తి వెళ్ళిన సమయంలో క్షేత్రంలోని రామేశ్వర, నృసింహాలయాలు ధ్వంసం చేయబడినవి. క్రీ.శ.1332–1367 మధ్యకాలంలో తెలంగాణా లోని వెలమ వీరుల సాయంతో, ముస్లింల నుండి దాస్య విముక్తి కలిగించిన ముసునూరి కాపయామాత్యుని పాలనా కాలంలో, పరమహంస పరి వ్రాజకాచార్య నారాయణాశ్రమ స్వామి ఉభయ దేవాలయాలకు చేయూతనిచ్చి తిరిగి అర్చనాదు లకై కట్టుదిట్టం చేశారు. అబుల్ హసన్ తానాషా(1674–1687) మంత్రియగు మాదోభా నూజీ సూర్యప్రకాశ రావు మజుందార్ (మాదన్న మంత్రి) ఉభయ ఆలయాల అర్చనకు సహకరించారు. నాటినుండి స్థానిక దాతలైన విప్రవరుల, ఆర్యవైశ్యుల, భక్తుల సహకారంతో పూజా నైవేద్యాది విధివిదాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, కొంతకాలం క్రితం దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలోనికి తీసుకో బడింది. ఫలితంగా లక్ష్మీనరసింహ దేవస్థానంలో అంతర్భాగమైంది. వివిధ ధర్మకర్తల మండలుల కృషితో, దాతల చేయూ తతో నిధులను ప్రోగుచేసుకుని ముఖ్యమంత్రి సర్వశ్రేయో నిధి ద్వారా ప్రత్యేక నిధులు పొంది దేవాలయ పునరుద్ధరణ, సాలహార నిర్మాణం, అమ్మవారు, నంది, కలష, నవగ్రహ విగ్రహ ప్రతిష్టలు పూర్తి చేసుకుని , శృంగేరి శంకరాచార్య బహూకృత ఆదిశంకర, శారదామాత మూర్తులను ఆలయంలో ప్రతిష్టిం చడం జరిగింది. శివరాత్రి, శివ కళ్యాణం, రథోత్సవం, గణపతి నవగ్రహ పూజలు, శంకర జయంతి, శరన్నవరాత్రుల ఉత్సవాలను, నరసింహ స్వామివారల బ్రహ్మోత్సవ వేడుకలలో అంత ర్భాగంగా ఉత్సవాలను ఈ ఆలయంలో ఏడా సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల మార్గదర్శకత్వంలో సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు విశ్వనాథం, ప్రవీణ్ కుమార్, సిబ్బంది, ఏర్పాట్లు చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ - ఫిబ్రవరి 15...సేవాలాల్ మహారాజ్ జయంతి



సంత్ సేవాలాల్ మహారాజ్‌ను లంబాడీలు దేవుడిగా భావించి కొలుస్తారు. ఆయన జయంతిని పండుగలా జరుపు కొంటారు. గిరిజ నులకు చైతన్యం కలిగించి, వారికి దశ – దిశను చూపి, హైందవ ధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని పేర్కొంటారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపం చానికి చాటేలా అహింసా సిద్ధాం తానికి పునాదులు వేసి, సంత్ సేవాలాల్ ఇతర కులాల వారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారు. 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీనాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారు. జగదాంబ మాతనే తన మార్గ దర్శకురాలిగా, గురువుగా స్వీకరించి ఆమె ఆదేశానుసారం బంజారాల సేవలో నిమగ్న మయ్యారు. సేవా లాల్ ప్రజల మూఢ విశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి. బంజా రాలు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు వివిధ రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తుండే వారు. రాజుల కాలం నుం చి బ్రిటిష్ కాలం వరకు బంజారాలు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగించే వారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లిం పాలకుల మత ప్రచారంతో బంజా రా సమాజం అనేక ఇబ్బందులకు గురయ్యింది. అలాంటి పరిస్థితుల లో బంజారాలను మంచి మార్గంలో నడిపించడానికి సేవాలాల్ అవత రించారని చెపుతారు.సాతీ భవానీ (సప్త మాతృకల)' పూజ విధానా లు ఆచరించే బంజారాల జాతికి ఆయనే దార్శనికుడు. ఆయన బోధనల ద్వారా బంజారా జాతి నడచుకుంది. లిపిలేని బంజారాల భాషను ఒక పద్ధతిగా మార్చాడు. సేవాలాల్ శివ పూజారి. ఆయన తండ్రి, తాతలు తెగ పెద్దలు. తొమ్మిది రోజుల పాటు పెళ్లికాని యువతులు తీజ్ ఉత్సవాల్లో పాల్గొని తమకు వివాహం కావాలని పూజలు చేయడం తీజ్ ఉత్సవ సాంప్రదాయం. సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రజల కోసం చేసిన ఉద్యమాలలో ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం వంటివి ఉన్నాయి. సన్మార్గంలో తన జాతిని నడిపించి భారత దేశంలోని దాదాపు 10 కోట్లకు పైగా బంజారా లకు ఆరాధ్య దైవంగా ఆయన నిలిచారు. సేవాలాల్ మహారాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారు. వీరిలో 'పెరిఫర్' ఒకటి. ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులు అరికట్టడం, క్షేత్ర ధర్మాన్ని రక్షించడం మొదలైనవి ముఖ్యమైనవి. అహింస మహా పాపమని, మద్యం, ధూమ పానం శాపమని హితవు పలికాడు. ఆ రోజుల్లో నే బంజారాల పరువు ప్రతిష్టల గురించి ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేశాడు. సంత్ సేవాలాల్ మహారాజ్ మహిమలు అద్భుతమైనవిగా చెప్పు కుంటారు. మహిమల గురించి అనేక కథనాలు ఉన్నాయి. వాటిలో పురుషున్ని స్త్రీగా మార్చడం, ఒక ముంత బియ్యంతో 10,000 మందికి భోజనాలు పెట్టడం, చనిపోయిన వ్యక్తిని మూడు దినాల తరువాత బ్రతికించడం, విషం కలిపిన తీపి వంటకాలను నిర్వీర్యం చేయడం. ఉదృతంగా పారే ప్రవాహాన్ని ఆపి తమ తండా ప్రజలను, ఆవులను దాటించడం లాంటి మహిమలను ప్రదర్శించారని చెపుతారు. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని, సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్య సాహసాలకు ప్రతీకలనీ చరిత్ర ద్వారా స్పష్టం అవుతున్నది. బంజా రాలు రాజపుత్రుల వలె దృఢ కాయు లని, చరిత్ర కారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నాడు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ సైన్యంలో బంజారాలు వీరోచితంగా పోరాడి నట్లు చరిత్ర చెపుతున్నది. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నా రని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబు లు వారి ధైర్యసాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చారని గ్రంథస్థం అయి ఉంది. సభ్య సమాజానికి బహు దూరంగా, అడవి తల్లి ఒడిలో ఉంటూ, అటవీ వనరులపై ఆధార పడుతూ, ప్రత్యేక జీవన విధానం కలిగి ఉన్న, అంతగా అభివృద్ధి చెందని తెగల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు ప్రణాళికా బద్ధ కార్యక్ర మాలు అమలు చేస్తున్నా, ఇంకా చేయాల్సిన అవసరం అనివార్యం గా ఉంది. తరతరాలుగా జాతి వివక్షకు గురవుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న లంబాడాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

చురకలు



# మెడి'కిల్' దుకాణాలు

భువనగిరి : ప్రాణాలు కాపాడాల్సిన ఔషధాలను ఇష్టారాజ్యంగా విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు కొందరు దుకాణదారులు. ఫార్మసీ కోర్సు చేసిన వారి పర్యవేక్షణలో యాంటీబయాటిక్స్, ఇతర హైపవర్ మందులు విక్రయించాలి. గ్రామాల్లో ఎవరు పడితే వారు అన్ని రకాల మందులను అమ్ముతు న్నారు. జిల్లాలో అనుమతులు పొందిన మందుల దుకాణాలు 651, ఔషధ తయారీ పరిశ్రమలు 26 ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు మాత్రం ఔషధ నియంత్రణ అధికారి (డ్రగ్ ఇన్‌స్పెక్టర్) ఒక్కరే ఉన్నారు. అదనపు బాధ్యతలు ఉండటంతో పూర్తిస్థాయిలో నియంత్రణ కొరవడింది.

**విక్రయించాలంటే..**

ఔషధాలు అమ్మాలంటే.. డ్రగ్ అండ్ కాస్మెటిక్ యాక్ట్ (పూర్వం చట్టం) ప్రకారం 20-హెచ్ ఓటీసీ డ్రగ్ లైసెన్స్ జారీ చేస్తారు. వీటిల్లో ఫార్మసిస్టు అవసరం లేదు. కేవలం 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అనుమతులు పొందవచ్చు. డాక్టర్ చీటి అవసరం లేకుండా విటమిన్స్, యాంటాసిడ్స్, జ్వరం నొప్పుల కోసం పారాసెటమాల్, టీవీల్లో ప్రకటనలు వచ్చే అన్ని రకాల సాధారణ మందులను అమ్ముకోవచ్చు. విడిగానే దుకాణం ఏర్పాటు చేసి విక్రయాలు జరపాలి.

ఇక అన్నిరకాల ఔషధాలు విక్రయించాలంటే మాత్రం బి.ఫార్మా, డి.ఫార్మా కోర్సు చేసిన వారికి మాత్రమే లైసెన్స్ జారీ చేస్తారు. ఔషధ నియంత్రణ అధికారి నుంచి ఫారం-20, 21 అనుమతి విధిగా తీసుకోవాలి. ఫార్మసిస్ట్ పర్యవేక్షణలో విక్రయాలు జరగాలి.

డి.ఫార్మసీ, బి.ఫార్మసీ పట్టాలున్నవారికి ఏడాదికి రూ.18 వేలు నుంచి రూ.24 వేలు చెల్లించి వారి పేరిట లైసెన్సులు తీసుకుని వ్యాపారులు



మెడికల్ దుకాణాలు నిర్వహిస్తున్నారు.

చౌటుప్పల్ పట్టణంలోనే 50 వరకు దుకాణాలున్నాయి. ఔషధాలు నిల్వ చేయడానికి ఎయిర్ కండిషనింగ్ చేసిన గది, రిఫ్రిజిరేటర్ సౌకర్యమున్న చోట దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇక్కడ చాలా వరకు చిన్న ఇరుకు గదుల్లో నెలకొల్పారు. సగానికిపైగా దుకాణాల్లో లైసెన్సు లేనివారే నడుపుతున్నారు.

ఆత్మకూరు మండలంలో 15 మందుల దుకాణాలు ఉండగా ఎందులోనూ అర్హతలున్న ఫార్మసిస్టులు లేరు.

**గత ఏడి 41 కేసులు నమోదు చేశాం**

– ఆలె బాలకృష్ణ, జిల్లా ఇన్‌ఛార్జి ఔషధ నియంత్రణ అధికారి

ఔషధ నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటున్నాం. బిల్లు ఇవ్వకపోయినా, డాక్టర్ చీటీ లేకుండా హైపవర్ యాంటీబయాటిక్స్ విచ్చల విడిగా విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. గత ఏడాది 41 దుకాణాలకు అనుమతులు రద్దు చేశాం. తనిఖీలు చేపట్టి నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఔషధ ప్రయోగశాలకు పంపిస్తాం.

# దమ్ము చక్రం.. జర భద్రం

మోత్కూరు : ఈ నెల 3న మోత్కూరు మండలం సదర్శాపురంలో యువరైతు యాకరాజు ఫుల్ వీల్స్‌తో పొలం దున్నుతూ ట్రాక్టర్ తిరగబడటంతో కల్టివేటర్ మధ్యలో ఇరుక్కొని మృతి చెందాడు.

ఈ నెల 2న డ్రైవర్ రాకపోవడంతో చిట్యాల మండలం ఏపూరు గ్రామానికి చెందిన రైతు శ్రీశైలం స్వయంగా తాను పొలం దున్నుతుం డగా ట్రాక్టర్ తిరగబడి అక్కడికక్కడే మృతి చెందారు.ట్రాక్టర్లు ఫుల్ వీల్స్‌తో వెళుతుండటంతో రోడ్డు ఛిద్రం అవుతుందని అడ్డగూడూరు మండలం ధర్మారం, లక్ష్మదేవికాల్వ గ్రామాల ప్రజలు ఇటీవల స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొలాలన్నీ ఒకే విధంగా ఉండవు. భూమి ఎలాంటిదో డ్రైవరు గుర్తించడం లేదు. గట్టి ప్రదేశానికి వెళ్లడానికి యాక్సిలేటర్‌ను ఎక్కువగా ఇస్తుంటాడు. ఆ సమయంలో బరువంతా చక్రాలపై పడటం, ముందు టైర్లు బరువు లేకపోవడంతో ట్రాక్టర్ బోల్తాపడే అవకాశం ఉంటుంది. పొలం చివరి మూలల్లో ఎక్కువసార్లు వీల్స్ నడుస్తుంటాయి. దీంతో ఆ ప్రాంతంలో లోతుగా తయారవుతుం ది. వేగంగా వెళ్లే సమయంలో దిగబడి బోల్తా పడుతుంది. పొలం దున్నేటప్పుడు వేగంగా వెళ్లి ఒక్కసారి బ్రేకు వేయడంతో అదుపుతప్పే అవకాశం ఉంది. ప్రతి సీజన్‌లో ట్రాక్టర్ తిరగబడి ఎక్కువ శాతం యువ రైతులు మృతి చెందుతున్న ఘటనలు ఉమ్మడి జిల్లా వాసులను కలచివేస్తున్నాయి. దిగబాటు పొలం దమ్ము చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించకపోవడం, రైతులే స్వతహాగా ట్రాక్టర్‌ను నడపడం ప్రమాదాల కు కారణాలవుతున్నాయి. అవగాహన లోపం, అజాగ్రత్తగా ట్రాక్టర్లను నడపడం వల్ల చోదకులు తమ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

**ఇవి పాటించాలి..** దిగబడే పొలంలో సీనియర్ డ్రైవర్లతోనే దమ్ము చేయించాలి. దున్నేటప్పుడు దిగబడి ఇంజిన్ అమాంతం లేస్తుంటే.. దుక్కి చేయడం ఆపేసి, మరో ట్రాక్టర్ సాయాన్ని తీసుకోవాలి.

దిగబడే పొలాల్లో మాత్రం ఫుల్ వీల్స్‌తో దమ్ము చేయడం మేలు.

కల్టివేటర్ లేకుండా దమ్ము చేయకూడదు. అది ఉంటే తిరగబడే అవకాశాలు తక్కువ. బురదలో ఒకసారి దున్నిన తర్వాత దుక్కి ఆరకుండా జాగ్రత్తలు



తీసుకోవాలి. ఆరితే దిగబడుతుంది.

చౌడు నేలల్లో దిగుబాటు ఎక్కువ. ఆ పొలాల్లోనే మెలకువలతో దమ్ము చేసుకోవాలి.ట్రాక్టర్ కండిషన్‌ను పొలంలోకి దిగకముందే పరిశీలించు కోవాలి. చోదకుడు ఒకే వేగంతో నడపాలి. ముందు టైర్లు లేవకుండా బరువు ఉంచాలి.

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దుశ్రీనివాస్‌రెడ్డి, కోదాడ డీఎస్పీ రైతులు దమ్ము చేసే సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారు. నైపుణ్యాలు తెలిసిన డ్రైవర్లతోనే దుక్కి చేయించాలి. అప్పటికీ దిగబడితే మరో ట్రాక్టర్ సాయంతో చేయించుకోవాలి. అనాలోచిత నిర్ణయాలతో అన్నదాతలు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

# పగలు రెక్కీ.. రాత్రి చోరీ



హుజూరాబాద్ : యాసంగి సీజన్ ప్రారంభం కాగా.. నాటు వేసిన వరి పిలక స్థాయికి చేరుకొంది. ఈ సమయంలో నీటి తడులు కీలకం కావటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాకతీయ ప్రధాన కాలువ, వ్యవసాయ బావులకు విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకొని పొలాలను సాగు చేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన దొంగలు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. మోటార్లను ఎత్తుకెళ్తుండటంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

**డివిజన్‌లో 80 వేల ఎకరాల్లో వరిసాగు**

హుజూరాబాద్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో 80 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు వ్యవసాయ బావులకు.. కొందరు కాకతీయ ప్రధాన కాలువకు మోటార్లు ఏర్పాటు చేసుకొన్నారు. కంపెనీ బట్టి ఒక్కో మోటారుకు రూ.15 వేల నుంచి దాదాపు రూ.40 వేల వరకు ధర ఉంటుంది. వాటిని కాలువ, బావి గట్టుకు బిగించుకుంటుండటంతో తెల్లారే వరకు ఉంటాయో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**రికవరీ జాడ లేదు** శంకరపట్నం, హుజూరాబాద్ మండలాల్లో గ్రామ శివార్లను అడ్డాగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పగలు రెక్కీ నిర్వహిస్తూ.. రాత్రి వేళల్లో మోటార్లు తస్కరిస్తున్నారు. గతేడాది శంకరపట్నం మండలం ఇప్పలపల్లికి చెందిన రైతు రమణారెడ్డి విద్యుత్తు మోటార్లను కాపాడుకునేందుకు పొలం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. అయినా మోటారు చోరీకి గురైంది. కెమెరాల ఫుటేజీలను పోలీసులకు అప్పగించినా రికవరీ కాలేదు.

**మచ్చుకు కొన్ని ఘటనలు**

శంకరపట్నం మండలం ఇప్పలపల్లిలోని పలువురు రైతులకు చెందిన కరెంటు మోటార్లు రెండేసి సార్లు సుమారు 13 చోరీ అయినట్లు బాధితులు చెబుతున్నారు.

కరీంపేట శివారులో గత అయిదు రోజుల వ్యవధిలో ఎనిమిది మోటార్లు చోరీకి గురయ్యాయి.

ఇటీవల హుజూరాబాద్ మండలం కందుగుల శివారులో మూడు మోటార్లను ఎత్తుకెళ్లారు. **రూ.1.15 లక్షల నష్టం** అయిదు మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన నేటికీ వాటి జాడ లేనేలేదు. ఒక్కో దానికి రూ.23 వేలు ఉంటుంది. మొత్తం కలిపి రూ.1.15 లక్షల నష్టం వాటిల్లింది. – రమణారెడ్డి

# ధర వింటే.. నో'టమాట' రావడం లే..!



మునుగోడు : వ్యవసాయాన్నే జీవనాధారంగా చేసుకున్న రైతులు ఏటేటా నష్టాలను చవిచూస్తున్నారు. ఒక పంటపైనే కాకుండా వినూత్న రీతిలో పంట మార్పిడి చేసినా ఆశించిన ఫలితాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి తగ్గినప్పుడు ఎన్నడూ లేని విధంగా ధరలు పలుకుతాయని, ఊహించనంత దిగుబడి వస్తే అసలు మద్దతు ధరనే ఉండట్లేదని కలత చెందుతున్నారు. కనీసం పంట పెట్టుబడి మాత్రం కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు లబోదిబోమంటున్నారు.

**25 కేజీలు రూ.150లకు..**నల్గొండ జిల్లా మునుగోడు పట్టణానికి చెందిన బొడ్డు యాదగిరి మండలంలోని కొంపల్లి గ్రామంలో 20 ఎకరాలను కౌలుకు తీసుకున్నారు. అందులోని రెండు ఎకరాల్లో రూ.2 లక్షల దాకా పెట్టుబడి పెట్టి అక్టోబరు చివరి వారంలో మల్చింగ్ పద్ధతిలో టమాటను సాగు చేశాడు. జనవరి చివరి వారం నుంచి పంట దిగుబడి మొదలైంది. కానీ మార్కెట్లో కనీస మద్దతు ధర లేకపోవడంతో 25 కేజీల టమాట పెట్టెను రూ.100 నుంచి 150కే హోల్‌సేల్ ధరకు తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు అమ్మితే రూ.50 వేలు మాత్రమే వచ్చాయనీ, కనీసం పెట్టుబడి ఖర్చు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఒక్కో కూలీకి రోజూ రూ.500 చొప్పున చెల్లించాల్సి వస్తుందని, పంటను విక్రయిస్తే రోజు కూలీ డబ్బులు కూడా రావడం లేదన్నారు. మాములు రోజుల్లో కేజీ రూ.50 పలికితే, ఇప్పుడు కేజీకి రూ.5 కూడా వచ్చే పరిస్థితి కనిపించట్లేదన్నారు. ఇంకా చేనులో ఉన్న సుమారు టన్నుకు పైగా టమాటను తెంచి, విక్రయించాలనే ఆశ కూడా లేకుండా పోయిందని బాధిత కౌలు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సోమేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వేళాయే



పాలకుర్తి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్వయంభూ శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. ఆలయ అధికారులు జాతర ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయాన్ని రంగులు, విద్యుత్తు దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, బారికేడ్లను నిర్మించారు. సేద తీరేందుకు, జాగారాలు చేసేందుకు చలువ పందిళ్లు నిర్మించారు. తాత్కాలికంగా శౌచాలయాలు, సాన్నఘట్టాలను నిర్మించారు. దేవస్థానం ఆవరణలో 6 ఎల్‌ఈడీ తెరలను ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాలకు నిలిపేందుకు ఆలయానికి మూడు వైపుల పార్కింగ్ స్థలాలను కేటాయించారు. నిరంతరం జాతర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల పారిశుద్ధ్య కార్మికులను వినియోగించనున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు హనుమకొండ, జనగామ, తొర్రూరు... సూర్యాపేట నుంచి ప్రత్యేకంగా బస్సులు నడపనున్నారు. జాతర ఏర్పాట్లపై శనివారం స్థానిక క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో సిబ్బంది ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

కార్యక్రమాలు ఇలా..: 14న ధ్వజారోహణ, 15న సోమేశ్వరుని కల్యాణ మహోత్సవం, 16న రథోత్సవం, బండ్లు తిరుగుట, 18న అగ్నిగుండములు, మహాఅన్నపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**ఏర్పాట్లు పూర్తి..– భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ ఈవో**

జాతరకు రెండు రోజులకు ముందే ఏర్పాట్లు పూర్తి చేశాం. మహాశివ రాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర నూతనంగా దాతల సహకారంతో రూ. 10 లక్షలు వెచ్చించి ఘాట్‌రోడ్డుపై శాశ్వతంగా క్యూలైన్లను నిర్మించాం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గతంలో కంటే మెరుగ్గా ఈసారి జాతర ఏర్పాట్లు చేస్తున్నాం.

# కొత్త కార్మిక కోడ్‌లను రద్దు చేయాలి!

ఆదిలాబాద్ : కొత్త కార్మిక కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని ఆదిలాబాద్ శాఖ ఎల్ఐసీ బీమా ఉద్యోగుల సంఘం బాధ్యులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఆదిలాబాద్ శాఖ కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని సమయాన్ని 8 నుంచి 12 గంటలకు పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో సంఘం అధ్యక్షుడు నసీరుద్దీన్, ఉపాధ్యక్షుడు గణేష్, సభ్యులు ఫహీం సిద్ధికి, రాజేంద్రప్రసాద్, జగదీశ్వర్ రెడ్డి, శ్రీరామ్, శ్రీధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.




# స్థాయి పెంచినా.. వసతులు అంతంతే!

ధర్మపురి : ధర్మపురి పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని 50 బెడ్లకు ఉన్నతీకరించినా సమస్యలు అదే స్థాయిలో ఉన్నాయి. రోగులకు తాగునీరు, సరైన భోజన వసతులు కరవయ్యాయి. రోగుల తాకిడి విపరీతంగా పెరిగినా అసౌకర్యాలతోనే నెట్టుకొస్తున్నారు. ప్రతిరోజు ధర్మపురి క్లస్టర్? దవాఖానాకు ధర్మపురి, బుగ్గారం, బీర్?పూర్, వెల్గటూర్, పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట ప్రాంతం నుంచి 150 మంది రోగులు వైద్య పరీక్షలు, చికిత్సలు, ప్రసూతి సేవలకు వస్తుంటారు. వైద్య సిబ్బంది, పరికరాల కొరతతో అత్యవసరమైతే జగిత్యాల ఆస్పత్రికి పంపిస్తున్నారు.

**ఐసీయూ వార్డు ప్రారంభమెప్పుడు?**

ఆసుపత్రి స్థాయిని గతంలోనే అప్‌గ్రేడ్ చేయగా.. వైద్యులు, సిబ్బందిని కేటాయించటం లేదు. దీంతో పలువురు రోగులు అత్యవసర చికిత్సలకు జగిత్యాల, కరీంనగర్? వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే అన్ని రకాల వైద్య పరికరాలు సరఫరా చేసి, ఐసీయూ నిపుణులు, టెక్నీషియన్లు, సిబ్బందిని నియమించాలి. రెండో అంతస్తులో గదులు నిర్మించగా.. పరికరాలు, వైద్య



సిబ్బంది కొరతతో మొక్కుబడి సేవలకే పరిమితమవుతోంది. పది బెడ్లతో ఐసీయూ కేంద్రం ఏర్పాటు చేయగా.. వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించకపోవటంతో ప్రారంభానికి నోచటం లేదు.

**అసౌకర్యాలు ఇవీ..**

విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. జనరేటర్ ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు.

తాగునీటి వసతికి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలి.

స్కానింగ్ యంత్రాలు, రోగ నిర్ధారణ పరికరాలు, ఎక్స్‌రే ప్లాంట్ తదితరాలు లేవు. ఆసుపత్రిలో మందులు కూడా అరకొరగానే లభిస్తున్నాయి.

నాలుగు ల్యాబ్‌లు అవసరం కాగా ఒక్కటే అందుబాటులో ఉంది.

**ప్రతిపాదనలు పంపాం..**సిబ్బంది, పరికరాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆస్పత్రిలో అన్ని రకాల సేవలందిస్తున్నాం. నిత్యం 150-200 ఓపీ నమోదవుతోంది. ప్రస్తుతం రెండో అంతస్తును కూడా పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తాం. ఉదయం నుంచి రాత్రి వరకు వైద్యులు ఉంటున్నారు.

డా.రవి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# రాజన్న కోడెలు అలసిపోతున్నయ్?..

వేములవాడ : వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం కోడె మొక్కులకు ప్రసిద్ధి. దేశంలో ఎక్కడా లేని విధంగా కోడె మొక్కులు ఈ ఆలయంలోనే భక్తులు చెల్లించుకునే ఆచారం అనాది నుంచి వస్తోంది. కోరిన కోర్కెలు తీరితే స్వామివారికి భక్తులు కుటుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లిస్తుంటారు. అలాంటి భక్తుల మొక్కులు తీర్చే కోడెలు అలసి పోతున్నాయి. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు మొదలు కావడంతో కోడె మొక్కులతో పాటు వివిధ ఆర్జిత సేవల మొక్కులు అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో చెల్లించుకుంటున్నారు. సమ్మక్క జాతరకు వెళ్లే భక్తులు ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా ఉండటంతో గత నెల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు.

**సోమవారం 10 వేలకుపైగా కోడె టికెట్లు**

ఒక్కో సోమవారం లక్ష మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఇందులో దాదాపు పది వేల మందికిపైగా భక్తులు రికార్డు స్థాయిలో కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. మిగతా రోజుల్లో 40 వేల నుంచి 80 వేల మంది వరకు భక్తులు స్వామివారి దర్శించుకోగా దాదాపు 8 వేల వరకు కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో కోడెలకు విశ్రాంతి లభించని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.**నిరంతరాయంగా అయిదు గంటలు**

భక్తులు మొక్కులు చెల్లించుకునే కోడెలు.. గోశాలలో 170 వరకు ఉంటాయి. భక్తుల రద్దీని బట్టి 20 నుంచి 50 కోడెల వరకు ఆలయానికి సిబ్బంది తీసుకువస్తుంటారు. ఈ కోడెలు నిరంతరాయంగా దాదాపు అయిదు గంటల పాటు విధులు నిర్వహిస్తుంటాయి. ఉదయం 5 గంటలకు కోడె మొక్కులు మొదలవుతాయి. నాలుగు షిఫ్టుల్లో ఈ కోడెలను నిరంతరాయంగా మొక్కులు చెల్లించుకునే భక్తులు ఆలయం



చుట్టూ తిప్పుతుంటారు. ప్రస్తుతం కోడె మొక్కులు చెల్లించుకునే భక్తుల సంఖ్య భారీగా పెరిగిపోవడంతో అవి తీవ్రంగా అలసిపోతున్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో కోడెలు ఆలయం చుట్టూ తిరగడానికి వెళ్లడం లేదు. దీంతో వాటిని భక్తులు తాడుతో బలంగా లాగడంతో అవి అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందనే అభిప్రాయం భక్తుల్లో వ్యక్తం అవుతోంది.

**దూరం పెరిగి..**

ముఖ్యంగా రాజన్న ఆలయం చిన్నగా ఉండటంతో తిరిగే సమయం తక్కువగా ఉండేది. దీనికి తోడు గోశాల కూడా సమీపంలోనే ఉండటంతో దూరం తక్కువగా ఉండేది. ప్రస్తుతం భీమన్న ఆలయం పెద్దగా ఉండటంతో ఎక్కువ సేపు తిరగాల్సి వస్తోంది. దీనికి తోడు షిఫ్ట్‌ల తరువాత గోశాల వెళ్లడంతో దూరం పెరిగిపోయింది. వీటన్నింటికి తోడు భారీ సంఖ్యలో కోడె మొక్కుల టికెట్లు విక్రయం అవుతున్నాయి. దీంతో కోడెలకు అసలు ఏమాత్రం విశ్రాంతి లభించని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.**కోడెల సంఖ్య పెంచేందుకు చర్యలు**

రాజన్న ఆలయంలో కోడెలు తిరిగే స్థలం తక్కువగా ఉండేది. భీమన్న ఆలయంలో ఎక్కువ సేపు తిరగడంలో అలసిపోతున్నాయి. తిరిగే సమయాన్ని తగ్గించేందుకు మరో 50 కోడెలను సిద్ధం చేస్తున్నాం. గోశాలలో అదనంగా కోడెలకు షెడ్లు ఏర్పాటుకు ప్రణాళికా సిద్ధమైంది.

బి.శ్రీనివాస్, రాజన్న ఆలయ ఏఈవో

చరకలు



## ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం..

హైదరాబాద్ : భూతంలా ప్లాస్టిక్ పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. నిషేధాజ్ఞలున్నా విచ్చలవిడిగా వినియోగం పెరుగుతోంది. ఉత్పత్తి లేకుండా చేయడంలో అధికార యంత్రాంగాలు విఫలమవుతున్నాయి. గ్రేటర్‌లో రోజూ 8వేల టన్నుల చెత్త పోగవుతుండగా అందులో 14శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ రహితనగరంగా మార్చాలంటే 'సిక్కిం' తరహా కఠిన విధానాలు అవలంబించాలని నిపుణులు సూచిస్తున్నారు.
అక్కడ ఇలా..: పర్యావరణ పరిరక్షణలో దేశంలోనే ముందున్న రాష్ట్రం సిక్కిం. ప్లాస్టిక్ వ్యర్థాలు భారీవర్షాల సమయంలో డ్రైన్లను అడ్డుకోవడంతో అక్కడ కొండచరియలు విరిగిపడి అనేకమంది మరణించారు. ఈ నేపథ్యంలోనే 1998లో తొలిసారిగా డిస్పోజబుల్ ప్లాస్టిక్‌క్యారీ బ్యాగ్‌లు (50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్నవి) నిషేధించింది. 2016లో థర్మకోల్ ప్లేట్లు, డిస్పోజబుల్ ఉత్పత్తులపై పూర్తి నిషేధం అమలు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, కార్యక్రమాల్లో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ నీటిని నిషేధించడంతో పాటు 2022 జనవరి నుంచి 2 లీటర్లు అంతకంటే తక్కువ సామర్థ్యంఉన్న ప్లాస్టిక్ నీటిసీసాల తయారీ, దిగుమతి, అమ్మకం, వినియోగంపై ఆంక్షలు విధించింది. 2022 డిసెంబరు 31నుంచి 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లపై నిషేధం విధించింది. ప్రకటనలే పరిమితం చేయకుండా మున్సిపల్ స్క్వాడ్‌లు, కాలుష్య నియంత్రణ మండలి బృందాలు నిరంతరం తనిఖీలుచేస్తున్నాయి. ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తున్నారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలతో చిన్నారులకు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.



**నగరంలో పరిస్థితి ఇదీ...**
నగరంలోని ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలు - 300(సుమారు).. ప్రధాన రకాలు–సింగిల్ యూజ్ ప్లాస్టిక్
మూసీ నది చుట్టూ 10 టన్నులకుపైగా ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ అవుతున్నాయి. ఫ్లోటింగ్ ట్రాష్ బారియర్లున్నా చాలా నదిలోకి చేరుతున్నాయి. ఇవి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ వర్షాకాలం వరదలకు కారణమవుతున్నాయి.
హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. నగరంలోని వేర్వేరు చెరువుల్లో లేక్ క్లీనప్ డ్రైవ్‌లు చేపడుతుండగా 70శాతం వ్యర్థాలు ప్లాస్టిక్‌వే ఉంటున్నాయి.
మైక్రోప్లాస్టిక్ భూమి, నీటిని కలుషితం చేస్తున్నాయి. జంతువులు ప్లాస్టిక్‌ను తిని మరణిస్తున్నాయి.
ప్రత్యామ్నాయాలు ఇవీ..
హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఫిల్టర్ వాటర్ స్టేషన్లు, రీయూజబుల్ బాటిళ్లు (బాంబూ, స్టీల్, సీసంవాటికి బాటిళ్లకు ప్రోత్సాహం)
జనపనార, కాగితం, వస్త్రంతో చేసిన సంచుల వినియోగం పెంచాలి.
కంపోస్టబుల్ బ్యాగ్‌లు వాడాలి.
హోటళ్లలో విస్తారాకులు, అరిటాకులు ఉపయోగించాలి.
బాంబూప్లేట్లు, కప్పులు, ఎడిబుల్ వస్తువుల వినియోగం పెంచాలి.

## 'దారి' దోపిడీ

హైదరాబాద్ : నగరంలోని రహదారులను చూస్తే.. గుంతలు, మిట్టలే దర్శనమిస్తాయి. ఇంజినీర్ల అవినీతి, గుత్తేదారుల నిర్లక్ష్యంతో.. రోడ్ల నిర్మాణం అత్యంత దారుణంగా జరుగుతోంది. ద్విచక్ర వాహనంలో కిలోమీటరు దూరం కూడా సవ్యంగా వెళ్లలేని పరిస్థితులున్నాయి. జీహెచ్‌ఎంసీ, జలమండలి మధ్యనున్న సమన్వయ లోపం కూడా శాపమే.
ఎన్నెన్ని లోపాలో..
రహదారిపై ఏర్పడే 2.5మీటర్ల పొడవు, 1.33మీటర్ల వెడల్పు, 0.3మీటర్ల లోతున్న గుంతను పూడ్చేందుకు జీహెచ్‌ఎంసీ రూ.12,500 ఖర్చు చేస్తోంది. వర్షాకాలంలో అలాంటి 30వేల గుంతలను పూడ్చినట్లు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. అంటే.. వానాకాలంలో గుంతలను పూడ్చినందుకే రూ.37.50 కోట్లకుపైగా ఖర్చయినట్లు.
చిన్న కాంట్రాక్టర్లకు రోడ్డు పనులిస్తున్నారు. వారి దగ్గర నైపుణ్యమున్న సిబ్బంది లేకపోవడంతో..ఇష్టానుసారం రోడ్లను నిర్మిస్తున్నారు. పాత రోడ్లను మిల్లింగ్ చేయట్లేదు. రోడ్లపై ఉన్న గుంతలను వదిలేస్తున్నారు. వాలుగా నిర్మాణం జరగట్లేదు. ఇంజినీర్లు పర్యవేక్షించడం లేదు. దీంతో ప్రజాధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.



జీహెచ్‌ఎంసీకి రెండు తారు మిశ్రమం తయారీ కేంద్రాలున్నాయి. అక్కడి నుంచి నలుమూలలకు తారు మిశ్రమాన్ని తరలిస్తుండటంతో.. వేడి చల్లబడి నాణ్యత ఉండట్లేదు.
గతేడాదిలో రూ.600 కోట్ల విలువైన పనులు సీసీ రోడ్లకు చెందినవే. ఒకసారి రోడ్డు వేస్తే.. 40ఏళ్లు నిలవాలి. నగరంలో ఐదు, పదేళ్లకోసారి సీసీ రోడ్లను తిరిగి నిర్మిస్తున్నారంటే.. నాణ్యత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.ఏటా రోడ్ల నిర్వహణకు జీహెచ్‌ఎంసీ చేస్తోన్న వ్యయం: రూ.1,000 కోట్లు

**నగరంలో తిరిగే వాహనాల సంఖ్య: 60 లక్షలు**
గుంతలతో దెబ్బతినే వాహనాల మరమ్మతుల ఖర్చు: రూ.50 కోట్లు
ట్రాఫిక్ సమస్యతో జరిగే ఇంధన వృథ: రూ.100 కోట్లు
గుంతలతో అనారోగ్యం.. చికిత్స కోసం ప్రజలు చేసే ఖర్చు: రూ.50 కోట్లుపనులు పకడ్బందీగా జరిగితేనే..
ప్రొఫెసర్ కె.ఎం.లక్ష్మణ్‌రావు, సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు, జేఎన్‌టీయూ నగర రహదారులపై రాకపోకలు ఎక్కువ. వాటిని తట్టుకుని నిలవాలంటే నాణ్యతకు పెద్దపీట వేయాలి. నాసిరకం సామగ్రితో కట్టే మ్యాన్‌హోళ్లు కారు బరువును కూడా తట్టుకోలేవు. నీరు నిలవకుండా.. రోడ్ల నిర్మాణం జరగాలి. అప్పుడే నగరంలో రహదారులు మెరుగుపడతాయి.

# తాగునీటికి ఉండవు తిప్పలు



ఖమ్మం : వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీటి సమస్యలను ఎదుర్కొనేందుకు మిషన్ భగీరథ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా తాగునీటి వనరులు, వాటి సమస్యలపై సర్వే చేపట్టారు. ఈనెల 20 వరకు సర్వే కొనసాగనుంది. పాలేరు రిజర్వాయర్‌లో నీటి లభ్యత ఆధారంగా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్నారు. పాలేరు రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ పథకాలకు ఇన్ టేక్ వెల్స్ ద్వారా రోజుకు 135.45 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ విభాగం పరిధిలో ఇన్‌టేక్ వెల్స్6, డబ్ల్యూటీపీలు 8, ఓహెచ్‌బీఆర్ (ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)లు 53, జీఎల్‌బీఆర్ (గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)లు 6, సంప్‌లు 19 ఉన్నాయి.
పాలేరు సెగ్మెంట్ పరిధిలో 322 ఆవాస ప్రాంతాలకు రోజుకు 100.90 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీరు అందిస్తున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఏదులాపురం మున్సిపాలిటీలకు బల్క్ వాటర్ ఇస్తున్నారు. వైరా సెగ్మెంట్ పరిధిలో 399 ఆవాస ప్రాంతాలకు 87.7 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీరు అందిస్తున్నారు.
భద్రాద్రి జిల్లాలోని కుమ్మరిగూడెం ఇన్‌టేక్ వెల్ నుంచి తోగ్గూడెం గుట్ట డబ్ల్యూటీపీ ద్వారా రోజుకు 15.83 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని సత్తుపల్లి మున్సిపాలిటీ, కామేపల్లి, సింగరేణి మండలాల్లోని 186 ఆవాసాలకు అందిస్తున్నారు. పాలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి నిల్వ ఆధారంగా వచ్చే 77 రోజులకు అంటే మార్చి 28 వరకు తాగు నీరు సరిపోతుంది. వైరా రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి నిల్వ ఆధారంగా వచ్చే 110 రోజుల వరకు అంటే మే31 వరకు తాగునీటి అవసరాలు తీరుతాయి. వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల పెరిగి నీటి మట్టం తగ్గితే తాగునీటికి సమస్య ఏర్పడుతుంది. వైరా రిజర్వాయర్ నుంచి రోజుకు 37 క్యూసెక్కుల నీటిని ఇన్‌టేక్ వెల్స్ ద్వారా తాగునీటికి తీసుకుంటున్నారు. పాలేరు, వైరా రిజర్వాయర్లలో నీటి మట్టం హెచ్చుతగ్గులపై తాగునీటి సరఫరా ఆధారపడి ఉంటుంది. జిల్లాలో ఈ ఏడాది తాగునీటి సరఫరాకు లోటు లేదు. పాలేరు, వైరా రిజర్వాయర్లలో నీటిమట్టం ఆధారంగా మరో రెండు, మూడు నెలల వరకు ఇబ్బంది ఉండదు. సాగునీటిని ఏప్రిల్ వరకు సరఫరా చేయనున్నారు. ఈలోగా నాగార్జున సాగర్ నుంచి పాలేరు, వైరా రిజర్వాయర్లకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. గోదావరి బేసిన్‌లో నీటికి ఇబ్బంది ఉండదు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు సైతం ప్రతిరోజూ గ్రిడ్ విభాగం ద్వారా శుద్ధి చేసిన బల్క్ వాటర్ ఇస్తున్నాం.
వాణిశ్రీ, మిషన్ భగీరథ గ్రిడ్ విభాగం ఈఈ, ఖమ్మం

# మద్యం.. మాయాజాలం



ఎల్లారెడ్డిపేట: బెల్టుషాపును నిర్వహించే ఓ వ్యక్తి వద్ద స్టిక్కర్ అంటించిన బీరు సీసా ఇది. సాధారణంగా వైన్ షాపులో ఒక సీసా రూ.180కి లభిస్తుంది. స్టిక్కర్ వేసి బెల్టుషాపు దారుడికి రూ.190కి ఇస్తున్నారు. దాన్ని గొలుసు దుకాణంలో రూ.210 నుంచి రూ.220 వరకు అమ్ముతున్నారు. ఇలాగే అన్ని బ్రాండ్లకు సంబంధించిన మద్యం సీసాలపై వైన్‌షాపుల కోడ్‌తో కూడిన స్టిక్కర్లు ఉంటాయి.
మద్యం దుకాణాల నిర్వాహకులు సిండికేట్‌గా మారి నిలువు దోపిడీ చేస్తున్నారు. గొలుసు దుకాణాలను ప్రోత్సహిస్తూ వారికి అధిక ధరలకు విక్రయిస్తూ దండుకొని ఆయా శాఖల అధికారులకు ప్రతినెలా రూ.లక్షల్లో ముడుపులు ముట్టచెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రూ.కోట్లలో వ్యాపారం**
జిల్లాలో ఈ ఏడాది జనవరిలో రూ.48 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. అయిదు మండలాలతో కూడిన ఒక్క ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ వలయ కార్యాలయ పరిధిలో ప్రతినెలా సగటున రూ.14 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ఇందులో 80 శాతం ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుండగా అమ్మకం పన్ను, లైసెన్స్ ఫీజు రూపంలో వైన్ షాపు యజమానులకు ఆదాయం సమకూరుతోంది. భారీ ఎత్తున మద్యం అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకున్న యజమానులు వందల సంఖ్యలో మద్యం గొలుసు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. ఒక్కో సీసాపై అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారు. అటు బెల్టు షాపుల్లో ఎక్కువ ధర అయినా పగలు రాత్రి తేడా లేకుండా అందుబాటులో మద్యం లభిస్తుండటంతో కూలీలు, మధ్య తరగతి కుటుంబాల వారు మద్యానికి బానిసవుతూ ఆర్థికంగా, ఆరోగ్యంగా ఇబ్బందుల్లో కూరుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**దర్జాగా.. అధికారుల్లాగా**
వైన్‌షాపు యజమానులు ఎవరికివారుగా ఓ కోడ్‌తో కూడిన స్టిక్కర్లను రూపొందించుకున్నారు. వారికి అనుమానం వస్తే దర్జాగా.. అధికారుల్లాగా బెల్టుషాపుల వద్ద వాలిపోయి, తనిఖీ చేస్తున్నారు. స్టిక్కర్లను చరవాణుల్లో స్కాన్ చేయడం ద్వారా ఆ మద్యం ఏ దుకాణం నుంచి వచ్చిందో నిర్ధారించుకుంటున్నారు. తమ స్టిక్కర్లు ఉంటే నిర్భయంగా మద్యం అమ్ముకోవచ్చని.. పోలీసులు గానీ, ఎక్సైజ్ శాఖ అధికారులు గానీ ఏమీ చేయలేరని అభయమిస్తున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ "బెల్టుషాపుల నిర్వహణ చట్టరీత్యా నేరం. అలాగే వైన్‌షాపు యజమానులు స్టిక్కర్లు వేసి ఇవ్వడమే తప్పు. అదనపు ధరలకు అమ్మడం ఇంకా తప్పు. ఇలాంటి చర్యలకు పాల్పడే వైన్‌షాపులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ముడుపులు తీసుకుంటారని అనడంలో ఎలాంటి వాస్తవం లేదు" అని పేర్కొన్నారు.

# పార్కు స్థలం కబ్జా.. అడ్డుకున్న హైడ్రా



హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లోని ఓ పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టిన ఓ వ్యక్తి అక్రమాలను హైడ్రా అడ్డుకుంది. రూ.3 కోట్ల విలువైన పార్కు స్థలాన్ని కాపాడింది. అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేసింది. మరోవైపు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు చేరువలోని ఖానామెట్ ప్రాంతంలో ఉన్న రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమిని కూడా హైడ్రా రక్షించింది. ఈ రెండు కబ్జాలపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులందాయి. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల తో క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. కబ్జాలని నిర్ధారించుకుని ఆక్రమణలను తొలగించారు. వాటికి ఫెన్సింగ్ వేశారు. మొత్తం రూ.1003 కోట్ల ప్రభుత్వ ఆస్తిని హైడ్రా కాపాడింది.
మూడు అంతస్తుల భవనం కూల్చివేత.. జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఇళ్ల మధ్య ఉన్న 2 ఎకరాల పార్కుపై అక్కడే ఇంటిని కిరాయికి తీసుకుని మహిళ హాస్టల్ నిర్వహిస్తున్న వ్యక్తి కన్ను పడింది. పార్కులోకి 50 గజాల మేర జరిగి పాత భవనానికి ఆనుకుని మరో నిర్మాణం చేపట్టాడు. దీనిపై స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించింది. పార్కులోకి 50గజాల మేర జరిగి నిర్మాణం చేపట్టినట్టు నిర్ధారించుకుంది. మరో 100 గజాల మేర హద్దులు వేసుకుని ఆక్రమణ చేసినట్టు స్పష్టం చేసుకుంది. ఈ మూడు అంతస్తుల నిర్మాణాన్ని తొలగించారు.
బోర్డుల ఏర్పాటు.. : హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు సమీపంలోని ఖానామెట్‌లో ఆల్ ఇండియా వెలమ సంఘానికి ప్రభుత్వం గతంలో 5 ఎకరాలు కేటాయించింది. దీనిపై కొందరు కోర్టుకెక్కడంతో హైకోర్టు స్టే ఇచ్చింది. స్థానికులు ఆ స్థలానికి వెనుక వైపు నుంచి మట్టిపోస్తూ కబ్జా చేస్తున్నారని.. అడిగితే వాచ్‌మ్యాన్‌పై దాడి చేస్తున్నారని ఆ సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి కబ్జాలకు ఆస్కారం లేకుండా ఫెన్సింగ్ వేసి బోర్డులను ఏర్పాటు చేసింది.

# ఒకటి మూడుగా.. అభివృద్ధి బాటగా

హైదరాబాద్: నగరంలో సరికొత్త పాలన షురూ అయింది. పరిపాలన వికేంద్రీకరణ, పారదర్శక పాలన, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీల కేంద్రంగా పరిపాలన మొదలైంది. కమిషనర్లు బాధ్యతలు తీసుకోవడంతోపాటు.. పారిశుద్ధ్యం, టౌన్‌ప్లానింగ్, పరిపాలన, ఇంజినీరింగ్ వంటి పలు విభాగాల్లో విభాగాధిపతు లు(హెచ్‌ఓడీ) నియామకం అయ్యారు. ఇతరత్రా విభాగాల ఉన్నతాధికారులు సైతం బాధ్యతలు తీసుకున్నారు. ఇకపై పరిపాలన అక్కడి నుంచే జరుగుతుందని కమిషనర్లు స్పష్టం చేశారు.విభజన సమస్యలపై.. బాధ్యతలు తీసుకున్న అనంతరం ముగ్గురు కమిషనర్లు కర్ణన్, సృజన, వినయ్‌కృష్ణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలిశారు. ప్రభుత్వం వద్ద విభజన సమస్యలు, ఆర్థిక వనరుల పంపకాలపై చర్చించారు. అయితే.. మీ స్థాయిలో పలు దఫాలుగా చర్చించుకోవాలని, ఉమ్మడి రాష్ట్రం విభజన సమయంలో ఆస్తులు, అప్పుల పంపకాలకు పాటించిన విధానాలను పరిశీలించి.. పరిష్కార మార్గాలను కనుగొనాలని ప్రభుత్వం కమిషనర్లకు సలహా ఇచ్చింది. అందులో భాగంగా ముగ్గురు కమిషనర్లు సచివాలయంలో సమావేశం కావాలని నిర్ణయించారు.



## అత్యాశకు పోతే.. ఖాతా ఖాళీ

సూర్యాపేట: ఒకప్పుడు బ్యాంకు ఖాతా కేవైసీ చేయించుకోండి.. ఓటీపీ చెప్పాలంటూ ఖాతా ఖాళీ చేసిన సైబర్ నేరగాళ్లు కొత్త పన్నాగాలతో దూకుడు పెంచారు. పండగలొస్తే ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో తక్కువ ధరలకే సరకులు అందిస్తామంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో నమ్మకం కలిగిస్తూ నూతన పంథను అనుసరిస్తూ ప్రజల డబ్బును కొల్లగొడుతున్నారు. పోలీస్‌శాఖ విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో సైబర్ నేరాలు గణనీయంగా పెరిగాయి. 2024లో 545 కేసులు నమోదు కాగా 2025లో ఈ సంఖ్య 590కు చేరింది. 2026లోకి అడుగిడిన నేపథ్యంలో జనం తొందరడకుండా అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరగాళ్ల మోసాలను తిప్పికొట్టాలని పోలీసులు, నిపుణులు సూచిస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నా..**
సైబర్ నేరగాళ్లు ఏవిధంగా మోసానికి గురిచేస్తున్నారో వివరిస్తూ, అందుకు ప్రజలు ఎలా అప్రమత్తం కావాలో పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా కేటుగాళ్లు బురిడీ కొట్టించడంతో రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు.
**ఆలస్యంతోనే అనర్థం**మోసానికి గురైన వారిలో చాలామంది పరువు పోతుందని ఆలస్యంగా ఫిర్యాదు చేస్తుండటంతో కేసుల్లో రికవరీ ఉండటం లేదని పోలీసులు చెబుతున్నారు. మోసపోయిన వారు నిమిషాల వ్యవధిలోనే 1930కు ఫిర్యాదు చేయాలి. పోలీసులు ఆ కేసును



ఛేదించడానికి కొంత వీలుగా ఉంటుంది. గడిచిన రెండేళ్లలో నమోదైన కేసుల్లో పోలీసులు రికవరీ చేసింది చాలా తక్కువే. సైబర్ నేరగాళ్లు కాజేసిన సొత్తును నిమిషాల్లో రికవరీకి అవకాశం లేకుండా మార్చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.

**12 నెలల్లో రూ. 14.77 కోట్లు**
గతేడాది నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో 462 కేసుల్లో రూ.14.77 కోట్లు కాజేశారు. దీన్ని సవాల్‌గా తీసుకున్న పోలీసులు రికవరీ ఆశించినంత చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అందులో రికవరీ అయింది రూ.2.55 కోట్లు మాత్రమే. అయితే యాదాద్రి జిల్లాలో సైబర్ కేసుల వివరాలను పోలీసులు ప్రకటించినప్పటికీ, చోరీ మొత్తం, రికవరీ వివరాలు మాత్రం వెల్లడించలేదు.

**అప్రమత్తంగా ఉండాలి**
లక్ష్మనారాయణ, సీఐ, సైబర్ సెల్, సూర్యాపేట
ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయొద్దు. ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకు వస్తువులు ఇస్తామంటూ వచ్చే సంక్షిప్త సమాచారాలను, ఫోన్లకు స్పందించవద్దు. ఆన్‌లైన్ ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలి.

## పల్లెల్లో.. ఇక పాలపొంగులే..!

రాజపేట : మహిళా సాధికారత, ఆదాయం పెంపు, పాడి అభివృద్ధే లక్ష్యంగా ఇందిరా డెయిరీ ప్రాజెక్టును చేపట్టాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రెండు గేదెలు, లేదంటే ఆవులు పంపిణీ చేయనున్నారు. ఈ పథకంతో అతివలకు జీవనోపాధి లభించడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఒక్కో యూనిట్‌కు రూ.2లక్షలు..**
ప్రతి మండలాన్ని మూడు జోన్లుగా విభజిస్తారు. పది గ్రామాలను యూనిట్‌గా ఏర్పాటు చేస్తారు. పథకంలో ఒక్కో యూనిట్ ధర రూ.2లక్షలు. ఇందులో ప్రభుత్వం రూ.1.40 లక్షలు రాయితీ ఇస్తుంది. మిగిలిన రూ.60 వేలు బ్యాంకులు రుణంగా అందిస్తాయి. ఈ డబ్బుతో రెండు గేదెలు లేదంటే రెండు ఆవులు కొనిస్తారు. పశువులకు గడ్డి, దాణా సరఫరాను స్థానిక యువతకు అప్పగించి వారికి ఉపాధి కల్పించే యోచనలో ప్రభుత్వ వర్గాలున్నాయి. ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వెలువడలేదని, రాగానే మార్గదర్శకాల ప్రకారం పథకం అమలుకు కృషి చేస్తామని సంబంధిత అధికారులు అంటున్నారు.

**పెరగనున్న పశుసంతతి, పాల ఉత్పత్తి..**
గ్రామాల్లో పశువుల సంఖ్య బాగా తగ్గిందనే విషయమై ఇటీవల పశు సంవర్ధక శాఖ వెల్లడించిన గణాంకాల్లో తేలింది. 2018లో పశుగణన చేపట్టగా 69,173 తెల్లజాతి పశువులు, 1,22,620 నల్లజాతి పశువులున్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం వాటి సంఖ్య 15 శాతంపైగా తగ్గిందని తెలుస్తోంది. గతంలో అత్యధికంగా పాల దిగుబడిని సాధించిన జిల్లా ప్రస్తుతం కొంతమేర తగ్గిందనే చెప్పవచ్చు. ప్రధానంగా వ్యవసాయ పనులు యంత్రాలతో చేయడం, గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు తగ్గి మేతకు కొరత ఏర్పడటంతో పశువుల సంతతి తగ్గడానికి కారణంగా చెప్పవచ్చు. పాల ఉత్పత్తి బాగా పడిపోయింది.
**జిల్లా సమాచారం..** గ్రామ పంచాయతీలు : 427 మండల మహిళా సమాఖ్యలు : 17 మొత్తం స్వయం సహాయక సంఘాలు : 14,986 సంఘాల్లోని సభ్యుల సంఖ్య : 1,91,811

## ఎప్పుడిస్తారో.. రూ.19 కోట్లు

సూర్యాపేట : అన్నదాతలకు అందుబాటులో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తోంది. జిల్లాలో వానాకాలం కొనుగోళ్లు పూర్తయ్యాయి. కానీ ఆరేళ్లుగా హమాలీ ఛార్జీలు విడుదల చేయక రైతులపైనే ఆ భారం పడుతోంది. ఈసారైనా అందిస్తారని ఆశిస్తున్నారు. కేంద్రాల్లో ధాన్యాన్ని హమాలీలు సంచుల్లో నింపి లారీల ద్వారా మిల్లులకు తరలిస్తారు. ఇందుకు క్వింటాకు రూ.45 చొప్పున హమాలీలకు చెల్లించాల్సి ఉంటుంది. వారికి చెల్లించిన అనంతరం ధాన్యం విక్రయించిన నగదుతోపాటు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంటుంది. కానీ ఆరేళ్లుగా హమాలీ ఖర్చు జమ చేయడం లేదు. జిల్లాలో 2025-26 వానాకాలం సీజన్‌లో 348 కేంద్రాల ద్వారా 3.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో పది విడతల్లో, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో మూడు విడతల్లో కొనుగోళ్లు చేపట్టగా మొత్తం ఆరేళ్లుగా రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించలేదు. సన్నరకం ధాన్యానికి బోనస్ ప్రకటించడంతో 90 శాతం రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు.
హమాలీ ఛార్జీల రూపంలో జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లకు కలిపి రూ.2.62 కోట్లు వరకు రైతులపై భారం పడింది. ఈ లెక్కన పన్నెండు విడతల్లో బకాయిలు రూ.19.18 కోట్ల వరకు రావాల్సి ఉంది. బకాయిలు, హమాలీ ఛార్జీలు చెల్లింపులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేవని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

## దారిదోపిడీలకు.. హైవేలే అడ్డా!

మెదక్ : జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలకు సరిహద్దులుగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తున్న దొంగలు దాడులకు పాల్పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయిలో మంగళవారం రాత్రి దొంగలు డ్రైవరును హత్య చేసి, లారీతో పరారయ్యారు. ఈ నేపథ్యంలో నాలుగు జిల్లాలోని పరిస్థితిపై కథనం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల మీదుగా 65వ (ముంబయి–హైదరాబాద్), 44వ (కశ్మీర్–కన్యాకుమారి), 161వ (అకోలా–నాందేడ్) జాతీయ రహదారులు వెళ్తున్నాయి. జహీరాబాద్–బీదర్ అంతర్రాష్ట్ర రహదారి వెళ్తోంది. ఆయా మార్గాల్లో దోపిడీలు, చోరీలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**వివిధ ఘటనలు ఇలా..**

న్యాల్‌కల్ మండలం గంగ్వార్ చౌరస్తాలో పాన్ మసాలా లోడుతో వెళ్తున్న లారీని అడ్డగించి డ్రైవరుపై దాడి చేసి రూ.20 లక్షల విలువైన సరకు, రూ.40 వేలు ఎత్తుకెళ్లారు. బూచినెల్లి శివారులో పెట్రోల్ బంకు వద్ద ఓ కుటుంబం కారులో నిద్రిస్తుండగా అద్దాలు ధ్వంసం చేసి మహిళ ఆభరణాలు లాక్కునేందుకు యత్నించారు. 44వ జాతీయ రహదారిలో తూప్రాన్ బైపాస్ రోడ్డులో లారీ నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్, క్లీనర్‌పై దాడి చేసి దోచుకున్నారు.

**కొరవడిన నిఘా..**

ఉమ్మడి జిల్లాలోని జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై భద్రత కొరవడిందని ఇటీవలి ఘటనలే చెబుతున్నాయి. ప్రధానంగా రాత్రివేళల్లో ప్రయాణం, సరకు రవాణా అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో ఆయా మార్గాల్లో పక్కా నిఘా పెట్టాలి.



**దాబా, టోల్‌గేట్ల వద్ద మాటేసి..**

ముందుగా ముఠా సభ్యుల్లో కొందరు హైవేలపై దాబాలు, టోల్‌గేట్ల వద్ద మాటు వేస్తారు. ఆగి ఉన్న వాహనాలను గమనించి, డబ్బు, ఆభరణాలు ఉన్నాయా తదితర వివరాలు మిగతా వారికి చేరవేస్తారు. చోరీ చేయగానే ముందుగానే ఎంపిక చేసుకున్న వేరే దారుల్లో తప్పించుకుంటున్నారు.

లారీలకు అడ్డుగా వెళ్లి టార్చిలైట్లను డ్రైవర్ల కళ్లపై వేసి, వాహనం నిలపగానే దాడి చేస్తారు.

**వీటిని పాటించండి..**

వాహనాల డోర్లు లాక్ చేసుకొని పెట్టుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వరాదు. విశ్రాంతికి నిలపాలనుకుంటే పెట్రోలు బంకులు, నిర్దేశిత ప్రాంతాల వద్దే నిలపాలి.

**అమెరికాలో ఇలా..**

యూఎస్‌లో ప్రతి వాహనం నంబరు ప్లేట్‌ను స్కాన్ చేసే వ్యవస్థ అందుబాటులో ఉంది. దొంగిలించిన వాహనాలు హైవేలపైకి రాగానే పోలీసులకు సంకేతం అందుతుంది.

హైవేలపై నిర్మానుష్య ప్రాంతాల్లో ఏఐ ఆధారంగా పని చేసే కెమెరాల టవర్లు ఉంటాయి. ఇవి అనుమానాస్పద వాహనాల కదిలికలను గుర్తించి అప్రమత్తం చేస్తాయి.

నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో పకడ్బందీ గస్తీ ఉంటుంది.

## కల్వర్టులు శిథిలం.. భయంగా ప్రయాణం

జహీరాబాద్ : జహీరాబాద్: మెరుగైన రవాణా సదుపాయానికి రహదారులను మెరుగు పరుస్తామని, వాటికి అడ్డుగా వాగులున్న చోట కల్వర్టులు, వారధులు నిర్మిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ చెబుతుంటారు. కానీ దశాబ్దాలు గడుస్తున్నా జహీరాబాద్ నియోజకవర్గంలోని చాలా చోట్ల కొత్త రోడ్లు, వారధులు, కల్వర్టులను నిర్మించడం లేదు. భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెనలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

**ఏళ్లుగా మరమ్మతులు కరవు**

జహీరాబాద్ పట్టణం మాణిక్‌ప్రభు మహేలా నుంచి అల్గోల్‌కు వెళ్లే బైపాస్ మార్గంలో, రహమత్‌నగర్ సమీపంలో, అల్గోల్–పొట్టిపల్లి గ్రామాల మధ్య నారింజ వాగుపైన, బైపాస్ కూడలి నుంచి బీదర్ వైపు వెళ్లే దారిపై కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కాశీంపూర్, అసద్‌గంజ్, గోపన్‌పల్లి, గొడిగార్‌పల్లి,



ఇప్పెపల్లి, మాడ్గి, ధనసిరి వెళ్లే మార్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వీటికి ఏళ్లుగా మరమ్మతులు కరవయ్యాయి.

అధికారులూ.. దృష్టి సారించండి

కోహీర్ మండలంలోని కోహీర్–నాగిరెడ్డిపల్లి, వెంకటాపూర్–పోతిరెడ్డిపల్లి, మద్రి–గుర్జువాడ, కోహీర్–మాచిరెడ్డిపల్లి, రాజినెల్లి–కోహీర్, మనియార్‌పల్లి–బడంపేట–పర్శపల్లి, గొడిగార్‌పల్లి మార్గాల్లో నాలుగు చోట్ల కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి.

ఝరాసంగం మండలంలోని ఝరాసంగం–కుప్పానగర్, ఝరాసంగం–చిలేపల్లి, చిలేమామిడి, మాచునూర్, బర్దిపూర్ మధ్యలో కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

న్యాల్‌కల్ మండలంలోని న్యాల్‌కల్–మిర్జాపూర్, హద్నూర్–గుంజోటి, రామ్‌తీర్థ్, గంగ్వార్–మెటల్‌కుంట రహదారులపైన కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. వీటిపై అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం–రాంచందర్, డీఈఈ, పీఆర్, జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ రహదారులపైన దెబ్బతిన్న కల్వర్టుల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడుతాం.

## రక్తం లాగేసి.. అడ్డగోలుగా దోచేసి



పెద్దపల్లి : పెద్దపల్లి పట్టణానికి చెందిన ఒకరు వ్యాధి నిర్ధారణకు ఓ డయాగ్నొస్టిక్ కేంద్రానికి వెళ్లి పరీక్షించుకోగా రిపోర్టు వచ్చింది. అనుమానం వచ్చిన సదరు వ్యక్తి మరో కేంద్రంలో పరీక్ష చేసుకోగా.. రెండు ఫలితాలు వేర్వేరుగా రావడంతో వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేశారు. జిల్లాలో వ్యాధి నిర్ధారణ కేంద్రాలు పుట్టగొడుల్లా పుట్టుకొస్తున్నాయి. అర్హత లేకుండానే పలువురు అనధికారంగా కేంద్రాలను నిర్వహిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమడుతున్నారు. ఆర్‌ఎంపీలు ల్యాబ్‌ల పేరిట దండుకుంటున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. వైద్యారోగ్యశాఖ అనుమతి తీసుకోకుండానే డయాగ్నొస్టిక్? కేంద్రాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ప్రైవేటు కేంద్రాలపై వైద్యారోగ్యశాఖ దాడులు చేస్తున్నప్పటికి.. అనుమతి పత్రాలు లేకుండానే కొనసాగుతున్నాయి.

**అడుగడుగునా ఉల్లంఘనలు**

జిల్లాలో 15 డయాగ్నొస్టిక్ కేంద్రాలకు మాత్రమే అనుమతి ఉంది. పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ ప్రాంతాల్లో రెట్టింపుగా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజిస్టు, పాథాలజిస్టులు ఉండాలి. అయితే చిన్న గదుల్లో యంత్రాలు ఏర్పాటుచేసి అర్హత లేనివారు పరీక్షిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్?ఎంపీలు తమ క్లినిక్?లో ల్యాబ్? టెక్నిషియన్? లేకుండానే వ్యాధి నిర్ధారణ పరికరాలతో పరీక్షిస్తున్నారు. సిరంజీలు, రక్తం సేకరించిన డబ్బాలు, ఇతర హానికరమైన బయోవేస్ట్? వస్తువులను పట్టణ శివారులో వదిలేస్తున్నారు.

**ఇవీ నిబంధనలు**

డయాగ్నొస్టిక్ కేంద్రాల నిర్వాహకులకు ల్యాబ్ టెక్నిషియన్ ధ్రువపత్రం కలిగి ఉండటం అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్?మెంట్ అనుమతి తీసుకోవడం

పక్కా భవనంతోపాటు కన్సెల్టెంట్ వైద్యుడు తప్పనిసరి

రోగ నిర్ధారణ పరీక్ష సిటిజన్ ఛార్ట్‌లో ఏ పరీక్ష ఎంత ధరో పొందుపరచడం

వ్యర్థాల కోసం పసుపు, నీలి, ఎరుపు రంగు డబ్బాలు ఏర్పాటు చేయడం.

**నోటీసులు ఇస్తున్నాం–** ప్రమోద్ కుమార్, జిల్లా వైద్యాధికారి

జిల్లాలో డయాగ్నొస్టిక్? కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తున్నాం. అనుమతి పత్రాలు, ఇతర వసతులు లేని నిర్వాహకులకు నోటీసులిస్తున్నాం. నిబంధనలు పాటించవారిపై చర్యలు తీసుకుంటాం.

## ఆయకట్టు స్థిరీకరణ.. భూగర్భ జలాల పెంపు



మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): వృథాగా పోతున్న గోదావరి జలాలకు అడ్డుకట్ట వేసి ఆయకట్టుకు అందించేలా నిర్మల్ జిల్లా సరిహద్దులో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీతో జగిత్యాల జిల్లా రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ బ్యారేజీని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించి నీటిని దిగువకు వదలడంతో యాసంగి పంటలకు నీరందనుంది. దీంతో ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణతో పాటు భూగర్భ జలాలు పెరగనున్నాయి. గోదావరిపై ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి శివారులో గంగనాల, నిర్మల్? జిల్లా ఖానాపూర్? మండలం మేడంపల్లి శివారులో సదర్మాట్? ఆనకట్టలు ఏళ్ల కిందట నిర్మించారు. వీటి కింద ఆయకట్టులో పంటలు సాగవుతుండగా నదిలో ప్రవాహం ఉన్న సమయంలోనే నీరందుతోంది. వరద లేని సమయంలోనూ పంటలకు నీరందించి ఆయకట్టును స్థిరీకరించాలన్న లక్ష్యంతో పాలకులు సదర్మాట్? బ్యారేజీకి రూపకల్పన చేశారు. బ్యారేజీలో నీటిని నిల్వ చేసి అవసరమైన సమయంలో పంటలకు అందించాలన్నది లక్ష్యం.

**తూము ఏర్పాటుతో మేలు**

బ్యారేజీలో నిల్వ చేసే 1.58 టీఎంసీల నుంచి గంగనాల ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని పాలకులు చెబుతున్నారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో నేరుగా గంగనాల ప్రాజెక్టుకు సరిపడా వచ్చే అవకాశం లేదని, అక్కడక్కడ నది లోతు ఎక్కువగా ఉండటంతో ఇటువైపు నీరు రాదని రైతులు పేర్కొంటున్నారు. బ్యారేజీ నుంచి నేరుగా గంగనాల ప్రాజెక్టుకు నీరు వచ్చేలా తూము ఏర్పాటు చేసి కాలువ నిర్మించాలని కోరుతున్నారు. **తగ్గనున్న దూరం** బ్యారేజీపై రెండు వరుసల వంతెన నిర్మించారు. దీంతో ఇబ్రహీంపట్నం, నిర్మల్, మామడ మండలాల్లోని పలు గ్రామాల మధ్య దూరా భారం తగ్గనుంది. గతంలో సమీప గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. వంతెన నిర్మాణంతో దూరం తగ్గనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**4,896 ఎకరాలకు సాగునీరు**

నిర్మల్? జిల్లా మామడ మండలం పొన్కల్, ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ మధ్య గోదావరిపై సదర్మాట్? బ్యారేజీ నిర్మించారు. రూ.676.592 కోట్ల పరిపాలనా అనుమతులతో నిర్మాణం పూర్తయింది .మామడ, ఇబ్రహీంపట్నం మండలాల్లో 1,176 ఎకరాల భూమి సేకరించారు. 1.58 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా 987 మీటర్ల పొడవైన ఆనకట్టను నిర్మించి 55 గేట్లు ఏర్పాటు చేశారు. ఖానాపూర్? మండలం సదర్మాట్ ఆనకట్ట కింద 13,120 ఎకరాలకు, ఇబ్రహీంపట్నం మండలం గంగనాల ప్రాజెక్టు కింద 4,896 ఎకరాలకు నీరందించనున్నారు. సదర్మాట్ బ్యారేజీ నిర్మాణంతో 1.58 టీఎంసీల నీటిని నిల్వ చేయనున్నారు. దీంతో దిగువన ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్‌లతో పాటు మల్లాపూర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరందనుంది. బ్యారేజీ నుంచి ఎగువన సుమారు మూడు నాలుగు కిలోమీటర్ల మేర నదిలో నీరు నిలువనుండగా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి, భర్తీపూర్, కోమటికొండాపూర్, మూలరాంపూర్? తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. సాగునీటితో పాటు ఈ ప్రాంతంలో మత్స్యకారులకు జీవనోపాధి మెరుగవుతుంది.

## 990 లీకేజీలు.. 5 లక్షల లీటర్ల జలం వృథా



కరీంనగర్: మరికొన్ని రోజుల్లో వేసవికాలం రానుంది. నీటి అవసరాలు పెరిగే అవకాశముండగా లీకేజీలతో శుద్ధజలం రోడ్లపై వృథాగా ప్రవహిస్తోంది. గత కొన్ని నెలలుగా కరీంనగర్ నగర పరిధిలో వీటి సంఖ్య అధికమైంది. పలు ప్రాంతాలకు రోజూ నీటి సరఫరా చేస్తుండగా.. మరికొన్ని చోట్ల రోజు విడిచి రోజు సరఫరా అవుతోంది. ఆయా రిజర్వాయర్ల పరిధిలో కంట్రోల్? వాల్వులు దెబ్బతింటున్నాయి. వీధులకు సరఫరా చేసేందుకు నిత్యం వీటిని తిప్పుతుండటంతో వాటి రాడ్లు పాడవుతున్నాయి. నగరంలో సుమారు 990 లీకేజీలతో రోజుకు సుమారు 5 లక్షల లీటర్ల శుద్ధజలం వృథాగా పోతోంది.

**కార్మికులు ఏమయ్యారు?** హైలెవల్, లోలెవల్‌జోన్ పరిధిలో 17 రిజర్వాయర్లు ఉన్నాయి. ఏడాది కిందటి వరకు సుమారు 60 మంది లీకేజీ కార్మికులు పని చేశారు. ప్రస్తుతం ఏడుగురే ఉన్నారు. వారంతా ఎక్కడికి వెళ్లారనే విషయం మాత్రం అధికారులు చెప్పలేకపోతున్నారు. అయితే వీరిని ఏడాది కిందట తొలగించడంతో పని భారం అధికమైంది. లీకేజీలు పరిష్కరించే వారు లేకుండాపోయారు. నీరంతా కలుషితం అవుతున్నా, సరఫరా చేస్తున్న నీటిలో మట్టి వస్తుండగా గుర్తించి పరిష్కరించే వారే లేకుండా పోయారు.

**టెండర్లతో శాశ్వత మరమ్మతులా** అన్ని డివిజన్‌లలో తాగునీటి పైపులైన్లు పగలడం, వాల్వులు చెడిపోయి నీరంతా బయటకు రావడంతో శుద్ధజలం రోడ్లపై ప్రవహిస్తోంది. వీటన్నింటికి తరచూ మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. అయితే లీకేజీలు, వాల్వుల మరమ్మతులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి ఒకసారి మరమ్మతులు చేస్తే మళ్లీ మూడు, నాలుగు నెలల తర్వాత అవే ప్రాంతాల్లో లీకేజీలు అవుతాయి. అలాంట ప్పుడు ఎలా మరమ్మతులు చేస్తారనేది అధికారులు గుర్తించాలి.

నగరానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక రిజర్వాయర్లలో శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. అలాంటి నీరు భారీగా వృథా అవుతోంది. ప్రతి రోజు ఒక డివిజన్?కు సరిపడా (సుమారు 5 లక్షల లీటరు) నీరు వృథాగా పోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. **ఆదేశాలు జారీ చేశాం–** రాజ్‌కుమార్, ఎస్‌ఈ, కరీంనగర్ నగరపాలిక లీకేజీలకు మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేసేలా ఇంజినీర్లతో మాట్లాడాం.

డివిజన్లు: 66రిజర్వాయర్లు: 17

నల్లా కనెక్షన్లు: 64,165

పైపులైన్ల దూరం: 610 కి.మీ

## నక్కవాగులో ఇసుక తోడేళ్లు

హత్నూర: హత్నూర, సంగారెడ్డి మండలాల సరిహద్దుల్లోని నక్కవాగును ఇసుకాసురులు కొల్లగొడుతున్నారు. భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపట్టి.. కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక దందా దర్జాగా కొనసాగిస్తున్నా.. కట్టడి చేయడంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోని తీరుపై ఆరోపణలొస్తున్నాయి. హత్నూర మండలం గుండ్లమాచునూర్, పల్పనూర్, సంగారెడ్డి మండలం ఇస్మాయిఖాన్‌పేట, గౌడిచెర్ల పరిధిలోని నక్కవాగులో అక్రమార్కులు నెల రోజులుగా అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతూ.. ఇసుక తయారు చేస్తున్నారు.

**కొరవడిన అధికారుల నిఘా**

ఇసుక వ్యాపారులు నక్కవాగును జల్లెడలా మారుస్తున్నారు. వాగు రూపురేఖలు మారిపోతున్నాయి. వాహనాల రాకపోకలకు ఏకంగా వాగులో మట్టి రోడ్డు నిర్మించారు. పైపులు వేసి నీటికి అడ్డు కట్టలు కట్టారు. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. అధికారులు అప్పుడప్పుడు నామమాత్రంగా దాడులు చేయడం.. ఆ తర్వాత మిన్నకుంటున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. వాహనాలు సీజ్ చేసి క్రిమినల్, పీడీ కేసులు పెట్టి కఠినంగా శిక్షిస్తేనే.. అక్రమార్కుల తీరు మారుతుందని పలువురు సూచిస్తున్నారు.

**వంతెనకు ముప్పు**

ఇసుక తయారీ కోసం మట్టి తవ్వకాలు జరిపే ప్రాంతానికి అతి చేరువలో 161ఏఏ జాతీయ రహదారి ఉంది. ఆ రహదారిపై వాగుమీద నిర్మించిన వంతెన మనుగడకు ముప్పు పొంచి ఉంది. తవ్వకాలతో ఇసుక, మట్టి వరద ప్రవాహనికి కొట్టుకపోయి పిల్లర్లు క్రమంగా పట్టు



సడలి వంతెన కూలిపోయే పరిస్థిని నెలకొంది. తవ్వకాలు జరగకుండా చూడాలని రెండు మండలాల రైతులు ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందన కరవైంది. అధికారులు ఇసుక వ్యాపారుల ఆగడాలు కట్టడి చేయకపోతే భవిష్యత్తులో భారీ ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

**ఉక్కుపాదం మోపుతాం**

–రాజేందర్, ఆర్డీవో, సంగారెడ్డి

నక్కవాగు పరిసరాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న విషయం మా దృష్టికొచ్చింది. సంగారెడ్డి, హత్నూర మండలాల తహసీల్దార్లతో కలిసి ఏకకాలంలో దాడి చేస్తాం. పట్టుబడిన వాహనాలు సీజ్ చేస్తాం. నిర్వాహకులపై పీడీ కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం. నక్కవాగు ప్రాంతంలో కృత్రిమ ఇసుక తయారీపై ఉక్కుపాదం మోపుతాం.

## దారితప్పి.. నేరాల వలలో చిక్కి

మంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న కాగజ్‌నగర్‌కు చెందిన విద్యార్థి ఇటీవల ద్విచక్రవాహనం చోరీ చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. నేరం రుజువు కావడంతో జువైనల్‌హోంకు తరలించారు. స్థానిక జాఫర్‌నగర్‌కు చెందిన ఇద్దరు బాలురు తరచూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసులకు పట్టుబడినా మార్పు రావడం లేదు. గంజాయి విక్రయాల్లో విద్యార్థులే కీలకంగా మారుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల దొరికిన వారిలో మైనర్లే ఎక్కువగా ఉంటున్నారు.

న్యూస్‌టుడే, మంచిర్యాల నేర విభాగం: కౌమారంలో నేరాలకు పాల్పడుతూ జీవితాలను అంధకారంగా మార్చుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతోంది. చిన్నతనంలోనే వ్యసనాలకు బానిసలై, చెడు స్నేహాలు చేస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతోంది. కొంతకాలంగా బాల, యువ నేరస్థుల సంఖ్య పెరుగుతూ, ప్రమాద ఘంటికలు మోగిస్తూ తల్లిదండ్రులను కలవరపరుస్తోంది.

జిల్లాలోని మంచిర్యాల, మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లిలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ విషసంస్కృతి విస్తరిస్తోంది. పెరిగిన వాతావరణం, స్నేహితుల ప్రభావం, ఆర్థిక పరిస్థితులే నేరాలకు ప్రధాన కారకాలు. ద్విచక్రవాహనం కొనుక్కోవాలనే కోరిక ఒక విద్యార్థిని చోరీకి ప్రేరేపిస్తే, జల్సాలకు డబ్బులు లేవనే కారణం మరో యువకుడిని నేరాలకు పురిగొల్పింది. దొంగతనం చేసి దొరికితే చదువులు, భవిష్యత్తు నాశనమవుతుందని తెలిసినా.. మానసిక పరిపక్వత, మార్గదర్శకత్వం లేకపోవడంతో నేరాల వైపు మళ్లుతున్నారు. చదువుకునే వయసులో శిక్ష అనుభవిస్తున్నారు. జిల్లాలో గతేడాది 25 కేసుల్లో 63 మంది.. ఈ ఏడాది 37 కేసుల్లో 74 మంది బాల నేరస్థులు జువైనల్ హోంలలో శిక్ష అనుభవిస్తున్నారు.

చెడు వ్యసనాలే కారణం.. : విశ్వేశ్వర్‌రావు, మానసిక వైద్యనిపుణుడు, మంచిర్యాలకుటుంబపరంగా ప్రేమలకు, బంధాలకు దూరమవుతున్న వారే చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. యుక్తవయసులో వారిపై అంతర్జాలం, సినిమాలు ప్రభావం చూపుతున్నాయి. మంచిని గ్రహించకుండా చెడునే స్వీకరిస్తున్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు మంచి, చెడులను చెప్పాలి. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చాలి.

## తిర్పల్లి.. విస్తరణ లొల్లి

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రంలో అత్యంత రద్దీగా ఉండే తిర్పల్లి రహదారి ఇది.. విస్తరణ పనులు ఆగిపోవడంతో ఎదురెదురుగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది.. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలో పాత జాతీయ రహదారి విస్తరణ చేపట్టేందుకు ఎనిమిదేళ్ల కిందటే పనులు చేపట్టారు. రిమ్స్ ఎదుట నుంచి తిర్పల్లి వరకు 5 కి.మీ మేర నాలుగు వరుసల రహదారిని ఆరు వరుసలుగా విస్తరించడానికి 2017లో రూ.44.20 కోట్లలో పనులు ప్రారంభించారు. మధ్యలో డివైడరు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. తిర్పల్లి కాలనీకి వచ్చేసరికి అక్కడ రహదారి ప్రాంతంలో నివాసాలు ఉండటం అవాంతరంగా మారింది. పురపాలక, రోడ్లు భవనాలు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఏళ్లుగా చిక్కుముడి వీడటం లేదు.

తిర్పల్లివద్ద దాదాపు 600 మీటర్ల మేర విస్తరణ పనులు ఒక వైపు పూర్తికావడం, మరోవైపు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. గుత్తేదారు తుదిబిల్లు తీసుకొని పని వదిలేసి వెళ్లిపోయారు. అప్పటినుంచి రూ.1.25 కోట్ల విలువైన పనులు ముందుకు సాగడం లేదు. ప్రత్యామ్నాయంపై అయిష్టత: రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇళ్లకు ప్రత్యామ్నాయంగా మావల మండలం బట్టిసావర్గాం సమీపంలో నిర్మిస్తున్న ఐటీ టవర్‌కు సమీపంలో సర్వే నం.134లో ఎకరం స్థలాన్ని ఎంపిక చేశారు. పట్టణానికి దూరంగా ఉండడంతో వారంతా అయిష్టత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు.. : ప్రవీణ్‌కుమార్, డీఈ, రోడ్లు భవనాల శాఖ రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఇప్పటికీ ఎనిమిది సార్లు టెండర్లు పిలిచాం. గుత్తేదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. విస్తరణకు అడ్డురాకుండా అక్రమణలు ఉండొద్దని సంబంధిత అధికారులను కోరుతూనే ఉన్నాం.

# అత్యవసర వేళ ఆపసోపాలు..!

విశాఖపట్నం : గమ్యనగరిగా పేరుగాంచిన విశాఖకు ఇటీవల పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆర్కేబీచ్, కైలాసగిరి, వుడా పార్కు, రుషికొండ వంటి ప్రాంతాలు ప్రస్తుతం సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. అయితే అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో వీఎంఆర్డీఏ యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలను పరిశీలించగా పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా మరుగుదొడ్లు అందుబాటులో లేక, ఎక్కడికి వెళ్లాలో తెలియక మహిళలు అవస్థలు పడటం కనిపించింది.

**రుషికొండలో కేవలం రెండు మరుగుదొడ్లు:** బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌ను నిత్యం 10వేల మందికిపైగా సందర్శిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో పర్యాటకులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. జీవీఎంసీ నిధులు రూ.55 లక్షలతో 22 మరుగుదొడ్ల నిర్మాణానికి జులైలో శంకుస్థాపన చేశారు. ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాగర్‌నగర్ బీచ్‌లో గతంలో ఉన్న కంటైనర్ మరుగుదొడ్లను తొలగించేశారు. బీచ్ రోడ్డులో వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు నాలుగు చోట్ల జీవీఎంసీ ఆధ్వర్యంలో నడిచే ప్రజామరుగుదొడ్లు ఉన్నాయి. కోస్టల్‌బ్యాటరీ నుంచి ఆర్‌కే బీచ్ వరకు ప్రస్తుతం ఒకటి ఉండగా మరో రెండు ఏర్పాటు చేయాల్సి ఉంది. వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ మధ్య ప్రస్తుతం నాలుగు ఉండగా, వాటిని రెట్టింపు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**ఇతర ప్రాంతాల్లో ఇలా..:** వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో కురుసురా జలంతర్గామి, టీయూ-142, సీహారియర్ యుద్ధ విమానం, యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ఉన్నాయి. వీటి నుంచి ఏటా రూ.5 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం.

ఆర్‌కేబీచ్ కాళీమాత ఆలయం సమీపంలోని మరుగుదొడ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయాలి.

దీనిపై వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణను సంప్రదించగా పర్యాటక ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చోట అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

ప్రజా మరుగుదొడ్లు ఉన్న ప్రాంతాలు..కోస్టల్‌బ్యాటరీ: 2 తెన్నేటి పార్క్: 1 ఆర్‌కే బీచ్: 2 పాండురంగా పురం: 1 వైఎంసీఏ: 1 రుషికొండ కూడలి: 1 జోడుగుళ్ల పాలెం: 1

# అడ్డురోడ్డుకు మహర్దశ!

అనకాపల్లి : నక్కపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన కొత్త రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం మార్చింది. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు కూడలిలో దీనిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో రెవెన్యూ డివిజన్ మార్పుపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో నక్కపల్లికి బదులు అడ్డురోడ్డు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కానుంది.

పారిశ్రామికాభివృద్ధి పరంగా శరవేగంగా అడుగులు వేస్తున్న నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి అనిత చొరవ చూపారు. ఇందుకు మంత్రివర్గ ఉపసంఘంలోనూ ఆమోదం లభించింది. ప్రాథమిక నోటిఫికేషన్ తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా నూతన జిల్లాలు, డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలను స్వీకరించింది. ఈ క్రమంలో నక్కపల్లి డివిజన్‌ను తప్పించి.. ఎలమంచిలి కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలంటూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు నిరసనలు తెలిపారు. స్థానిక కూటమి నేతలు సైతం ఎలమంచిలి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించడంతో దీంతో ఇక్కడి ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నక్కపల్లికి బదులుగా దీనికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డురోడ్డు జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. తద్వారా ఆయా ప్రాంతాల వారికి మరింత అందుబాటులో ఉంటుందని ఆలోచన.


**మునగపాక అనకాపల్లిలోనే:** జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని



స్థానిక నేతలు, ప్రజలు విన్నవించారు. ఇటీవల జిల్లా డీఆర్‌సీ సమావేశంలోనూ అనకాపల్లిలోనే మునగపాక మండలాన్ని కొనసాగించాలని తీర్మానించారు. మరోవైపు చీడికాడ మండలాన్ని నర్సీపట్నం నుంచి అనకాపల్లి డివిజన్‌లో కలిపేలా మారుస్తున్నారు. దీంతో అనకాపల్లిలో 10, నర్సీపట్నం, అడ్డురోడ్డు రెవెన్యూ డివిజన్లలో ఏడేసి మండలాల చొప్పున కొనసాగనున్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు కానుంది. ఈ నెలాఖరున ప్రభుత్వ తుది నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

**అభివృద్ధిలో వేగంగా ..** తుని, పాయకరావుపేట తర్వాత అడ్డురోడ్డు వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. పేరుకే తిమ్మాపురం పంచాయతీలో ఉన్నా.. అందరికీ అడ్డురోడ్డు పేరే సుపరిచితం. ఇక్కడ అనేక విద్యా సంస్థలు, ఆసుపత్రులు, వస్త్ర, ఇతర వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారం.. ఇలా అన్నివిధాలా అభివృద్ధి చెందుతోంది. దీనికి తోడు పర్యాటక ప్రాంతమైన రేవుపోలవరం తీరం కూడా ఇదే మండలంలో ఉంది. మరోవైపు ఆది నుంచి నక్కపల్లి పేరును తెరపైకి తెచ్చి చివరిలో అడ్డురోడ్డు డివిజన్ ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# జైకా.. కదలక



చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) సహకారంతో పనుల్లో స్తబ్ధత నెలకొంది. వైకాపా హయాంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చినా అంచనాలు పెరగడంతో గుత్తేదారులు ముందుకురాలేదు. గతంలో తెదేపా పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 33 ప్యాకేజీల కింద 65 చెరువులు, ప్రాజెక్టుల మరమ్మతులు, అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేయాలని నిర్ణయించింది. కార్వేటినగరం మండలంలో కృష్ణాపురం ప్రాజెక్టుకు రూ.28 కోట్లు, పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టుకు రూ.35 కోట్లతోపాటు చిత్తూరు జిల్లాలో 41, తిరుపతి జిల్లాలో 24 చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం తొక్కిపెట్టడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

**17 పనుల రద్దు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 17 పనులు, మరో ఐదు చెరువుల పనులు రద్దుచేసింది. మిగిలిన 48 పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించింది. 2019-20 నాటి అంచనాలు కావడంతో పనులు కదలడం లేదు. రూ.10-12 కోట్లు అవసరం. **నోటీసులిచ్చాం :** పెరిగిన ధరల ప్రకారం ప్రభుత్వానికి నివేదించాం. అదనపు నిధులిస్తేనే పనులు చేపట్టగలం.

- వెంకటేశ్వరరాజు, ఎస్ఈపనుల వివరాలు-- చెరువులు : 41, అంచనా విలువ : రూ.38.18 కోట్లు

# పసుపు మిర్చి... లాభాలు తెచ్చి...



అమరావతి: ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఎర్ర మిరప సాగు ఎక్కువ. గత కొన్నేళ్లుగా నల్లతామర, బొబ్బర తెగులు, చీడపీడల సమస్యల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఏటా నష్టపోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఈ ఏడాది మేడికొండూరు, పెదకాకాని, పల్నాడు జిల్లా గురజాల, మాచవరం మండలాల్లో పసుపు రంగు మిర్చి సాగు చేస్తున్నారు. ఒక్క మేడికొండూరు మండల పరిధిలోనే సుమారు 400 ఎకరాల్లో ఈ రకం మిరప సాగవుతోంది.

**కారణాలివీ..**

ఈ రకం మిర్చి తామర పురుగుతో పాటు, బొబ్బర తెగులు వివిధ రకాల వైరస్‌లు తట్టుకునే గుణం ఎక్కువగా కలిగి ఉంటుంది. మందపాడులో కొంతమంది రైతులు మూడేళ్ల కిందట ప్రయోగాత్మకంగా సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా ఉండటం, అప్పట్లో ఒక్కో క్వింటా ధర రూ.50 వేల నుంచి రూ.60 వేలదాకా పలకడంతో లాభదాయకంగా మారింది. గత రెండేళ్లుగా ఎర్ర మిర్చి సాగు చేసిన రైతులు వివిధ కారణాలతో నష్టపోయారు. దీంతో మరోసారి పసుపు రంగు మిర్చి సాగుకు మొగ్గు చూపారు.

ఒక్క మందపాడులో గ్రామంలోనే 200 ఎకరాల్లో సాగులో ఉంది. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ప్రస్తుతం క్వింటా రూ.35 వేల నుంచి రూ.40 వేల దాకా ధర పలుకుతోంది. **బొబ్బర తెగులు రాలేదు..**

- సూర్యదేవర వెంకటేశ్వరావు, మందపాడు

మూడెకరాల్లో పసుపు రంగు మిర్చి సాగు చేశాం. ఇప్పటి వరకు బొబ్బర తెగులు రాలేదు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.2 లక్షలు ఖర్చయింది. వాతావరణం అనుకూలిస్తే సుమారు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల దాకా లాభం వచ్చే అవకాశం ఉంది.

**ఔషధ గుణాలు పుష్కలం..- లక్ష్మీ, ఏవో, మేడికొండూరు మండలం**

పసుపు రంగు మిర్చిలో ఔషధ గుణాలు ఎక్కువ.. తెగుళ్ల బెడద తక్కువ. అంతర్జాతీయ మార్కెట్లోనూ మంచి డిమాండ్ ఉంది. అన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎకరాకు సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

# బస్సులు ఆగవు.. వెతలు తీరవు!



చీరాల : రేపల్లె నియోజకవర్గం నడింపల్లికి చెందిన వెంకటేశ్వరమ్మ గుంటూరు వెళ్లేందుకు బస్టాప్ వద్ద నిలుచున్నారు. ఆర్డినరీ బస్సులో ప్రయాణికులు రద్దీగా ఉన్నారన్న నెపంతో ఆపలేదు. అరగంట సేపు వేచిఉంటే మరో బస్సు వచ్చినా ఆపకపోవడంతో చెరుకుపల్లి వరకు ఆటోలో వెళ్లి, గమ్యం చేరుకోవాల్సి వచ్చింది. ఈపూరుపాలేనికి చెందిన నలుగురు వ్యక్తులు అత్యవసరంగా గుంటూ రు వైద్యశాలకు వెళ్లడానికి బస్టాప్‌లో నిల్చున్నారు. 15 నిమిషాల్లో బస్సు వచ్చింది. ప్రయాణికులు కిక్కిరిసి ఉన్నారు. ఎక్కినా నిల్చునే పరిస్థితి కూడా లేదు. అరగంట తరువాత మరో బస్సు వచ్చింది. అందులోనూ అదే పరిస్థితి ఉండటంతో ఆటోలో బాపట్ల వెళ్లి, అక్కడ నుంచి గుంటూరు వెళ్లాల్సిన పరిస్థితి. స్త్రీశక్తి పథకానికి ఆదరణ లభిస్తున్నా సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లాలో రద్దీ మార్గాల్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తగినన్ని బస్సులు, ట్రిప్పులు నడపడం లేదన్న విమర్శలున్నాయి. ఒక బస్సు ఆగకుండా వెళ్లినా మరొకటి ఆగుతుందన్న నమ్మకం లేదని, ఒకవేళ ఆపినా రద్దీతో ఎక్కే పరిస్థితి ఉండటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సులో ఎక్కినా కూర్చునేందుకు సీటు దొరకడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ బస్సులు పెంచాలని కోరుతున్నారు. అధిక బస్సులు స్త్రీశక్తి పథకానికి కేటాయించారు. వీటిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నారు. పథకం ప్రారంభంలో 60 నుంచి 70 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో నడిచిన బస్సులు ప్రస్తుతం 100 శాతం దాటడంతో ప్రయాణికులు కిక్కిరిసి వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తోంది.

**అన్ని మార్గాల్లో..**

రేపల్లె-బాపట్ల, రేపల్లె-గుంటూరు, రేపల్లె-విజయవాడ మార్గాల్లో బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతుండటంతో అవస్థలు తప్పడం లేదు. చీరాల-ఒంగోలు, చీరాల-రేపల్లె, చీరాల-గుంటూరు, తెనాలి-చెరుకుపల్లి, తెనాలి-భట్టిప్రోలు మార్గాల్లోనూ ఇదే పరిస్థితి. ముఖ్యంగా డిగ్రీ, ఇంటర్, ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్న మార్గాల్లో బస్సులు 30 నుంచి 40 వరకు నిల్చుని ప్రయాణించాల్సి వస్తోంది. రద్దీతో విసిగిపోతున్న కొందరు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో దురుసుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. బస్సుల సమస్యపై బాపట్ల ఆర్ఎం విమల మాట్లాడుతూ జిల్లాలో ప్రయాణికులకు ఇబ్బంది ఉంటే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 80 శాతం మహిళా ప్రయాణికులు ఉండే మార్గాల్లో అదనంగా బస్సులు ప్రవేశపెట్టే విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

# మన నేత.. మట్టి మేత

ఏలూరు: జిల్లా కేంద్రం ఏలూరులో కీలక వంతెన అది. దాని మీదుగానే నిత్యం పరిమితికి మించి బరువు గల మట్టి లారీలు రయ్‌రయ్‌మని దూసుకెళ్తున్నాయి. వాటి ధాటికి ఏక్షణాన అయినా కుప్పకూలి వాహన రాకపోకలు స్తంభించే అవకాశం ఉంది. అయినా ఆ మట్టి లారీలకు ఎవరూ అడ్డు చెప్పడం లేదు. కారణం అవి జిల్లాకు చెందిన ముఖ్య నాయకుడివి కావటమే. మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు అన్నీ ఆయనే చూస్తున్నారని తెలుసుకుని బాధ్యులైన శాఖలు కళ్లు మూసుకున్నాయి. ఏలూరు నగరంలోకి మట్టి లారీలు సమయపాలన లేకుండా ప్రవేశిస్తున్నాయి. వాటి వేగం, శబ్దానికి శనివారపుపేట, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఇళ్లల్లో ఉండే వారు కునుకు లేకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు. ఆ ముఖ్యనేతకు సంబంధం లేకపోతే ఇప్పటికే యంత్రాంగానికి ఆయనే చెప్పి ఆ లారీలను పట్టించేవారు. ఆపై జనాలను రోడ్డుపైకి పంపి వంతెన దెబ్బతింటుందని ఆందోళన చేయించే వారన్న అభిప్రాయం లేకపోలేదు.

**విజిలెన్స్ విభాగానికి ఏమైంది?..** ఈ నెల 7న జరిగిన డీఆర్సీ, అంతకు ముందు జడ్పీ స్థాయీ సంఘం సమావేశాల్లో మట్టి అక్రమ తవ్వకాలపై చర్చ జరిగింది. ఎందుకు కట్టడి చేయడం లేదని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ గనుల శాఖ యంత్రాంగాన్ని ప్రశ్నించారు. ఆ తర్వాత కూడా మట్టి అక్రమ తవ్వకాలపై కొరడా ఝుళిపించాల్సిన గనుల శాఖ విజిలెన్స్ విభాగం మౌనం వహిస్తోంది. ఇటీవల ప్రభుత్వం ఆ విభాగం ఏడీ పోస్టును భర్తీ చేసింది. అయినా అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు.

కొన్ని వేల మందికి అదే మార్గం.. దుగ్గిరాల, శనివారపుపేట, శ్రీరాంనగర్, దత్తాశ్రమం రోడ్ తదితర ప్రాంతాల నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఫైర్ స్టేషన్ సెంటర్‌కు శనివారపుపేట కాజ్‌వే మీదుగానే వెళ్లాలి. నూజివీడు



నుంచి వచ్చే వారు ఇటు మీదుగా నగరానికి చేరుకుంటారు. నిత్యం కొన్ని వేల మంది జనం, వాహన రాకపోకలు సాగించే వంతెన మట్టి లారీల ధాటికి రోజురోజుకూ కుంగుతోంది. అయినా.. ఎవరికీ పట్టడం లేదు.

తిరిగి మొదలెట్టారు.. ఏలూరుకు సమీపాన తమ్మిలేరులో అక్రమ మట్టి తవ్వకాలపై మొన్నీ మధ్య 'ఈనాడు'లో కథనాలు రాగా కొన్ని రోజులు తవ్వకాలు నిలిపేశారు. తిరిగి ఇప్పుడు మొదలు పెట్టారు. నిత్యం అక్కడ జేసీబీ తదితర యంత్రాలతో మట్టి తవ్వి నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గతంలో లారీ మట్టి రూ.3-4 వేలకు దొరికేది. ఇప్పుడు ఆ నేత తాను మినహా ఇతరులెవరూ తోలకూడదని అల్టిమేటం ఇచ్చి రూ.5-6 వేలకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది.

# మద్దతు దక్కదు.. మార్పు తప్పదు!

త్రిపురాంతకం : సాధారణ మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించడం లేదు. వ్యయ ప్రయాసలకోర్చి పండించాక ప్రకృతి వైపరీత్యాలతో పాటు కొనుగోళ్లు పూర్తిగా వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడటంతో సాగుపై కర్షకుల్లో నిరుత్సాహం ఏర్పడుతోంది. దీంతో లాభాల మాట దేవుడెరుగు పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవని రైతులు విత్తన మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు.

**ఐదేళ్లుగా ఆయకట్టు, బోరుబావుల కింద..**

జిల్లాలో ఐదేళ్లుగా సాగర్ ఆయకట్టుతో పాటు బోరు బావుల కింద సాధారణ మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో 22,000, రబీలో 11,435 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. క్వింటా రూ.2,400 మద్దతు ధర ఉండగా రూ.1,800లకు మించి రేటు లభించడం లేదు. ఈ నేపథ్యంలో పెట్టుబడులకే సరిపోతుండటంతో గత ఐదేళ్ల నుంచి అన్నదాత విత్తన మొక్కజొన్నపై దృష్టి సారించారు. విత్తనాల సరఫరా రసాయన ఎరువుల పంపిణీ ఆయా కంపెనీలే బాధ్యత తీసుకోవడంతో పాటు విత్తన దశలోనే ఒప్పందం కుదుర్చుకుం



టున్నాయి. విత్తన రకాన్ని బట్టి ఎకరానికి కనీసం 4 టన్నుల చొప్పున దిగుబడులు లభిస్తాయి. టన్నుకు రూ.20,00 నుంచి రూ.35,000 వరకు చెల్లిస్తారు. ఈక్రమంలో త్రిపురాంతకంలో 4 వేల ఎకరాల్లోను, జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో విత్తన మొక్కజొన్న సాగు చేపట్టారు.

**నేరుగా కంపెనీలతో ఒప్పందాలు**

వాస్తవానికి అధికారులు, ప్రభుత్వంతో ఎటువంటి సంబంధం లేకుండా రైతులతో విత్తన కంపెనీలు నేరుగా పంట ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అంతా సవ్యంగా సాగితే ఎకరానికి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు రైతులకు చెల్లిస్తున్నారు. అయితే కంపెనీలకు, రైతులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న దళారులు కంపెనీ నుంచి వచ్చే సొమ్ములను నొక్కేసి కర్షకులను వేధిస్తున్నారు. గతేడాది పంట కోశాక ఎగుమతుల సమయంలో డబ్బులు చెల్లింకపోవడంతో పలు గ్రామాల్లో గొడవలు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రైతులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అధికారులు వివరిస్తున్నారు.

# స్వాముల భూములు స్వాహా!

కనిగిరి : కనిగిరి ప్రాంతంలో దేవుడి భూములకే రక్షణ లేకుండాపోయింది. ఆలయాల స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. కొంతమంది అక్రమార్కులు బరితెగించి ఆక్రమించేస్తున్నారు. కొంతమంది నేతల అండదండలతో రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేయడమే కాకుండా వాటిని విక్రయిస్తూ తమ జేబులు నింపుకొంటున్నారు. ఆలయ భూములను పరిరక్షంచాల్సిన దేవాదాయశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఇవి అక్రమార్కుల చెరలో ఉన్న పామూరు పట్టణ సమీపంలోని నెల్లూరు రోడ్డులో మదన వేణుగోపాలస్వామి దేవస్థానం భూములు. ఆలయానికి రూ.25 కోట్ల విలువైన సుమారు 17 ఎకరాల భూములున్నాయి. వీటిని నేతల అండతో అక్రమార్కులు ఆక్రమించేశారు. ఇటీవల అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ వాటిని సైతం తొలగించేశారు. తాజాగా వారం రోజుల కిందట ఆలయ భూముల్లో బోర్లు తవ్వుతుండగా ఆలయ అధికారులు అడ్డుకున్నారు. ఆక్రమిత భూముల్లో వెంచర్లు వేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇది కనిగిరిలోని విజయమార్తాండేశ్వరస్వామి దేవస్థానం. దక్షణ కాశిగా పేరొందిన ఈ ఆలయానికి సుమారు రూ.100 కోట్ల విలువైన 188 ఎకరాలకుపైగా భూములున్నాయి. ప్రస్తుతం కేవలం 8 ఎకరాలు మాత్రమే దేవాదాయశాఖ ఆధీనంలో



ఉండడం గమనార్హం. ఆలయానికి ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భూములున్నట్లు సర్వే నంబర్లతో సహా అధికారులు గుర్తించినప్పటికీ ఇంతవరకు స్వాధీనం చేసుకోలేదు. రూ.కోట్ల విలువైన భూములను అక్రమార్కులు నేతల అండతో నకిలీ పత్రాలతో కబ్జా చేసి స్థిరాస్తి వ్యాపారాలు సాగిస్తున్నారు.

చిత్రంలో కనిపిస్తున్న ఆక్రమణకు గురైన సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లెలోని తిరుమలనాథుని దేవస్థానం భూములు. ఈ ఆలయానికి రూ.30 కోట్లకుపైగా విలువైన 101.9 ఎకరాల భూములున్నాయి. పలుమార్లు దేవాదాయ, రెవెన్యూశాఖల అధికారులు ఆక్రమిత భూములను పరిశీలించినా ఇంతవరకు ఒక్క సెంటు కూడా స్వాధీనం చేసుకోలేదు. కనీసం ఆక్రమణదారులను ప్రశ్నించిన దాఖలాలు గానీ, నోటీసులిచ్చిన సందర్భాలు గానీ లేవు. కొంతమంది నేతల అండదండలతో అక్రమార్కుల చేతుల్లోనే నేటికీ ఆలయ భూములున్నాయి. వీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

# నల్లమలపై స్పందిస్తే స్వర్గధామమే

పెద్దదోర్నాల: ప్రకృతి రమణీయతకు నిలయం నల్లమల. ఎత్తయిన కొండలు, లోతైన లోయలు, పచ్చని గడ్డి మైదానాలు, గలగల పారే సెలయేర్లు, అరుదైన వన్య ప్రాణులు, ఔషద మొక్కలతో పర్యావరణ సమతుల్యతకు నిలయమైన ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పడడంతో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తుందని జిల్లావాసులు ఆశాభావంతో ఉన్నారు. పెద్దదోర్నాలలోని శ్రీశైలం రహదారిలో అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో రూ.కోటితో ఏర్పాటు చేసిన అడ్వెంచర్ పార్కును ప్రారంభిచకపోవడంతో పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఆత్మకూరు రహదారిలోని రోళ్లపెంట సమీపంలో పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ఏడేళ్ల కిందట భవనాన్ని సిద్ధం చేసినా ప్రారంభించలేదు. శ్రీశైలం వెళ్లే రహదారిలో వీర్లకొండపైకి పర్యాటకులు కాలినడకన చేరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఇప్పటికైనా పాలకులు, స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

# వాటాలు తేలే.. జనం మునిగే!

విశాఖపట్నం: థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ద్వారా వచ్చే ఫ్లైయాష్ (బూడిద) రవాణా కొందరికి కాసులు కురిపిస్తోంది. నగరవాసులను మాత్రం కాలుష్యం సుడిలోకి నెట్టేస్తోంది. అన్నీ తెలిసినా కొందరు ప్రజాప్రతినిధుల జోక్యం ఉండటంతో అధికారులు పట్టించు కోవడం లేదు. ఇప్పటికే దిల్లీని మించి విశాఖలో గాలి నాణ్యత దెబ్బతిన్నట్లు గణాంకాలు చెబు తున్నాయి. మరోవైపు నేతల కమీషన్ల కోసం ప్రతిరోజూ నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వందల లారీలతో కాలుష్యం మరింత పెరిగిపోతోంది.

**డిమాండ్ పెరగడంతో:** విశాఖ నగరానికి సమీపంలో ఉన్న రెండు థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచి బూడిద రవాణా అవుతుంది. గతంలో ఉచితంగా ఇచ్చేవారు. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో టెండర్లు పిలుస్తున్నారు. సిమెంటు, ఇటుక పరిశ్రమలు, జాతీయ రహదారుల నిర్మాణానికి ఫ్లైయాష్ వెళుతుండగా... మరో రకమైన సైలో యాష్‌ను పోర్టు నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఓ సంస్థ పిట్టవాని పాలెం వద్ద వెయ్యి ఎకరాల్లో, ఇంకో సంస్థ పాలవలస వద్ద 300 ఎకరాల్లో ఫ్లైయాష్ నిల్వ చేస్తుంటాయి. ఈ ప్రాంతాల నుంచి లారీలు మొదలై దేశపాత్రునిపాలెం, ఏలేరు కాల్వ మీదుగా జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. ప్రతిరోజూ 300పైగా లారీలు బూడిద రవాణా చేస్తున్నాయి.



**నిత్యం అవస్థలు..**

ప్లాంట్‌ల నుంచి బూడిద రవాణా చేసే సమయంలో పరిమితికి మించి నింపేస్తున్నారు. కొన్ని సార్లు టార్పాలిన్ పట్టాలు కప్పకుండానే తరలిస్తున్నారు. మరికొన్ని లారీలకు కప్పినా ఓవర్‌లోడు కారణంగా కుదుపుల సమయంలో బూడిద జారి రోడ్లపై పడుతోంది. గాలికి ఆ బూడిద లేచి ద్విచక్ర వాహన చోదకులు, ఆటో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెంబడి ఉండే దుకాణదారులు, ఇళ్లపై బూడిద కమ్మేసి శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంటలతో అల్లాడుతున్నారు.

**అంతా మేం చూసుకుంటామంటూ:** ప్లాంట్ల నుంచి బూడిద రవాణా చేసే బాధ్యతలు టెండర్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు దక్కించుకున్నా.. తరువాత ఉప గుత్తేదారులకు ఇచ్చేస్తున్నారు. దీనికీ ఓ కారణం ఉంది. చెప్పినట్లు వినకపోతే..బూడిదతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికుల నుంచి ఆందోళనలు తప్పవనే సంకేతాలను నేతలు పంపుతున్నారు. అలా కొందరు నేతలు చెప్పినవారికి కాంట్రాక్టు అప్పగించాక ప్రతి ట్రిప్పునకు వాటాలు మాట్లాడు కుంటున్నారు. ఇద్దరు ప్రజాప్రతినిధుల కీలక అనుచరులు ఈ కమీషన్ల వసూళ్ల వ్యవహారం చూస్తున్నట్లు సమాచారం.

# గుజరాత్‌కు గుట్టుగా బియ్యం

ఆదోని : పేదల బియ్యం సరిహద్దు దాటుతోంది.. ఇన్నాళ్లు కర్ణాటకలోని బియ్యం మిల్లులకు తరలిస్తున్న వ్యాపారులు ప్రస్తుతం 'రూట్' మార్చారు. లాభం ఎక్కువగా ఉండటంతో గుజరాత్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. గత నెలలో 35 టన్నులతో వెళ్తున్న లారీ మాధవరం తనిఖీ కేంద్రం వద్ద పట్టుబడింది. ఇలా ప్రతి నెలా 10 నుంచి 15 లారీల వరకు వెళ్తున్నట్లు అంచనా. ఒక్కోలారీపై రూ.2 లక్షల వరకు లాభం గడిస్తున్నారు. వీటిని ప్రతి నెలా మొదటి వారంలో అర్ధరాత్రి దాటిన తర్వాత సరిహద్దులు దాటిస్తున్నారు. మాధవరం, హొళగుంద, నాగలదిన్నె వంతెన మీదుగా గుట్టుగా తరలిస్తున్నారు.

**ప్రతి నెలా రూ.30 లక్షల ఆదాయం** రేషన్ బియ్యం దందా చేసే అక్రమార్కులు గతంలో కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప, సింధనూరు, రాయచూరు ప్రాంతాలకు తరలించేవారు. అక్కడ కిలో రూ.24 నుంచి రూ.28 పలుకుతోంది. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్, అహ్మదాబాద్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో డిమాండు ఉండటంతో అక్కడికి తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.34- రూ.40 పలుకుతోంది.ఒక లారీ(పెద్దది)లో 30 నుంచి 35 టన్నుల వరకు తీసుకెళు _న్నారు. ఒక్కో లారీపై రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు లాభం చేకూరుతుంది. ఇలా ఏటా రూ.2.50 కోట్ల నుంచి రూ.3.50 కోట్ల వరకు సొమ్ము చేసుకుంటున్నారు.

**తనిఖీ కిట్లు ఏమైనట్లు** బియ్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తనిఖీల్లో పట్టుబడిన బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసినవో కాదో కనిపెట్టేందుకు రసాయనాలతో కూడిన ర్యాపిడో కిట్లు గతేడాది నవంబరులో అందించారు. కర్నూలు జిల్లాకు 20, నంద్యాల జిల్లాకు 15 కిట్లు వచ్చాయి.

పట్టుబడిన బియ్యాన్ని ర్యాపిడో కిట్లలోని రెండు రకాల రసాయనాలతో పరీక్షస్తారు. ఎరుపు రంగులోకి మారితే రేషన్ బియ్యంగా తేలుస్తారు. ఇప్పటి



వరకు వీటిని వినియోగించినట్లు దాఖలాలు లేవు.

**సేకరణకు ఏజెంట్ల నియామకం**


ఉమ్మడి జిల్లాలో 12.10 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి ప్రతినెలా 5 కిలోల బియ్యం ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. ఇందుకు ప్రభుత్వం ఒక కిలోకు రూ.46 ఖర్చు చేస్తోంది. ప్రతినెలా ఉమ్మడి జిల్లాకు 19 వేల మెట్రిక్ టన్నులు కేటాయిస్తున్నారు.

బియ్యం వ్యాపారులు కొందరు పేదలను ఏజెంట్లుగా నియమించుకొంటున్నారు. వారు క్షేత్రస్థాయిలో తిరుగుతూ కార్డుదారుల వద్ద సేకరిస్తున్నారు. రూ.15 నుంచి రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అలా సేకరించిన బియ్యాన్ని వీధుల్లో ఓ చోట నిల్వ చేస్తున్నారు. కొంత మొత్తం పోగైన తర్వాత సదరు వ్యాపారి వాహనం వచ్చి తీసుకెళ్తోంది.

రేషన్ కార్డుదారులకు ప్రతినెలా ఉచితంగా అందజేస్తున్న పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన లేక లక్షలాది మంది తినడం లేదు. 60 శాతం మంది వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

జిల్లా కర్నూలు
చౌక దుకాణాలు: 1,233
రేషన్ కార్డులు: 6,73,526
మొత్తం సభ్యులు: 11,685.090
ప్రతినెలా బియ్యం కేటాయింపు (టన్నుల్లో): 22,51,764

# కరివేపాకు.. కాసుల పంట



అనంతపురం : వాణిజ్య పంటగా పేరొందిన పంటల్లో కరివేపాకు ఒకటి. డిమాండుకు తగట్టుగా ధర అమాంతంగా పెరిగిపోయింది. అరటి, చీనీ, కర్బూజాకు కూడా ఈ ధర దక్కదు. పంటను ఒకసారి సాగు చేస్తే 15-20 ఏళ్ల పాటు నిరంతరాయంగా దిగుబడి పొందవచ్చు. గతంలో ఎన్నడూ లేనివిధంగా టన్ను ఏకంగా రూ.50 వేలకు పైగా పలుకుతోంది.

**ఏడాదికి మూడు కోతలు**

కరివేపాకు తొలి ఏడాది కోత కొంత ఆలస్యమవుతోంది. రెండో ఏడాది నుంచి నాలుగు నెలలకొకసారి చొప్పున ఏడాదికి మూడు కోతలు వస్తాయి. ఎకరాకు మొదటి కోతకు దిగుబడి 8 టన్నులు వస్తోంది. ఆ లెక్కన ఏడాదికి 24 టన్నుల వరకు దిగుబడి వస్తోందని ఉద్యానశాఖ అంచనా వేసింది. రెండో కోత పంట నుంచి పెట్టుబడి ఖర్చులు తగ్గడం, దిగుబడి పెరగడంతో మంచి ఆదాయం పొందుతున్నారు.


**2,300 ఎకరాల్లో సాగు**

జిల్లాలోని గుంతకల్లు, తాడిపత్రి, నార్పల, పుట్లూరు, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, శింగనమల, గార్లదిన్నె, పామిడి, యాడికి, యల్లనూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో కరివేపాకు ఎక్కువ సాగు చేస్తున్నారు. సుమారు 2,300 ఎకరాల్లో పంట ఉంది. ఏడాదికి 55,200 టన్నులు దిగుబడి వస్తుంది అధికారులు అంచనా వేశారు.

**వివిధ ప్రాంతాలకు ఎగుమతి**

ఆంధ్రప్రదేశ్‌తో పాటు ముంబయి, బెంగళూరు, చిత్రదుర్గం, బళ్లారి, హైదరాబాద్, చెన్నై తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. పంటకు డిమాండు పెరగడంతో తోటల వద్దనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

# పసివయసుకు ప్రసవ గండం



చిత్తూరు : బాలికలకు కనీస వివాహ వయసు 18 ఏళ్లుగా చట్టం చేసినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఆలోపు వారు గర్భం దాలిస్తే శారీరక, మానసిక సమస్యలు ఎదురయ్యే అవకాశమున్నా తల్లిదండ్రులు విస్మరిస్తున్నారు. అవగాహన కల్పించడంలో అధికారులూ విఫలమవుతున్నారు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీనేజర్ల ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి.

తిరుపతి జిల్లాలో 2025 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ముప్పైవేల వరకు ప్రసవాలు జరిగాయి. అందులో 13-19 ఏళ్లలోపు బాలికలు 3,364 మంది ఉన్నారు. చిత్తూరు జిల్లాలో మొత్తం ప్రసవాలు పోల్చితే ఆరువేల వరకు తక్కువగా ఉండగా గర్భం దాల్చిన టీనేజర్ల సంఖ్య 2,565 నమోదైంది. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో పరిశ్రమలు ఉండటం, ఉపాధి కోసం ఉత్తరాది రాష్ట్రాల నుంచి తల్లిదండ్రులు వలస వస్తుండగా వారితో వచ్చే బాలికలు త్వరగా గర్భం దాల్చుతున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సహజంగానే శివరాత్రి సమయంలో బాల్య వివాహాలు అధికం. చిత్తూరు జిల్లాలో కుప్పం, పలమనేరులో ఇలాంటి ప్రసవాలు జరుగుతున్నాయి. కుప్పం ప్రాంతంలో తల్లిదండ్రులు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తుండటంతో ఇక్కడ అత్యధికంగా 14.9 శాతం టీనేజర్ల ప్రసవాలు నమోదవుతున్నాయి.

**తల్లీబిడ్డలకు ప్రతిబంధాలు ఇలా..**

బాలికల్లో శారీరకంగా ఎదుగుదల లేకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో సిజేరియన్లు చేస్తున్నారు. 65 శాతం మంది వరకు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వీరికి ప్రసవాలు చేయడం క్లిష్టతరమవుతుండటంతో జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ప్రసవం సమయంలో ఇబ్బందులు ఎదురై మాతాశిశు మరణాలు పెరుగుతున్నాయి. ఇలాంటి కేసుల్లో శిశువులూ బలహీనంగా ఉంటున్నారు.

**కమిటీలు ఉండి లాభమేంటి?**

బాల్య వివాహాలు నేరం. ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలుశిక్ష రూ.లక్ష జరిమానా విధించే అవకాశముంది. ఇలాంటి వాటిని అడ్డుకోవడానికి గ్రామ, మండల స్థాయిలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలతో కమిటీలు వేసినా ప్రయోజనం లేకుండాపోయింది. గ్రామపెద్దలు పంచాయితీలు చేయడం, పిల్లలకు రహస్యంగా పెళ్లిళు చేయడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

**ఇలా చేస్తే మేలు**

పాఠశాలల్లో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పారిశ్రామిక ప్రాంతాల్లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పరిస్థితుల్లో మార్పువచ్చే అవకాశం ఉంటుంది. వివాహాలు అరికట్టడానికి పొదుపు మహిళల సాయం తీసుకోవడం, 1098 టోల్‌ఫ్రీ నంబరు, అధికారుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

# నష్టం నమోదైనా.. పరిహారం జాప్యమేనా!



బాపట్ల: మొంథా తుపాను వచ్చి వంద రోజులు గడిచినా పంట నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందలేదు. పెట్టుబడి రాయితీ కోసం సాగుదారులు ఎదురుచూస్తున్నారు. మరో నెలన్నరలో రబీ సీజన్ ముగియనుంది. ప్రభుత్వం వెంటనే సాయాన్ని అందజేయాలని కోరుతున్నారు. గత అక్టోబరు 28న మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో రెండ్రోజులు భారీవర్షాలు కురిశాయి. బాపట్ల, చీరాల, కారంచేడు, పర్చూరు ప్రాంతంలో కుంభవృష్టి సంభవించింది. 24 గంటల వ్యవధిలో 23 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. పర్చూరు వాగు, నల్లమడ వాగు, సాకి, ఆలేరు వాగు, కొమ్మమూరు కాలువ కట్టలు తెగి గండ్లు పడి వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, అపరాలు, పత్తి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి పొలాలు చెరువుగా మారాయి. వారం రోజులు పైగా వరి పైరు నీటిలోనే మునిగి కొన్నిచోట్ల కుళ్లిపోయింది. సాగుదారులు ఎకరాకు రూ.15 నుంచి 18 వేల వరకు పెట్టుబడి నష్టపోయారు. లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.

**ప్రత్యేక బృందాలు వివరాలు సేకరించినా..**

పంట నష్ట వివరాల సేకరణకు ప్రత్యేక బృందాలను నియమించారు. మొత్తం 12,700 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు సర్వేలో తేలింది. అత్యధికంగా వరి పంట 7882 హెక్టార్లలో దెబ్బతింది. మినుమలు 1175 హెక్టార్లు, మొక్కజొన్న 870 హెక్టార్లు, పత్తి 626 హెక్టార్లలో నష్టపోయినట్లు వ్యవసాయ, రెవెన్యూ అధికారుల బృందాలు నమోదు చేశాయి. నవంబరు రెండో వారంలో గ్రామ సభలు నిర్వహించి పంట నష్టపోయిన రైతుల తుది జాబితా రూపొందించి పరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి పంపించారు. కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి తుపాను వల్ల కలిగిన పంట నష్టాన్ని పరిశీలించి వెళ్లింది. రైతులతో మాట్లాడి జరిగిన నష్టం వివరాలు సేకరించారు.

**రైతుల ఎదురుచూపు**

2024 సెప్టెంబరులో వచ్చిన కృష్ణా వరదలకు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్ట వివరాలు వేగంగా సేకరించి 20 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలో పరిహారాన్ని ప్రభుత్వం జమ చేసింది. మొంథా తుపానుకు నెలరోజుల్లో పరిహారం అందుతుందని సాగుదారులు ఆశించారు. నెలలు గడుస్తున్నా ఊసే లేదు. ఇన్‌పుట్ రాయితీ సాయాన్ని విడుదల చేస్తే రబీ పంటల నూర్పిడి ఖర్చులకు ఉపయోగపడతాయని అన్నదాతలు అంటున్నారు. దీనిపై జేడీఏ విజయనిర్మల మాట్లాడుతూ తుపానుకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపించామన్నారు. త్వరలో పరిహారం అందుతుందని చెప్పారు.

పంట నష్టపోయిన చిన్న, సన్నకారు రైతులు (ఐదెకరాల్లోపు) : 17,308
పంట నష్టపోయిన ఇతర రైతులు (ఐదెకరాల పైన) : 1118
మొత్తం దెబ్బతిన్న పంటల విస్తీర్ణం (హెక్టార్లలో) : 12,700
పంట నష్టం (రూ.కోట్లు) : 84.16
ప్రభుత్వం ఇవ్వాల్సిన ఇన్‌పుట్ రాయితీ (రూ.కోట్లు) : 29.35

# ప్రమాదాలతో 'సెల్'గాటం

కర్నూలు : అనంతపురానికి చెందిన యువకుడు (28) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేసేవారు. సెలవులు రావడంతో ద్విచక్ర వాహనంపై సొంతూరికి బయలుదేరారు. కర్నూలు సమీపంలో 44వ జాతీయ రహదారిపైన సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఒంటిచేత్తో వాహనం నడుపుతున్నారు. అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయారు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇలా.. వాహనాలు నడిపే సమయంలో చరవాణుల్లో మాట్లాడుతూ ప్రమాదాల బారినపడుతున్న సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అదుపుతప్పుతున్నారు ప్రమాదాల బారిన పడుతున్న వారిలో ఎక్కువగా ద్విచక్ర వాహనచోదకులే ఉంటున్నారు. సెల్‌ఫోన్ రింగ్ చెవినపడగానే జేబులోంచి ఫోన్‌తీసి మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారు. చాలామంది వాహనంలో చరవాణి పెట్టుకునేందుకు ప్రత్యేక స్టాండ్లు సైతం ఏర్పాటు చేయించుకున్నారు.

చరవాణి వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల చోదకుడిలో ఏకాగ్రత లోపిస్తోంది. చెవి, భుజానికి మధ్య సెల్‌ఫోన్ పెట్టుకొని వేగంతో వాహనం నడిపే క్రమంలో రహదారిపై వెళ్లే మిగతా వాహనాలను సరిగా గుర్తించలేకున్నారు. హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చే జంతువులు, స్పీడ్‌బ్రేకర్లు, గుంతలను గుర్తించలేక అదుపుతప్పి పడిపోతున్నారు. 2025లో జిల్లా వ్యాప్తంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన 1091 మందికి రూ.12.85 లక్షల జరిమానా విధించారు.

చాటింగ్ చేస్తూ.. రీల్స్ చూస్తూ..



కర్నూలు జిల్లాలో 40, 44, 340సీ, 167వ జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వీటితో పాటు రాష్ట్ర, గ్రామీణ రహదారులు ఉన్నాయి. ఈ రహదారులపై ఇటీవల కాలంలో అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది యువత వాహనం నడుపుతూనే ఫోన్ మాట్లాడటంతో పాటు సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం, చాటింగ్ చేయటం, పాటలు వినడం వంటివి చేస్తున్నారు. మరికొందరు డ్రైవింగ్ చేస్తూనే సెల్ఫీలు దిగుతున్నారు. కొందరు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని ఎక్కువ శబ్దంతో పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తున్నారు. వెనుక వెళ్లే వాహనదారులు హారన్ కొడుతున్నా వినిపించుకోకుండా వెళ్తున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు జరిగే సందర్భాల్లో స్మార్ట్‌ఫోన్లలో మ్యాచ్ లైవ్ చూస్తూ వాహనాలు నడుపుతున్నారు. కొందరు గూగుల్ మ్యాప్ ద్వారా దారిని అనుసరిస్తూ సెల్‌ఫోన్‌పై దృష్టి పెట్టడంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

# గడువు సమీపిస్తున్నా.. పుష్కర కార్యాచరణేదీ..?

రాజమహేంద్రవరం : గోదావరి పుష్కరాలకు గడువు సమీపిస్తున్నా.. సమావేశాలతోనే సరిపెడుతున్నారు తప్ప సరైన కార్యాచరణ కానరావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. యంత్రాంగం అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రభుత్వం వివరణ కోరడం, నిధుల వినియోగం, ఆవశ్యకతపై నివేదిక అందజేయాలని ఆదేశించడం ఇందుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం ఆదేశాల మేరకు నగరపాల సంస్థ అధికారులు మంగళవారం అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన విభాగం అధికారులతో సమావేశమై పుష్కరాలకు సంబంధించి తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులపై వివరించారు. నగర పాలక సంస్థ రూ. 2105 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలు అందజేశారు. పుష్కరాలకు చేపట్టే ముందస్తు పనులపై నివేదిక ఇవ్వాల వారు కోరినట్లు తెలుస్తుంది.

**సమావేశాలు జరిగినా..**

రాజమహేంద్రవరంలో రెండు సార్లు సన్నాహక సమావేశాలు నిర్వహించినప్పటికీ ఇంకా పుష్కరాల నిర్వహణపై తుది నివేదిక అందించలేని పరిస్థితి. మొదటి సమావేశంలో ప్రతిపాదించిన పనులు కేవలం పుష్కర ఆతిథరి?య నగరం రాజమహేంద్రవరానికే పరిమతమయ్యాయి. మలివిడత సమావేశంలో ముందు ప్రతిపాదించిన పనులను పుష్కర ప్రత్యేక అధికార బృందం తిరస్కరించి గోదావరి



పరివాహక ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని నివేదిక ఇవ్వాలని కోరింది. తాజాగా రాష్ట్ర ఉన్నతాధికారులు మాత్రం త్వరలో సమావేశం ఏర్పాటు చేసి తుది నివేదికన ఆమోదించి దశ-దిశ నిర్దేశిస్తామని సూచించినట్లు తెలుస్తుంది.

**కొరవడిన సమన్వయం**

పుష్కర పనులు ఇంకా పట్టాలెక్కలేదు. ఏఏ పనులు చేట్టాలనే అంశం పైనా నిర్ధారణకు రాలేని పరిస్థితి. శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అధికారిక సమావేశాల్లో తప్ప మిగిలిన సందర్భాల్లో ఎక్కడా వీటి ప్రస్తావన లేకుండా పోతోంది. ఇప్పటి వరకు ఎన్ని ఘాట్‌లు సిద్ధం చేయాలి, ఏయే ఘాట్‌లకు మరమ్మతులు చేపట్టాలనే దానిపైనా స్పష్టత కొరవడిం ది. గోదావరి ఘాట్‌లకు అనుసంధానంగా ఉన్న రహదారుల విస్తరణ, ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన పనులపై కూడా అంచనా లేని పరిస్థితి ఉంది. గత పుష్కరాలకు రెండేళ్లు ముందుగానే ఘాట్‌ల నిర్మాణం చేపట్టి మూడు నెలలు ముందే సిద్ధం చేశారు.

## ‘జీవీఎంసీ’లో విలీనానికి సమ్మతమేనా?!

భీమిలి : రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో పంచాయతీలను విలీనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. భీమిలిలో మూడు మండలాలకు సంబంధించి 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇప్పటికే అక్కడి నాయకులతో చర్చించారు. స్థానిక పాలకుల అనుమతితో ప్రక్రియ పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. విలీనమైతే 98 వార్డులతో విస్తరించిన ఉన్న జీవీఎంసీ పరిధి మారుతుంది. మళ్లీ వార్డుల విభజన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

**అభివృద్ధి జరిగేనా..?**

భీమిలి, అనకాపల్లి పరిధికి చెందిన కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, నగరంపాలెం, జేవీ అగ్రహారం, తాడి, వల్లూరు, తల్లపువాని పాలెం, రాజుపాలెం విలీనం తర్వాత గ్రేటర్ విస్తీర్ణం 535 చదరపు కిలోమీటర్ల నుంచి 640 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అయితే ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ గ్రామీణ వాతావరణమే కనిపిస్తుంది.

ఇప్పుడు మళ్లీ మరో 64 పంచాయతీలను విలీనం చేస్తే.. నగర విస్తీర్ణం పెరుగుతుందే తప్ప, ప్రజల జీవనం విధానంలో మార్పులు ఆశించొచ్చా



అనే చర్చ కూడా సాగుతోంది.

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పంచాయతీల విలీనం అంశం ఇంకా తమ దృష్టికి రాలేదని జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావు తెలిపారు.

**గతంలో ఇలా..** 2012లో పాలకవర్గం కాలపరిమితి తర్వాత భీమిలి, అనకాపల్లికి చెందిన పది పంచాయతీలను విలీనం చేయడానికి ప్రతిపాదించారు. ఆయా పంచాయతీల నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఏళ్ల పాటు కేసులు పరిష్కారం కాలేదు. ఆ తర్వాత విలీన ప్రక్రియ పూర్తి చేసి, 2020లో జీవీఎంసీ ఎన్నికలు నిర్వహించారు. 2005లో గాజువాకతో పాటు, పలు పంచాయతీలను విలీనం చేశారు. ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం లేదు. తాగునీరు, వీధి దీపాలు, కాలువలు వంటి వసతులు అరకొరగానే ఉన్నాయి.

## కొత్త పంచాయితీలిస్తున్నారహో..

నక్కపల్లి : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలే కీలకం. ప్రస్తుతం మరిన్ని పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయిదేళ్ల కిందట ఏర్పాటు చేసిన నూతన పంచాయతీలకు తోడు ఇప్పుడు మరిన్ని ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖగా ఉన్న సమయంలో 2020లో నూతన పంచాయతీల ఏర్పాటు జరిగింది. ఈ క్రమంలో 50 గ్రామాలు ఏర్పాటు కాగా, ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 49 ఉన్నాయి. ఇందులో చీడిక, ఆవరాజాం, గొర్లి ధర్మవరం, చినమదీనా, సీతయ్యపేట, కంతారం, రామన్నపాలెం, చామంతిపురం, మామిడిపాలెం, మూలపేట, రామగిరి, దుగ్గాడ, మెట్టపాలెం, సుందరకోట, తిక్కవానిపాలెం, వెంకటాపురం, కె.కోట్నిబిల్లి, రొంగలపాలెం, ములకాపల్లి తదితర అప్పట్లో ఏర్పాటైనవే. ఇందులో ఒకట్రెండు మినహా మిగిలిన వాటన్నింటికి ఎన్నికలూ జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాజాగా నూతన పంచాయతీలు, ఇతరత్రా సవరణలకు ప్రభుత్వం సుముఖత తెలుపుతూ వీటిపై ఉన్న నిషేధాన్ని ప్రస్తుతం సడలించింది.

ప్రభుత్వం చేసిన సడలింపు ద్వారా పంచాయతీని రెండు పంచాయతీలుగా మార్పు చేయడం, రెండు పంచాయతీలను ఒకేదానిగా మార్పు, ఒక పంచాయతీలో గ్రామాన్ని మరో పంచాయతీలోకి విలీనం చేయడం, సమీపంలోని పుర, నగరపాలక సంస్థల్లోకి చేర్చడం వరకు అవకాశం ఉంటుంది. ఓ పంచాయతీని మరో మండలంలోకి విలీనం చేసే సౌలభ్యం మాత్రం లేదు.

జిల్లాలో ప్రస్తుతం నక్కపల్లి మండలం రాజయ్యపేట నుంచి బోయపాడు, పెదతీనార్ల నుంచి దొండవాక, వి.మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారం నుంచి కొండయ్యపాలెం, కోటవురట్ల మండలం కొత్త తంగేడు నుంచి పాత తంగేడు, రాంబిల్లి మండలం గోకివాడ నుంచి మూలకొత్తూరును విభజించి పంచాయతీ చేయాలనే ప్రతిపాదనలు స్థానికుల నుంచి వచ్చాయి. ఇలా జిల్లాలో 40 వరకు ఉంటాయని అంచనా. మరోవైపు దేవరాపల్లి మండలం కొత్తపెంట పంచాయతీని



కె.కోటపాడు మండలంలోకి విలీనం చేయాలనే డిమాండ్ ఉంది.

పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి..ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. గ్రామాల విలీనం, విభజనకు సంబంధించి పంచాయతీల్లో పాలకవర్గం తీర్మానం చేయాలి. పాలకవర్గం లేని చోట్ల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ప్రక్రియ జరుగుతుంది.

**ప్రస్తుతం జిల్లా స్వరూపం**

మొత్తం పంచాయతీలు : 646

ప్రత్యేకాధికారి పాలనలో ఉన్నవి: మూడు (చీడిక, ఎం.చింతువ, అప్పారాయుడుపాలెం)

మేజర్ పంచాయతీలు : 48

జనాభా : 14,94,947

**ఆదేశాలు రాగానే అమలు**

ప్రభుత్వం పంచాయతీల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి నిషేధం ఎత్తివేయడం ద్వారా నూతన ప్రతిపాదనలకు మార్గం సుగమం అవుతుంది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆదేశాలు రాగానే, ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు పంపిస్తాం. అక్కడ ఆమోదం పొందుతాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యే క్రమంలో గ్రామసభలు పెట్టి, తీర్మానాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారు.

సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

## కరిగిపోతున్న కొండ.. ఆగని దందా!



అనకాపల్లి : పర్యావరణానికి రక్షణగా నిలిచే కొండలను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. కాసులే పరమావధిగా తవ్వకాలు చేస్తున్నారు. కొండలకు ఆనవాళ్లే లేకుండా గుండు చేస్తున్నారు. అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాల్సిన జిల్లా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో వారి అక్రమ తవ్వకాలను అంతేలేకుండా పోతోంది. నెలవారీ ముడుపులు అందడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని శేషుకొండ ఉంది. ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన రాయి, గ్రావెల్, కంకర దొరుకుతుంది. కానీ.. ఇక్కడ తవ్వకాలు చేసేందుకు ఎటువంటి అనుమతులు లేవు. అయినా.. స్థానిక నేతల అండదండలతో అక్రమంగా తవ్వేస్తున్నారు. దర్జాగా భారీ యంత్రాలు పెట్టి కొల్లగొడుతున్నారు. బాంబుల సాయంతో పేల్చి కొండరాయి అమ్ముతున్నారు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిసర ప్రాంతాల్లో లేఅవుట్లు, నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో మట్టి, కంకర, రాయికి మంచి డిమాండ్? ఉంది. ఇదే అదునుగా చేసుకుని అక్రమార్కులు రాత్రింబవళ్లు తవ్వకాలు సాగిస్తూ రాయి ట్రాక్టర్? రూ. 1800, కంకర రూ. 1200కు విక్రయిస్తున్నారు. కంకరను ట్రాక్టర్? రూ. 2 వేల వరకు అమ్ముతున్నారు. దూర ప్రాంతాలకు అయితే ఈ రేటు పెరుగుతుంది.

రాంబిల్లిలోని పేలోడు కొండప్రాంతంలో కొంతకాలంగా కంకర తవ్వకాలు జరగుతున్నాయి. ఇళ్ల పునాదులు, లేఅవుట్ల ఎత్తుకు తరలించేస్తున్నారు. స్థానికంగా ఉన్నవారు కంకర తవ్వకాలపై స్థానిక రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమమని తెలిసినా అంతే..

శేషుకొండ పరిధిలో ఏఎంఆర్? కంపెనీకి ఓ చెక్‌పోస్టు ఉంది. శేషుకొండలో తవ్వకాలు చేసి.. వేరే మార్గంలో తరలిస్తే తమ ఆదాయం పోతుందని తవ్వకాలు చేస్తున్నచోట సీనరేజీ వసూలు చేస్తున్నారు. ఈ తవ్వకాలు అక్రమ వ్యాపారమని ఏఎంఆర్? కంపెనీ ప్రతినిధులకు తెలిసినా.. కనీసం మైనింగ్? అధికారులకు సమాచారం ఇవ్వడంలేదు. దీనికి తోడు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదే తరహాలో రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో కొండలను పిండిచేసి అక్రమ కంకర వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు మైనింగ్? అధికారులకు సమాచారం అందించినా వారు పట్టించుకోవడంలేదు.

**అక్రమంగా తవ్వితే చర్యలు**

– శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

శేషుకొండ ప్రాంతంలో కంకర, రాయి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవు. అక్రమంగా తవ్వకాలు చేయడం నేరం. అక్కడ ఇటీవల ఫిర్యాదులు అందడంతో.. రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశాం. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే.. అపరాధ రుసుం విధించి వాహనాలు సీజ్? చేస్తాం.

## మట్టి మింగేస్తున్నారు



ధర్మవరం : ధర్మవరం నియోజకవర్గంలో మట్టి మాఫియా పెట్రేగుతోంది. కొండలు, గుట్టలను తవ్వి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులనూ వదలడం లేదు. బత్తలపల్లి మండలంలోని అప్పరాచెరువు గ్రామ సమీపంలో మట్టి తవ్వకాలతో కొండలు కనుమరుగు అవుతున్నాయి. కొండకు ఇరువైపులా యంత్రాలతో తవ్వి టిప్పర్లలో ధర్మవరం పట్టణంతోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. డిమాండ్?ను బట్టి టిప్పర్? మట్టి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తున్నారు. పోట్లమర్రి చెరువులోనూ విచ్చలవిడిగా మట్టి తవ్వి బత్తలపల్లి, ధర్మవరం ప్రాంతాల్లో వెంచర్లకు, భవన నిర్మాణాల పునాదులకు విక్రయిస్తున్నారు. తహసీల్దారు, పోలీసుస్టేషన్? పక్కనే మట్టి టిప్పర్లు వెళ్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చినా అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి. అక్రమార్కులు ఆయా శాఖల్లోని కిందిస్థాయి సిబ్బంది, అధికారులకు భారీగా మొత్తం ముట్టచెబుతూ మట్టి దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**కేసులు నమోదు చేస్తాం**

మట్టి తరలింపునకు ఎవరికీ అనుమతులు లేవు. అప్పరాచెరువు, పోట్లమర్రి ప్రాంతాల్లో తవ్వకాలపై విచారణ చేపడతాం. అక్రమంగా మట్టి తరలించేందుకు ఉపయోగించే పొక్లెయిన్లు, టిప్పర్లను జప్తు చేసి కేసులు నమోదు చేస్తాం. స్థానిక రెవెన్యూ, పోలీసుల పర్యవేక్షణ ఉండే విధంగా చూస్తాం.

మహేష్, ఆర్డీవో ధర్మవరం

## కవర్ కట్టు.. లాభాలు పట్టు



అనంతపురం: ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు వాతావరణ పరిస్థితులను తట్టుకుని పండ్ల నాణ్యతను పెంచడం కష్టంగా మారేది. ఫ్రూట్ కవర్ల వినియోగంతో ఈ సమస్యను అధిగమిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దానిమ్మ, అరటి, మామిడి రైతులు ఫ్రూట్, ప్లాంట్ కవర్లు వినియోగిస్తూ నాణ్యమైన దిగుబడి సాధిస్తున్నారు. పండ్లు నాణ్యతగా ఉండటంతో వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

**దానిమ్మలో అదనపు ఆదాయం**

దానిమ్మలో ఫ్రూట్ కవర్లు, ప్లాంట్ కవర్లు ఏర్పాటు చేసేందుకు హెక్టారుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతోంది. కవర్ల వినియోగంతో హెక్టారుకు 2 టన్నుల మేర దిగుబడి పెరిగే అవకాశం ఉంది. సాధారణ సాగులో హెక్టారుకు 4 క్వింటాళ్ల వరకు పండ్లకు మచ్చలు ఏర్పడతాయని అధికారులు చెబుతున్నారు. నాణ్యమైన పండ్లు ప్రస్తుతం కిలో రూ.200 కాగా మచ్చలున్న కాయలు రూ.80కు మించి పలకడం లేదు. ఫ్రూట్‌కవర్ల వినియోగంతో హెక్టారుకు రూ.2 లక్షల వరకు అదనపు ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో కాస్మొటిక్ ఫ్రూట్ ప్రొటెక్షన్ బ్యాగులు, నాన్ వోవెన్ కవర్లు, పేపర్ కవర్లు అందుబాటులో ఉన్నాయి. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చవుతుంది. తెలుపు, ఎరుపు రంగుల్లో లభ్యమవుతున్నాయి. పండు రంగుకు అనుగుణంగా కవర్లను ఎంపిక చేసుకోవచ్చు. పిందె దశలోనే గాలి చొరబడకుండా ఫ్రూట్? కవర్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

**తెగుళ్ల నుంచి రక్షణ**

ఉద్యాన పంటల్లో ఫ్రూట్ కవర్లు వాడటం వల్ల చీడపీడలు, పక్షులు, ఈగల నుంచి రక్షణ లభిస్తుంది. ప్రతికూల వాతావరణంలోనూ నాణ్యతపై ప్రభావం పడదు. ఎండ, వాన, గాలుల నుంచి కలిగే నష్టాన్ని తగ్గిస్తాయి. రంగు మెరుగుపడి పండ్ల నాణ్యత పెరుగుతుంది.

పురుగు మందుల ఖర్చులు తగ్గి రైతులకు పెట్టుబడి తగ్గుతుంది.

## తమలపాకు.. ధర రికార్డుబ్రేకు

పాయకరావుపేట: తమలపాకు ధర ఎన్నడూలేని రీతిలో పెరిగింది. బంగారం, వెండి ధరల పెరుగుతున్న తీరుగానే... ఆకుల ధరలు ఆకాశానికి చేరాయి. ప్రస్తుతం పంతా రూ. 100 చొప్పున రైతులు విక్రయిస్తున్నారు. 150 నుంచి 180 ఆకులు కట్ట కడతారు. దీన్ని పంతాగా పిలుస్తారు. రాష్ట్రవ్యాప్తంగా తమలపాకు తోటల్లో ఆకుల దిగుబడి తగ్గింది. దీంతోపాటు వైరస్ తెగుళ్లతో తోటలు దెబ్బతిన్నాయి. ఆకుల లభ్యత తగ్గింది. దీంతో నెల రోజులుగా ధర పెరుగుతూనే ఉంది. పాయకరావుపేట మండలం సత్యవరం, అరట్లకోట, కొత్తూరు, పెదరామభద్రపురం, మంగవరం, గోపాలపట్నం, మాసాహెబ్?పేట, సత్యవరం, ఎస్?.రాయవరం, లింగరాజుపాలెం గ్రామాల పరిధిలో సుమారు మూడు వేల ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. ఇక్కడి నుంచి తెలంగాణ, దిల్లీ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు ఆకులను ఎగుమతి చేస్తుంటారు. 55 ఏళ్ల నుంచి తమలపాకును పండిస్తున్నామని, ఇప్పటివరకు రూ. 65 గరిష్ఠ ధర చూశామని, పంతా రూ. వందకు అమ్మడం ఇదే తొలిసారని మాసాహెబ్‌పేటకు చెందిన రైతు కొంతం నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెగుళ్ల కారణంగా ఎకరాకు 500 పంతాలకు మించి రావడం లేదని తెలిపారు.

## స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్

కర్నూలు : నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతో పాటు డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వివిధ చోట్ల కొన్ని వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్నా.. వ్యర్థాలన్నీ కలిసిపోయి ఉండటంతో వేరుచేయడం కష్టమవుతోంది. దీనికి పరిష్కారంగా కర్నూలుకు చెందిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్ రూపొందించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఇందులో వేయగానే ఆ రెండింటిని వేరుచేస్తోంది. సీఎస్ఎం చదువుతున్న ఎన్.హర్షవర్ధన్, ఎం.భరణికుమార్‌రెడ్డి, పి.లహరి కలిసి దీన్ని తయారుచేశారు. ఇందుకోసం ఎరుపు రంగు, ఆకుపచ్చ రంగు గల రెండు చెత్తబుట్టలను తీసుకొన్నారు. దీనికి సెన్సార్‌తో కూడిన



ఆర్డినో అండ్ స్టెప్పర్ మోటారు అమర్చారు. చెత్తబుట్టలపైన వస్తువులను ఉంచేందుకు వీలుగా ఓ అట్టముక్కను ఏర్పాటు చేశారు. ఆపైన ఓ ఇనుప కడ్డీకి ఈఎస్‌పీ32–సీఎంఏ కెమెరా బిగించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్‌కు సంబంధించిన 88 రకాల వస్తువులను గుర్తించేందుకు వీలుగా వాటి చిత్రాలను ముందుగానే అందులో నిక్షిప్తం చేశారు. వివిధ రకాల వస్తువులను అట్టముక్కపై ఉంచగానే సెన్సార్ సాయంతో వాటిని గుర్తిస్తోంది. రీసైక్లింగ్ చేసే వస్తువులను ఆకుపచ్చ రంగు చెత్తబుట్టలో, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఎరుపు రంగు చెత్తబుట్టలో వేస్తోంది. ఇందుకు అనుగుణంగా మోటారు ఎడమ, కుడివైపు సులువుగా తిరుగుతోంది. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైంది. తమిళనాడులోని చెంగల్పట్టులో సెప్టెంబరు 4న ఇన్ఫోసిస్–పాల్స్ టెక్ జూకా హ్యాకథాన్–2025లో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయస్థాయిలో రెండో బహుమతి సాధించింది. నమూనా రూపొందించగా.. పూర్తిస్థాయిలో తయారీకి కసరత్తులు చేస్తున్నారు.

## గుట్ట దిగని మైలు‘రాయి’

నంద్యాల : నిధులున్నా ‘దారి’న పడటం లేదు. ఈ–పాస్ విధానంతో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రహదారులు, వంతెనల నిర్మాణాలు ఆగిపోయాయి. రోడ్డు, వంతెనలకు సంబంధించి నంద్యాల జిల్లాలో 27 పనులు(రూ.663 కోట్లు), కర్నూలులో 11 పనులు(రూ. 523 కోట్లు) చేపట్టాల్సి ఉంది. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి అవసరమైన కంకరను గతంలో నేరుగా క్వారీలు, గనుల నుంచి సేకరించేవారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ–పాస్ విధానంతో గుత్తే‘దారి’ కదలడం లేదు.

**అన్నింటికీ ఆటంకం**

కొత్తగా తీసుకొచ్చిన ఈ–పాస్ విధానం పలు అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. కేంద్ర రహదారుల పనులు, కోర్‌నెట్ ప్లాన్, ఆర్ఐడీఎఫ్, మేజర్ జిల్లా రహదారులు, ఎన్‌డీబీ పనులు, భవన నిర్మాణాలు, నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఫేజ్–2, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ఫేజ్–1, ఫేజ్–2, జీవో నంబరు 350, 151 కింద మంజూరైనా ప్రధాన జిల్లా, రాష్ట్ర రహదారులు, నాబార్డు, ఎండీఆర్ పనులు ఉన్నాయి.

నంద్యాల నియోజకవర్గం పరిధిలో ఆరు, మంత్రాలయంలో మూడు, ఆలూరులో నాలుగు, పత్తికొండలో ఆరు, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో రెండు చోట్ల రహదారి పనులు ప్రారంభమే కాలేదు.

**ఈపాస్ కష్టాలు** రహదారి, వంతెన తదితర నిర్మాణాలకు అవసరమైన మెటల్, గ్రావెల్, కంకర తదితరాల కోసం ముందుగా ఆర్అండ్‌బీ హెచ్‌వోడీ వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. ఇందుకు తగ్గ అంచనాలు పేర్కొనాలి. ఆ దస్త్రం శాఖకు చేరుతుంది. అప్పుడు సీనరేజ్ పుస్తకం ఇస్తారు. ఆ వివరాలు తిరిగి ఆర్అండ్‌బీకి చేరుతాయి.

కంకర, గ్రావెల్ తదితర సామగ్రికి సంబంధించిన చలానాను ‘ఆన్‌లైన్’లో చెల్లించాలి. అప్పుడు గనుల శాఖ సీనరేజ్ ‘ఈ–పాస్’ బిల్లు జారీ చేస్తుంది. దాని ప్రకారం రోడ్డు నిర్మాణ సామగ్రిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇదంతా జరగడానికి నెలల తరబడి పట్టే అవకాశం ఉంది.

వీటిపై తీవ్ర ప్రభావం

కర్నూలు జిల్లాలో ఎండీఆర్ పథకం కింద 13 పనులు మంజూరయ్యాయి. 2 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు షాదీఖానాకు డిపాజిట్ వర్క్స్ బిల్డింగ్ కింద నిధులు మంజూరు కాగా కొత్త నిబంధనలతో పనులు ముందుకు సాగడం లేదు.

కర్నూలులో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న న్యాయస్థానాల భవనాలపై ప్రభావం చూపాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జీవో నంబరు 350 కింద 42 సీడీ పనులు మంజూరయ్యాయి. రూ.40 కోట్లతో చేపట్టాల్సిన ఈ పనులు ఒక్కటీ ప్రారంభం కాలేదు.

## తేనె తోట.. ఉపాధి బాట

నందికొట్కూరు : ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల పరిధిల్లోని పంట పొలాల పక్కన ఎక్కువగా తేనెటీగల బాక్సులు కనిపిస్తాయి. గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు వచ్చి, ఇక్కడ తేనె ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఏటా నవంబరు నుంచి జనవరి వరకు ఎక్కువగా తేనె బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో చుట్టుపక్కల పంటల్లోని పుష్పాల మకరందాన్ని తేనెటీగలు తీసుకొచ్చి బాక్సుల్లో ఉన్న ప్లేట్లకు తెట్టను ఏర్పాటు చేసుకొని సంతతితోపాటు తేనెను ఉత్పత్తి చేస్తాయి.

ఒక బాక్సు నుంచి ఐదు కిలోలు తేనెటీగల ఫారం పెట్టేవారు రూ.4,600 వెచ్చించి ఒక్కొక్క బాక్సు కొనుగోలు చేయాలి. గుంటూరు, హైదరాబాద్‌లలో ఉన్న ఉత్పత్తి కేంద్రాల నుంచి రెండు వేల ఈగలను రూ.2వేల చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మొదట 10 బాక్సులతో ఉత్పత్తి ప్రారంభిస్తారు. ప్రస్తుతం 50 నుంచి 150 వరకు బాక్సులు ఏర్పాటు చేస్తున్నారు. తేనెటీగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె తయారు కావడానికి నెల సమయం పడుతోంది. ఒక్కొక్క బాక్సు నుంచి ఐదు కిలోల తేనె ఉత్పత్తి అవుతుంది.

మూడు రకాల ఈగలు ఒక్కొక్క బాక్సులో తొమ్మిది వరకు ప్లేట్లు ఉంటాయి. ప్లేటుకు 2వేల చొప్పున ఒక్క బాక్సులో 18వేల వరకు ఈగలు ఉంటాయి. పోతు, రాణి, కూలి ఈగలు ఉంటాయి. కూలి ఈగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె ఉత్పత్తి చేస్తాయి. ఆడ, పోతు ఈగలు సంతానాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. ఈగలు అధికమైతే వాటిని ఇతర బాక్సుల్లోకి మార్చవచ్చు, కొత్తగా ఫారాలు నిర్వహించే వారికి విక్రయించవచ్చు. ఏటా బాక్సులు ఏర్పాటు చేస్తాను మణికంఠ, గుంటూరు మొదట భయంగా, కష్టంగా ఉన్నా.. కాలక్రమేన అలవాటు కావడంతో లాభాలు తీయవచ్చు. నేను గుంటూరు నుంచి ఇక్కడికి వచ్చాను. ఏటా రెండు నెలలు ఇక్కడ బాక్సులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. పంటలను బట్టి బాక్సుకు 5 నుంచి 8 కిలోల తేనె ఉత్పత్తి అవుతోంది. ఆసక్తి ఉంటే ఉచితంగా శిక్షణ ఇస్తా రమేష్, శిక్షకుడు యూపీ, ఎంపీ, రాజస్థాన్, గుజరాత్, తెలంగాణ, ఏపీ ప్రాంతాల్లో పంటల కాలాన్ని బట్టి బాక్సులు ఏర్పాటు చేస్తుంటాను.

# ఇసుక బండి.. దారికి గండి



కర్నూలు: తుంగభద్ర తీరం వెంట గ్రామాల్లో ఇసుక వాహనాలు దూసుకెళ్తున్నాయి.. నిబంధనల కళ్లకు గంతలు కట్టి రవాణా శాఖ ఆదేశాలు విస్మరించి నిండుగా ఇసుక నింపి తరలిస్తున్నారు.. అధిక బరువుతో వెళ్తుండటంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి.. ఆయా రోడ్లపై వాహనదారులు 'గొయ్యోమొర్రో' అనుకొంటూ వెళ్తున్నారు. నదిచాగి ఇసుక రీచ్? నుంచి వెళ్లే టిప్పర్ల కారణంగా కొతకం మండలం గోతులదొడ్డి- కుంబళనూరు మధ్య ఆరు కి.మీ.ల రహదారి భారీగా దెబ్బతింది. కల్వర్టు సుమారు ఎనిమిది నెలల కిందట కూలిపోయింది. 12 గ్రామాలకు వందలాది మంది ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలిపోయిన కల్వర్టులో పడి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు ఆరు నెలల కిందట మృత్యువాతపడ్డారు. ఇలా రహదారులు దెబ్బతిన్నా, కాలుష్య సమస్యలు తలెత్తినా పంచాయతీరాజ్, డీపీవో, ఆర్?అండ్?బీ తదితర శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు.

**నిధులున్నా గుంతలు పూడ్చరు**

మైనింగ్? ప్రాంతాల చుట్టూ ప్రత్యక్షంగా 10 కి.మీ, పరోక్షంగా 10-25 కి.మీ వరకు ప్రభావితమవుతున్న గ్రామాల్లో సౌకర్యాలు చక్కదిద్దాలన్నదే డీఎంఎఫ్? లక్ష్యం. ఖనిజంపై చెల్లించే రాయల్టీలో 30 శాతం డీఎంఎఫ్?కు వెళ్తుంది. ఈ నిధులతో రహదారులు, వంతెనలు, తాగునీటి పథకాలు, ఆర్వో ప్లాంట్లు, వైద్యశాల వంటి అభివృద్ధి పనులు చేపట్టొచ్చు. నంద్యాల జిల్లాలో డీఎంఎఫ్ నిధులు రూ.22.75కోట్లతో చేపట్టిన 124 పనులు ఇంకా పూర్తికాలేదు. కర్నూలు జిల్లాకు డీఎంఎఫ్? నిధులు సాధించడంలో గనులశాఖ అధికారులు విఫలమవుతుండటంతో ఆ నిధులు దక్కని దుస్థితి తలెత్తింది.

**కానరాని తనిఖీలు**

పది టైర్ల లారీలో 25 టన్నులు, 12 టైర్లు.. 31 టన్నులు, 16 టైర్ల లారీలో 35 టన్నుల మేర తీసుకెళ్లడానికి అనుమతులు ఉన్నాయి. దీంతోపాటు లోడుపై 3 టన్నులు మార్జిన్? ఇచ్చి, అంతకన్నా ఎక్కువ సామర్థ్యంతో వెళ్లే కేసులు నమోదు చేసే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంది. అధిక సామర్థ్యంతో వెళ్తున్న వాహనాలు గుర్తించి అదనంగా నింపిన లోడుకు ఒక టన్నుకు రూ.2-10 వేల వరకు జరిమానా విధించొచ్చు.

రీచ్‌ల నుంచి 10 టైర్ల లారీ 30-35 టన్నుల లోడుతో ఇసుక తీసుకెళ్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. తడి ఇసుక కావడంతో మరింత బరువు ఉండటంతో రోడ్లు భారీగా దెబ్బతింటున్నాయి.

**ఛిద్రమైన దారులు**

నదిచాగి, గుడికంబాలి, మరళి ఇసుక రీచ్?ల నుంచి కొన్ని లారీలు కోసిగి, మాధవరం మీదుగా ఎమ్మిగనూరు వెళ్తుంటాయి. మాలపల్లి-ఎమ్మిగనూరు మధ్య 20 కి.మీ. దారి అత్యంత అధ్వానంగా మారింది. గుడికంబాలి ఇసుక రీచ్ నుంచి వాహనాలు పెద్దకడబూరు మండలం మీదుగా ఆదోని, ఎమ్మిగనూరు వెళ్తుంటాయి. దీంతో చిన్నకడబూరు నుంచి రంగాపురం వరకు రహదారి గుంతలమయంగా మారింది. సి.బెళగల్ మండలంలోని పల్?దొడ్డి, కె.సింగవరం, ఈర్లదిన్నె రీచ్‌ల నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. పోలకల్?-సి.బెళగల్ రహదారి కంబదహాల్ వరకు సుమారు 18 కి.మీ. మేర పూర్తిగా దెబ్బతింది.గూడూరు మండలం మునగాల నుంచి కొత్తకోట వరకు సుమారు ఐదు కి.మీ.ల రహదారి తీవ్రంగా దెబ్బతింది.

# తడారిన కేసీ మడి



నంద్యాల : కర్నూలు-కడప(కేసీ) కాల్వలో సాగు నీటి ప్రవాహం ఆగిపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర నీటి ఆధారంగా సుంకేసుల జలాశయం నుంచి వెలుగోడు వరకు పంటలను సాగు చేస్తారు. అధిక వర్షాల కారణంగా ఈసారి రబీ సీజను ఆలస్యమైంది. వరి, జొన్న, మొక్కజొన్న, మినుము, మిరప పంటలు సాగు చేశారు. కొన్ని కంకి దశలో మరికొన్ని పూత దశలో ఉన్నాయి. తుంగభద్ర జలాశయం గేట్లకు మరమ్మతులు చేస్తుండటంతో ఐదు రోజుల కిందట కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేశారు.

**50 వేల ఎకరాలపై ప్రభావం**

నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, వెలుగోడు, బండిఆత్మకూరు, గడివేముల మండలాల్లోని అల్లూరు, వడ్డేమాను, ముచ్చుమర్రి, నెహ్రూనగర్, ప్రాతకోట, బన్నూరు, తంగడంచ, పగిడ్యాల, వాడాల, తూడిచర్ల, రుద్రవరం, కరిమద్దెల, పరమటూరు, యర్రగుంట్ల తదితర గ్రామాల్లో దాదాపు పదివేల ఎకరాల్లో వరి సాగు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో జొన్న, మిరప, ఇతర ఆరుతడి పంటలు కలిపి 40 వేల ఎకరాల్లో సాగయ్యాయి.ఆయకట్టు ఎగువ ప్రాంతమైన నందికొట్కూరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున వరి సాగు చేపట్టారు. ఇక్కడ వినియోగం ఎక్కువగా ఉంటుంది. దిగువకు నీళ్లు వెళ్లాలంటే కాల్వలో పూర్తి స్థాయి నీటి ప్రవాహం ఉండాలి. తుంగభద్ర నుంచి నీటి విడుదల ఆగిపోవడంతో చేతికొచ్చే దశలో ఉన్న 50 వేల ఎకరాల్లో పంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

**ఎత్తిపోయడం సాధ్యమేనా**

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఎత్తిపోస్తే తప్ప పంటలను కాపాడే పరిస్థితి లేదు. ఇక్కడున్న నాలుగు పంపుల ద్వారా నిత్యం 1,000 క్యూసెక్కులు తీసుకోవడానికి అవకాశం ఉంది. రోజుకు 750 క్యూసెక్కుల నీటిని తీసుకుంటే తప్ప ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుకోలేని పరిస్థితి. మూడు నెలల పాటు 5 టీఎంసీల వరకు ఎత్తిపోయాల్సి ఉంటుంది. ఇందుకు కేఆర్?బీ (కృష్ణా రివర్? బోర్డు) అనుమతులు అవసరం. గతేడాది ఇలానే ముచ్చుమర్రి ద్వారా నీటిని తీసుకునే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు చెప్పడంతో ఆపేశారు. వెలుగోడు జలాశయం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా అతి కష్టం మీద నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాలకు సాగు నీరు అందించారు. ముచ్చుమర్రి నుంచి ఎత్తిపోయడం ఒకింత వ్యయ, ప్రయాసలతో కూడుకున్నది. గతేడాది పంపింగ్ చేసిన నీటికి రూ.70 కోట్ల విద్యుత్తు వ్యయం అయింది. ఈ పథకానికి సంబంధించి పాత బకాయిలు ఇప్పటికే రూ.వందల కోట్లకు చేరుకున్నాయి.


**ముందస్తు సమాచారం లేదు : ఈశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు, కేసీ కెనాల్? డిస్ట్రిబ్యూటరీ కమిటీ** ముందస్తు సమాచారం లేకుండా నీటిని నిలుపుదల చేశారు. ప్రత్యామ్నాయ చర్యలు లేవు. సాగునీరు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్? సీఈని కలిశాం.

# డ్రోన్ ఉండగా.. దిగులెందుకు రైతన్నా

నూజివీడు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయంపై దృష్టి సారించింది. రైతులకు రాయితీపై చిరు ధాన్యాలు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, డ్రోన్లు పంపిణీ చేసింది. ఈ సేవలను మరింత అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా డ్రోన్ సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ప్రజా రవాణాలో క్యాబ్? మాదిరి చేసుకోవచ్చు. దాని ద్వారా కేవలం 15 నిమిషాల్లో ఎకరా విస్తీర్ణంలో రైతులు మందును పిచికారీ చేయించుకోవచ్చు.

**రాయితీపై మండలానికి రెండు..**గతంలో రైతులకు 80 శాతం రాయితీపై తొలుత మండలానికి రెండు చొప్పున అందజేశారు. జిల్లాలో ఎక్కడైనా రైతులు పొలాలకు పురుగు మందు పిచికారీ, ఎరువులు, విత్తనాలు చల్లడానికి డ్రోన్లను అద్దెకు తీసుకోవచ్చు. ఎక్కువ విస్తీర్ణం ఉన్నా, వీటితో సులభంగా పని ముగించవచ్చు. దూరాన్ని బట్టి వాటి నిర్వాహకులు అద్దె వసూలు చేస్తారు.

**ఎలాగంటే..**గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి 'ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రైతు చరవాణి సంఖ్య, వివరాలు నింపాలి. మన లొకేషన్? ఆధారంగా సమీపంలో ఉన్న డ్రోన్లను చూపిస్తుంది.



దాని ఆధారంగా బుక్ చేసుకోవచ్చు.

గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ దీదీ, సేవల గోడ పత్రికలోని క్యూఆర్? కోడ్?ను స్కాన్? చేసి, డ్రోన్? సేవలను ఉపయోగించుకోవచ్చు. **ఎంతో ఉపయుక్తం..- హబీబ్ బాషా, జిల్లా వ్యవసాయాధికారి**

డ్రోన్ల వినియోగంతో కూలీల సమస్య అధిగమించడంతో పాటు, పురుగు మందులు, ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. సమయం, ఖర్చు ఆదా అవుతోంది. రైతులకు ఇది ఎంతో ఉపయుక్తం.

# లెక్క తేలుతోంది..

అనకాపల్లి : ఉపాధి హామీ పథకంలో బినామీ మస్టర్లకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందులో పనులకు వచ్చే వారి, రానివారి లెక్క తేలుతోంది. త్వరలోనే వీరికి ముఖ ఆధా రిత హాజరు అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది.ఉపాధి హామీలో ఎక్కువగా బినామీ మస్టర్ల ద్వారా తేడాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే వేతనదారులందరికీ ముఖ ఆధారిత హాజరు వేయడానికి వీలుగా నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టం (ఎన్.ఎం.ఎం.ఎస్.) యాప్ ద్వారా ఈ-కేవైసీ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అక్టోబరులో ప్రారంభించారు. 85 శాతం వరకు పూర్తి చేశారు. మరోవైపు కొత్త జాబ్ కార్డులు కావాలనివారి నుంచి వేల సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి. ఈ-కేవైసీ నమోదుతో జిల్లాలో దాదాపు 31,467 బోగస్ జాబ్ కార్డులు



వెలుగులోకి వచ్చాయి. వీటిని రద్దు చేశారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**అనుసంధానమైన వారికే ఉపాధి**

ప్రస్తుతం జరుగుతున్న సర్వే త్వరితంగా పూర్తి చేసేలా చూస్తున్నాం. ఇప్పటికే 85 శాతం చేశాం. గ్రామసభల్లో వేతనదారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఈ-కేవైసీ అనుసంధానం జరిగిన వారే పనులకు వస్తున్నారు. దీంతోపాటు నూతన జాబ్ కార్డులను త్వరితగతిన మంజూరు చేయిస్తున్నాం.

# చలికాలం.. జాగ్రత్త చిన్నా

అనకాపల్లి : రావికమతం మండలం తోటకూరపాలెంకి చెందిన 11 ఏళ్ల చిన్నారికి చర్మంపై దద్దుర్లు వచ్చాయి. మందుల దుకాణాల్లో ఆయింట్‌మెంట్ కొని వాడారు. తగ్గకపోగా మరింత పెరిగాయి. అనకాపల్లి ఆసుపత్రికి తీసుకొస్తే చర్మం పొడిబారిన కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు.అచ్యుతాపురానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడికి దగ్గు మొదలైంది. దీనిని నిర్లక్ష్యంగా చేయడంతో ఇది కాస్తా ఆయాసంగా మారి ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది.

జిల్లావ్యాప్తంగా చలి పెరిగింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ కాలంలో చర్మం పొడిబారడం ఎక్కువగా ఉంటుంది. చిన్నారుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలని చిన్నపిల్లల వైద్యులు చెపుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంత ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పరిస్థితి తీవ్రమయ్యాక కానీ ఆసుపత్రికి తీసుకురావడం లేదు. దీనివల్ల చిన్న వయస్సులోనే చర్మసంబంధిత వ్యాధులు వస్తున్నాయి. చలికితోడు పెరుగుతున్న కాలుష్యం వల్ల చిన్నారుల్లో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. దగ్గు, ఆయాసం, శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతూ చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఆదిలోనే తగిన చికిత్స చేయించుకుంటే ఎలాంటి సమస్యా ఉండదని వైద్యులు చెబుతున్నారు.

అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 40 మంది వరకు చిన్నారులు చర్మసంబంధిత వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. దగ్గు, శ్వాసకోశ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటోంది.

**ఆధునిక సేవలు అందుబాటులో..**

చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో వసతులు కల్పించారు. నలుగురు చిన్నపిల్లల వైద్య నిపుణులతో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. అప్పుడే పుట్టిన చంటిబిడ్డల నుంచి టీనేజ్ వరకు బాలల వరకు చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలు సమకూర్చారు. చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు**

చలికాలంలో పిల్లలకు చర్మ, శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులున్నాయి. డాక్టర్ వెంకటేష్

# అమ్మలేం.. అనుభవించలేం

తాడేపల్లిగూడెం : డెల్టాలో రహదారి పక్కన సారవంతమైన భూములున్నాయి. కానీ.. అన్నదాత అవసరానికి ఉపయోగపడటం లేదు. గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో 30వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో వారసులకు బదిలీ చేయలేక, ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు. తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ వెళ్లని కార్యాలయం లేదు.. కలవని అధికారి లేరు. మొగల్తూరులో 722/1ఏ1 సర్వే నంబరు పరిధిలో సుమారు 98 ఎకరాలకు 25 సెంట్లు మాత్రమే ప్రభుత్వ భూమి కాగా మిగిలినది నిషేధిత జాబితాలో చేర్చారు. భీమవరం మండలం రాయలంలో 14/1లో 23 ఎకరాలు, 49/2లో 85 సెంట్లు, 51/2లో ఎకరన్నర నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి.

**ఏలూరులో గ్రీవెన్స్**

కూటమి సర్కారు చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 వేల ఫిర్యాదులొచ్చాయి. వాటిలో తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చారని సుమారు 300 వరకు ఉన్నాయి. ఇదిగో అదిగో అంటూ అధికారులు చెప్పడమే గానీ ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరకలేదు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు జిల్లా ఇన్?ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో భూ సమస్యల పరిష్కారానికి డిసెంబరు 16న గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి గ్రీవెన్స్‌ను పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**ఏటా ఉపయోగపడక..** రెవెన్యూ రికార్డుల్లో పట్టాభూములుగా నమోదై క్రయవిక్రయాలు జరిగిన భూములను సైతం 22ఏలో చేర్చారు. పట్టాదారు పాస్ పుస్తకాలున్నా ఆన్‌లైన్‌లో మాత్రం నిషేధిత జాబితాలో చూపిస్తున్నాయి. వైద్య అవసరాలతో పాటు పిల్లల విద్య, వివాహ, ఇతర అవసరాలకు క్రయవిక్రయాలు చేసే వీల్లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా గతంలో భూములను కొనుగోలు చేసిన రైతులు విక్రయించిన వారిపై గొడవలకు దిగుతున్నారు. మూడేళ్ల కిందట క్రయవిక్రయాలు జరిగిన భూమికి ఇటీవల మొగల్తూరులో ఇద్దరి రైతుల మధ్య తగాదా పోటుచేసుకుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని డీఆర్వో నారాయణరెడ్డి తెలిపారు.

# కీలక మార్గాలు.. ఎన్నో అడ్డంకులు!

విశాఖపట్నం : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నగరం, సమీప ప్రాంతాల నుంచి సులభంగా చేరుకోవటానికి విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) ప్రతిపాదించిన ఏడు రోడ్ల పనుల్లో అనుకున్నంత వేగం కనిపించడం లేదు. అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్లుంది. కొన్ని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వేగంగా స్పందించటం లేదు. ముఖ్యంగా టీడీఆర్‌ల మంజూరులో జాప్యమే అవరోధంగా ఉంది.

**ఆటంకాలు తొలగితే..**

అడవివరం- గండిగుండం రోడ్డును మాస్టర్‌ప్లాన్‌లో 200 అడుగులుగా ప్రతిపాదిస్తే ప్రస్తుతం వంద అడుగుల్లో నిర్మిస్తున్నారు. ఈ మార్గంలో అటవీశాఖ భూములున్నాయి. ఆ శాఖ నుంచి అభ్యంతరా లొస్తున్నాయి. దీనిపై వీఎంఆర్డీఏ కమిషనర్ జిల్లా కలెక్టర్‌తోనూ సమావేశమయ్యారు. సుమారు 400 విద్యుత్తు స్తంభాలను మార్చాల్సి ఉంది. జోయపాలెం-మంగామారిపేట రోడ్డులో 39 ఆస్తులకు టీడీఆర్లు



మంజూరు చేయాల్సి ఉంది.పరదేశిపాలెం- గంభీరం మార్గానికి 600 మీటర్లలోని స్థలాలకు టీడీఆర్లు మంజూరు చేయాలి.నేరెళ్లవలస-తాళ్లవలస రోడ్డులో 40 ప్రయివేటు ఆస్తులతో పాటు ఒక ఎంపీపీ స్కూల్ ఉంది. దాన్ని అక్కడి నుంచి తరలించడం క్లిష్టంగా ఉంది. చిప్పాడ- పోలుపల్లి రోడ్డుకు ఇంకా ఆర్డీపీ, ఎలైన్‌మెంట్ తయారు చేయాలి.శివశక్తినగర్- హరితా ప్రాజెక్టు మార్గంలో ప్రైవేటు స్థలాలు ఇవ్వటానికి కొందరు ముందుకు రాలేదు.'ప్రతి వారం పనుల ప్రగతిపై నివేదిక తెప్పించుకొని పరిశీలిస్తున్నాం. సమస్యలున్న చోట క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తయ్యేలా చూస్తున్నాం' అని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్?గోపాల్ పేర్కొన్నారు. మొత్తం రోడ్లు: 7

వ్యయం (అంచనా): రూ.174.64 కోట్లు

# అర్ధాకలితో పది విద్యార్థులు!!

మాధవధార : పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా డిసెంబరు ఒకటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో తరగతులను నిర్వహించినా మధ్యాహ్న భోజనం అందించ నున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. సాయంత్రం అల్పాహారం లేక విద్యార్థులు ఖాళీ కడుపుతో ప్రత్యేక తరగతుల్లో ఉంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పిల్లలను చదివిస్తున్నారు. ఉదయం ఇంటి దగ్గర ఆహారం తీసుకుని, మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేస్తున్నారు. సాయంత్రం పాఠశాల విడిచిన తరువాత పది నిమిషాలు విరామం ఇచ్చి మళ్లీ వారికి రాత్రి 7 వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సమయంలో ఆకలిగా ఉండటంతో తరగతుల పట్ల ఏకాగ్రత చూపలేకపోతున్నారు. అల్పాహారం అందిస్తే ఉత్సాహంగా హాజరవుతారని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

**మూడేళ్లుగా లేదు..** : గతంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు... మధ్యాహ్న భోజనం సరఫరా చేసే అక్షయపాత్రకే నిధులు కేటాయించి, సాయంత్రం పూట ప్రత్యేక తరగతుల విద్యార్థులకు అల్పాహారం అందించేవారు. మూడేళ్ల క్రితం వైకాపా ప్రభుత్వం



జీవీఎంసీ పరిధిలోని పాఠశాలలన్నీ జిల్లా విద్యాశాఖ పరిధిలోకి తీసుకురావడంతో అప్పటి నుంచి జీవీఎంసీ నిధులు కేటాయింపు నిలిపివేసింది. దీంతో విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. జీవీఎంసీలోని 21 ఉన్నత పాఠశాలలకు మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు స్పందించి అల్పాహారం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**చాలా మంది పరిస్థితింతే..**: ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు చాలా మంది ఏమీ తినకుండా వస్తున్నారని, కొన్ని చోట్ల ఉపాధ్యాయులు బిస్కెట్లు, అరటి పండ్లు వంటివి ఇస్తున్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు, నాయకులు, సహకరించి అల్పాహారం అందించేవారు. దాతలు, పాలకులు ఈ అంశంపై దృష్టిసారించాల్సి ఉంది. 21 పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు: 2,283 మంది బాలురు: 1,144 బాలికలు 1,139

# రొయ్య 'ధర'హాసం

పాయకరావుపేట : రొయ్య మీసం మెలేస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలతో దెబ్బతిన్న ఆక్వా రైతులకు ధరల పెరుగుదలతో ఊరట లభిస్తోంది. అక్టోబరు వరకు ఒడుదొడుకులతో ఇబ్బంది పడగా.. ప్రస్తుతం ఎగుమతులు ఆశాజనకంగానే ఉండటంతో పరిస్థితులు కుదురుకుంటున్నాయి. రొయ్యల కౌంట్ ధరల్లో రూ.20 నుంచి 40 వరకు వ్యత్యాసం ఉండటం, క్రిస్మస్ నేపథ్యంలో ఎగుమతులకు డిమాండ్ నెలకొనడంతో సాగుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లాలో పాయకరావుపేట, నక్కపల్లి, అచ్యుతాపురం, ఎస్.రాయవరం, ఎలమంచిలి మండలాల పరిధిలో రెండు వేల ఎకరాలకుపైగా రొయ్యల చెరువులున్నాయి. ఇక్కడి నుంచి వియత్నాం, చైనా, జపాన్, అమెరికా దేశాలకు రొయ్యల ఎగుమతి అవుతున్నాయి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో 20 శాతం వరకు ఆక్వారైతులు పంట వేయలేదు. వేసవిలో వైట్ గట్, విబ్రియో, ఈహెచ్‌పీ వ్యాధుల ప్రభావంతో రొయ్యల దిగుబడి తగ్గింది. ప్రస్తుతం చలిగాలుల వీస్తుండటంతో వైట్‌స్పాట్ వ్యాప్తి చెందుతోంది. దీంతో దిగుబడి తగ్గినప్పటికీ ధరలు పెరిగాయి. మార్కెట్‌లో ధరతో పాటు ధర పెరుగుతూ వస్తోంది.సీడ్‌లో నాణ్యత లేకపోవడంతో రొయ్యలు వ్యాధుల బారిన పడుతున్నాయని, పెట్టుబడి వ్యయం తగ్గించుకునేందుకు తక్కువ విస్తీర్?ంలో ఎక్కువ సీడ్ వేస్తున్నారని పాయకరావుపేటకు చెందిన ఆక్వా రైతు యజ్జల చంద్రశేఖర్ చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల సాగుదారులు నష్టపోతున్నారు. అంచనాకు మించిన దానికన్నా ధర పెరగడంతో కష్టాల నుంచి ఒడ్డున పడతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

చురకలు






## బుట్ట బొమ్మలా అందాలు ఆరబోస్తున్న బాలయ్య బ్యూటీ!

అదృష్టం తలుపు తడితే ఒక్క సినిమాతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకునే సెలబ్రిటీలు చాలా తక్కువ మంది అని చెప్పాలి. అయితే ఆ అదృష్టం కోసం పరితపించే వారు కూడా చాలా ఎక్కువే ఉన్నారు. అందులో భాగంగానే ముందుగా సోషల్ మీడియాలో అందంతో ఆకట్టుకొని ఫాలోవర్స్ ను పెంచుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు.. ఈ క్రమంలోనే చాలామంది హీరోయిన్స్ ఇంస్టాగ్రామ్ వేదికగా భిన్న విభిన్నమైన వస్త్రధారణలలో అందాలు అరబోస్తూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు. అలాంటి వారిలో ప్రముఖ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ కూడా ఒకరు. తన అందం , అభినయంతో ఎప్పటికప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకునే హీరోయిన్స్ జాబితాలో ప్రథమ స్థానంలో నిలుస్తుంది ఈ ముద్దుగుమ్మ. బాలీవుడ్ లో జరిగే ఈవెంట్లలో కూడా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచే ఈమె.. తాజాగా బుట్టబొమ్మలా తయారయ్యి అందరిని ఆకట్టుకుంది. తాజాగా ఫ్లేర్డ్ బ్లాక్ కలర్ గౌన్ ధరించిన ఈమె.. తన అందాలతో మరోసారి మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా బుట్ట బొమ్మలా ఫోటోలకు ఫోజులిస్తూ.. కుర్రాల గుండెల్లో గుణపాలు దించేసింది. చాలా రోజుల తర్వాత ఇలాంటి ఒక అద్భుతమైన ఔట్ఫిట్ తో అందరి దృష్టిని ఆకర్షించింది ప్రగ్యా జైస్వాల్. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా లవ్ ఎమోజీలు , ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ కామెంట్



బాక్స్ నింపేస్తున్నారు. మొత్తానికైతే ప్రగ్య జైస్వాల్ షేర్ చేసిన ఈ బ్యూటిఫుల్ ఫోటోలు నెటిజన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. 1991 జనవరి 12న జబల్పూర్ లో జన్మించిన ప్రగ్య జైస్వాల్ మోడల్ గా తన కెరీర్ ను ప్రారంభించింది. అయితే మోడల్ గా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టకముందే సింబయాసిస్ కాలేజీలో చదువుతూ అక్కడి నుంచే తన మోడలింగ్ వృత్తిని మొదలు పెట్టింది. అలా 2014లో జనవరి 22న జరిగిన కళా, సాంస్కృతిక రంగంలో ఆమె సాధించిన విజయానికి గానూ సింబయాసిస్ సాంస్కృతిక పురస్కారం లభించింది. ఫెమినా మిస్ ఇండియా 2018 లో పాల్గొని మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ డాన్సింగ్ క్వీన్, మిస్ ఫ్రెండ్ ఆఫ్ ఎర్త్ టైటిల్స్ ను సొంతం చేసుకుంది. అలాగే డాబర్ వాటిక, డవ్, మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, రిలయన్స్ డిజిటల్ వంటి ఎన్నో పాపులర్ బ్రాండ్స్ కి అంబాసిడర్ గా వ్యవహరించింది. అలా తన అందంతో గ్లోబల్ మార్కెట్లో పాపులారిటీ దక్కించుకున్న ఈమె హిందీతో పాటు తెలుగు, తమిళ్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తోంది. తొలిసారి తెలుగులో మిర్చి లాంటి కుర్రాడు అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ప్రగ్యా జైస్వాల్.. తన అద్భుతమైన నటనను కనబరిచి ఆకట్టుకుంది. ఇక బాలయ్య నటించిన అఖండ , డాకూ మహారాజ్ సినిమాలలో భారీ పాపులారిటీ అందుకున్న ఈమె బాలయ్య బ్యూటీగా కూడా పేరు దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగులో సరైన అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. అందులో భాగంగానే ఇలా ఫోటోషూట్ తో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

## రుక్మిణి టాలీవుడ్‌కు మరో రష్మిక అవుతుందా?

కన్నడ భామలకు తెలుగులో మంచి క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. -ఛలో- మూవీతో టాలీవుడ్‌లోకి ప్రవేశించిన రష్మిక మందన్న వరుస క్రేజీ ఆఫర్లతో స్టార్ హీరోయిన్ జాబితాలో చేరిపోయింది. తెలుగులో స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూ బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకున్న రష్మిక నేషనల్ క్రష్ అనిపించుకుంది. స్వతహాగా కన్నడ అయినా తెలుగు సినిమాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో కన్నడ ప్రేక్షకులు రష్మికపై ఫైర్ అయ్యారు. మాతృ భాషకు సంబంధించిన ఇండస్ట్రీని మరిచిందని కామెంట్‌లు చేశారు. ఆ విమర్శల్ని ఎదుర్కొని ఇప్పుడు వన్ ఆఫ్ ది టాప్ హీరోయిన్‌ల జాబితాలో చేరింది. ఇండియా వైడ్‌గా స్టార్ హీరోయిన్‌గా క్రేజ్‌ని సొంతం చేసుకోవడమే కాకుండా అదే స్థాయిలో పాన్ ఇండియా సినిమాలని దక్కించుకుంటూ యమ బిజీగా గడిపేస్తోంది. 2024లో పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌ని సొంతం చేసుకున్న రష్మిక అదే హవాని కొనసాగిస్తూ గత ఏడాది -చావా-,-కుబేర- వంటి హిట్‌లని తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం కాక్‌టైల్ 2, లేడీ ఓరియెంటెడ్ మూవీ -మైసా-ల్లో నటిస్తున్న రష్మిక తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ వరల్డ్



మూవీలో నటించే ఛాన్స్‌ని దక్కించుకుంది. ఇప్పుడు రష్మిక తరహాలో మరో కన్నడ సోయగం రుక్మిణీ వసంత్ నడుస్తున్నట్టుగా తెలుస్తోంది. తెలుగు సినిమాల్లో రష్మిక పాపులర్ అయినట్టుగానే రుక్మిణి కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. రుక్మిణీ వసంత్..కన్నడ నాట మారుమ్రోగుతున్న పేరిది. ప్రస్తుతం టాలీవుడ్‌లోనూ ఈ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. కాంతార ప్రీక్వెల్ -కాంతార: చాప్టర్ 1తో భారీ క్రేజ్‌ని సొంతం చేసుకున్న రుక్మిణి ఈ సినిమాతో తెలుగు మేకర్స్ దృష్టిని ఆకర్షించింది. రెండేళ్ల క్రితమే నిఖిల్ తో -అప్పుడో ఇప్పుడో ఎప్పుడో- మూవీ చేసింది. సుధీర్ వర్మ డైరెక్ట్ చేసిన ఈ సినిమా టైటిల్‌కు తగ్గట్టే ఎప్పుడొచ్చిందో ఎప్పుడు వెళ్లిందో తెలియకుండానే వెళ్లిపోయింది. దీంతో రుక్మిణి టాలీవుడ్ ఎంట్రీ గురించి పెద్దగా ఎవరికీ తెలియలేదు. -కాంతార:చాప్టర్ 1- తరువాతే టాలీవుడ్ మేకర్ల దృష్టి తనపై పడింది. ప్రస్తుతం రుక్మిణి మాస్ ఆఫ్ యాక్షన్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ మూవీ -డ్రాగన్-లో నటిస్తోంది. దీన్ని భారీ స్కేల్ లో రిలీజ్ చేయాలని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నాడు. తెలుగు సినిమాలకు పాన్ ఇండియా రేంజ్‌లో మంచి మార్కెట్ ఉన్న నేపథ్యంలో రష్మిక మందన్న తరహాలోనే రుక్మిణి కూడా టాలీవుడ్‌కే ప్రాధాన్యతనిస్తుందా? ..లేక కన్నడలోనూ నటిస్తూ రెండు భాషల్లోనూ పాపులారిటీని దక్కించుకోవాలని భావిస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అట్లీ - బన్నీ..అంత మంది రైటర్స్‌ని వాడారా?



పుష్ప 2 సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇప్పుడు అంతకు మించిన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్షన్‌లో పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కోలీవుడ్ క్రేజీ ప్రొడక్షన్ హౌస్ సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకునే మెయిన్ హీరోయిన్‌గా నటిస్తుండగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న నెగెటివ్ ఛాయలున్న క్యారెక్టర్‌లో కనిపించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా ఇందులో నటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కానీ టీమ్ మాత్రం దీనిపై ఎలాంటి క్లారిటీ ఇవ్వడం లేదు. సైలెంట్‌గా తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. హాలీవుడ్ సూపర్ హీరోస్ సినిమాల తరహాలో దీన్ని సరికొత్త ఇండియన్ సూపర్ హీరో స్టోరీగా దర్శకుడు అట్లీ రూపొందిస్తున్నారు. డిఫరెంట్ షేడ్స్‌తో సాగే క్యారెక్టర్‌లో సూపర్ హీరోగా బన్నీ ఇందులో కనిపించనున్నాడని ఈ ప్రాజెక్ట్ ప్రారంభించిన దగ్గరి నుంచి వినిపిస్తోంది. దీపికా పదుకోన్ కూడా శక్తివంతమైన యోధురాలి పాత్రని పోషిస్తోంది. తన లుక్, గెటప్ కూడా సరికొత్తగా ఉంటుందట. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు, రోమాంచితంగా సాగే యాక్షన్ ఘట్టాలు, గ్రాండ్ విజువల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసే విధంగా ఈ సినిమా ఉంటుందని ఇప్పటికే టీమ్ ప్రకటించింది. అంతే కాకుండా మన సంస్కృతికి అద్దంపట్టే కథతో గ్లోబల్ ప్రేక్షకుల్నికూడా మెప్పించేలా రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు ఇది మర్చిపోలేని సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని దర్శకుడు అట్లీ హామీ ఇవ్వడంతో ఈ మూవీపై సహజంగానే అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కథగా దీన్ని భారీ కాన్వాస్‌లో రూపొందిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతోంది. రమ్యకృష్ణ, జిమ్ సర్భ్, యోగిబాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ కోసం తెలుగు రైటర్స్ వర్క్ చేసినట్టుగా తెలిసింది. దీన్నొక ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న అట్లీ కామెడీ సన్నివేశాలకు, భావోద్వేగ సీన్స్‌కు ప్రముఖ్యత నిస్తున్నాడట. అందులో భాగంగానే టాలీవుడ్ క్రేజీ డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, శ్రీను వైట్ల టీమ్ సభ్యులతో పాటు ఇతర క్రేజీ రైటర్స్ చేత కామెడీ సీన్స్, డైలాగ్స్ రాయించుకున్నాడని, వీటిని బన్నీ, యోగిబాబుపై షూట్ చేస్తున్నాడని, సినిమాకు ఇవి హైలైట్‌గా నిలుస్తాయని ఇన్ సైడ్ టాక్. ఇప్పటి వరకు -#AA22xA6- అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ మూవీ కోసం ఓ పవర్‌ఫుల్ టైటిల్‌ని త్వరలో మేకర్స్ ప్రకటించబోతున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టిన రోజు ఏప్రిల్ 8. ఇదే రోజు మూవీ టీజర్‌తో పాటు టైటిల్‌ని కూడా టీమ్ అనౌన్స్ చేయబోతోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీలోని వీఎఫ్ ఎక్స్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైటైల్‌గా నిలవనున్నాయి. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ పాన్ వరల్డ్ మూవీని ఈ ఏడాది డిసెంబర్‌లో కానీ వచ్చే ఏడాది ప్రారంభంలోకానీ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

## ఫ్లాపుల్లో ఉన్న స్టార్ హీరోని బయటపడేసే రియల్ హీరో ఇతడేనా?



అతడు ముసలోడు.. పనైపోయిందని అనుకున్నారు--.. కానీ అతడు లేట్ ఏజ్‌లోను భళ్లూక పట్టు పడుతున్నాడు! బ్యాక్ టు బ్యాక్ బ్లాక్ బస్టర్లతో మతులు పోయే ట్రీటిస్తున్నాడు. ఇంతకీ ఈ లేటు వయసు ఘాటు హీరో ఎవరో పరిచయం చేయాలా? బాలీవుడ్ వెటరన్.. ది గ్రేట్ సన్నీడియోల్ గురించే ఇదంతా. వరుస సీక్వెల్స్‌తో దుమ్ము లేపుతున్న సీనియర్ హీరో సన్నీడియోల్ ఇటీవలే -బార్డర్ 2-తోను బంపర్ హిట్టు కొట్టాడు. ఇంతకుముందు గద్దర్ 2 అతడి కెరీర్ కంబ్యాక్ అవ్వడానికి బిగ్ బూస్ట్ ఇచ్చింది. పూర్తిగా డియోల్ శకం ముగిసింది! అనుకుంటున్న తరుణంలో కొన్నేళ్ల పాటు బయటి ప్రపంచానికి కనిపించని సన్నీడియోల్.. ఉన్నట్టుండి గద్దర్ 2 తో సక్సెస్ ట్రీక్ లోకి దూసుకొచ్చాడు. గద్దర్ 2 చిత్రం 500కోట్ల క్లబ్ లో చేరింది. ఇప్పుడు మరో సీక్వెల్ చిత్రం బోర్డర్ 2 కూడా ఏకంగా 400కోట్లు వసూలు చేయడం ఒక సంచలనం. ఇలాంటి తరుణంలో ఇప్పుడు అతడు నటించిన లాహోర్ సీక్వెల్ -లాహోర్ 1947- విడుదలకు సిద్ధమవుతోంది. లేటు వయసులో దుమ్ము లేపుతున్న స్టార్ హీరో ఈసారి తన స్నేహితుడు అమీర్ ఖాన్ తో కలిసి పని చేస్తుండడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. బాలీవుడ్‌లో ఇప్పుడు అందరి దృష్టి -లాహోర్ 1947-పైనే ఉంది. వరుస పరాజయాలతో సతమతమవుతున్న మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. అతడిని మళ్ళీ ఫామ్‌లోకి వచ్చిన మాస్ హీరో సన్నీ డియోల్ గట్టెక్కిస్తాడా? అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అమీర్ ఖాన్‌కు ఇది చాలా కీలకమైన సినిమా. -లాల్ సింగ్ చడ్డా- ఫ్లాప్ తర్వాత అమీర్ నిర్మాతగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. లాహోర్ సీక్వెల్ కి రాజ్ కుమార్ సంతోషి దర్శకత్వం వహిస్తుండటంతో దీనిపై మరిన్ని అంచనాలు పెరిగాయి. ఇక సన్నీ డియోల్ - రాజ్‌కుమార్ సంతోషి కాంబినేషన్ (ఘాయల్, ఘాతక్, దామిని) అంటేనే బాక్సాఫీస్ వద్ద ఒక సెన్సేషన్. దానికి అమీర్ ఖాన్ నిర్మాణ విలువలు తోడవ్వడం సినిమాపై భారీ అంచనాలను పెంచింది. ాశ్రీంశీ =ఘుం - మళ్లీ రేస్‌కు రెడీ అవుతున్న కల్యాణ్‌రామ్! గద్దర్ 2తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన సన్నీ డియోల్ -బోర్డర్ 2-తోను మరో బ్లాక్ బస్టర్ కొట్టారు. ఇప్పుడు -లాహోర్ 1947- కూడా హిట్ అయితే పీరియడ్ డ్రామాతో అతడు హ్యాట్రిక్ కొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమా ఆగస్టు 13న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా విడుదల కానుంది. దేశభక్తి నేపథ్యంలో సాగే సినిమాలకు ఆగస్ట్ 15 మంచి సీజన్. -గద్దర్ 2- కూడా ఇదే సమయంలో వచ్చి రికార్డులు సృష్టించింది. అందువల్ల ఇప్పుడు లాహోర్ సీక్వెల్ కూడా ఘనవిజయం సాధిస్తుందని భావిస్తున్నారు. ఈ చిత్రంతో చాలా కాలం తర్వాత ప్రీతి జింటా రీఎంట్రీ ఇస్తుండటం ప్రేక్షకుల్లో మరో ఆకర్షణగా మారింది. విభజన కాలం నాటి ఎమోషనల్ పీరియడ్ డ్రామాలో ప్రీతి పాత్ర ఏమిటన్నది వేచి చూడాలి. అమీర్ ఖాన్ జాతకం మారుతుందా? వరుస బ్లాక్ బస్టర్లతో దూకుడు మీద ఉన్న సన్నీడియోల్.. ఫ్లాపుల్లో ఉన్న తన స్నేహితుడు అమీర్ ఖాన్ జాతకం మార్చేస్తాడని అంతా భావిస్తున్నారు. అమీర్ ఖాన్ లాహోర్ 1947 చిత్రానికి కేవలం నిర్మాతగానే కాకుండా, ఈ సినిమాలో ఒక ముఖ్య పాత్రలో కనిపిస్తారని టాక్ ఉంది. కంటెంట్ మీద విపరీతమైన పట్టున్న రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వం వహించడం ప్లస్ కాగా, సన్నీ డియోల్ మాస్ ఇమేజ్‌ను సరిగ్గా వాడుకుంటే ఇది అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్‌కు పూర్వ వైభవం తీసుకురావడం ఖాయమని అంచనా వేస్తున్నారు. 60 ప్లస్ వయసులోనూ బ్యాక్ టు బ్యాక్ హిట్లు కొడుతూ డియోల్ సాబ్ నిజంగా ఆదర్శంగా మారారు.

## బుట్టబొమ్మ ఫోకస్ మొత్తం దానిపైనే!

ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ల లిస్ట్ లో మొదట్లో నిలిచిన పూజా హెగ్డే ఇప్పుడు కొత్త ప్లాన్ తో తిరిగి రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. వరుస సక్సెస్‌లతో స్టార్ హీరోల సరసన మెరిసిన ఈ బ్యూటీ, ఆ తర్వాత ఎదురైన వరుస పరాజయాలతో కొంత వెనుకబడ్డారు. అయితే తన కెరీర్‌లో వచ్చిన ఈ మలుపును ఒక బ్రేక్ లాగా కాకుండా పూజా దాన్నొక రీసెట్ బటన్‌గా తీసుకున్నట్టుగా కనిపిస్తోంది. రెమ్యూనరేషన్ కారణంగా అవకాశాలు రాలేదని ప్రచారం టాలీవుడ్‌లో ఒక దశలో అత్యంత బిజీ హీరోయిన్‌గా కొనసాగిన పూజా హెగ్డే, భారీ పారితోషికం కారణంగా కూడా కొన్ని ప్రాజెక్టులు చేజార్చుకుందనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. నిర్మాతలు ఖర్చులను కట్టడి చేయాలనుకున్న సమయంలో ఆమె రెమ్యునరేషన్ అడ్డంకిగా



మారిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అదే సమయంలో పూజా హీరోయిన్ గా నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఈ పరిణామాలతో పూజాకు టాలీవుడ్‌లో గ్యాప్ ఏర్పడింది. తెలుగుపై దృష్టి పెట్టిన పూజా అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. తమిళం, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూనే మంచి బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లతో బిజీగా ఉన్నప్పటికీ, పూజా హెగ్డే దృష్టి మళ్లీ తెలుగుపైనే ఉందని సమాచారం. టాలీవుడ్‌లో తాను సంపాదించిన స్టార్‌డమ్, అభిమానుల ఆదరణ ఆమెకు ప్రత్యేకమని భావిస్తున్నపూజా, మళ్లీ ఇక్కడ స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే ఉద్దేశంతో కథల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. కంబ్యాక్ విషయంలో సీరియస్ ప్రయత్నాలు రీసెంట్ గా పూజాని రెండు తెలుగు సినిమాల కోసం సంప్రదించినట్టు సమాచారం. అయితే ఈసారి రెమ్యూనరేషన్ విషయంలో కూడా సర్దుబాటు చేసేందుకు అమ్మడు సిద్ధంగా ఉందన్న వార్త ఇండస్ట్రీ వర్గాల్లో డిస్కషన్ పాయింట్ అయింది. ఇది ఆమె కంబ్యాక్‌పై ఉన్న సీరియస్‌నెస్‌ను స్పష్టంగా చూపిస్తోంది. కథ, పాత్ర ప్రాధాన్యం, బ్యానర్ విశ్వసనీయత లాంటి అంశాలను పూజా ప్రాధాన్యంగా తీసుకుంటున్నారని అంటున్నారు. ఇన్‌సైడ్ టాక్ ప్రకారం ఫిబ్రవరిలోనే పూజా నెక్స్ట్ తెలుగు ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని.. సరైన కథ, సరైన హీరోతో మళ్లీ టాలీవుడ్‌లో తన ముద్ర వేసేందుకు పూజా హెగ్డే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కెరీర్‌లో వచ్చిన ఒడిదుడుకులు స్టార్‌డమ్‌ను తగ్గించవని, ఆ ఒడిదుడకులను ఎదుర్కొని మరోసారి టాలీవుడ్ లో పూజా స్టార్ గా ఎదుగుతారా లేదా అనేది త్వరలోనే తేలనుంది.

## సెకండ్ ఇన్నింగ్స్ కు సమంత ప్రీ ప్లాన్స్

ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన సమంత రుత్ ప్రభు కెరీర్ ఇప్పుడు మరో కీలక మలుపు తిరిగే దశలో ఉంది. వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలు, మొదటి వివాహం, అనంతర విడాకులు, ఆరోగ్య సమస్యలు, ఆమె సినీ కెరీర్ ను కాస్త నెమ్మదించేలా చేశాయి. అయితే ఇప్పుడు మళ్లీ వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సమంత, కొత్త ఉత్సాహంతో ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కానీ ఈసారి ఆమె తీసుకుంటున్న నిర్ణయాలు గతానికి భిన్నంగా ఉన్నాయి. మా ఇంటి బంగారంకు రాజ్ క్రియేటివ్ ఇన్‌పుట్స్ సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం అనే సినిమా చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఆమె భర్త రాజ్ నిడిమోరు ప్రెజెంటర్‌గా ఉండటమే కాకుండా క్రియేటివ్ ఇన్‌పుట్స్ కూడా ఇస్తున్నట్టు సమాచారం. రాజ్-డీకే జంట ఇప్పటికే అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ వంటి ప్రముఖ ఓటీటీ వేదికలపై సక్సెస్‌ఫుల్ వెబ్ సిరీస్‌లతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంతో సమంత కూడా తన కెరీర్ దిశను ఓటీటీ వైపు మళ్లిస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. వెబ్‌సిరీస్ కథలపై సమంత ఆసక్తి ఇటీవల ఆమెను సంప్రదిస్తున్న దర్శకులకు కేవలం సినిమాల కథలు కాకుండా వెబ్ సిరీస్ కాన్సెప్ట్‌లను కూడా తీసుకురావాలని సమంత సూచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇది కేవలం ట్రెండ్‌ను



అనుసరించడం మాత్రమే కాకుండా వ్యూహాత్మక నిర్ణయంగా కూడా భావించవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో సిల్వర్ స్క్రీన్ హీరోయిన్లకు తీవ్ర పోటీ ఉంది. పైగా సమంత గతంలో చేసిన గ్లామర్, కమర్షియల్ పాత్రల తరహా పాత్రలను ఇప్పుడు తిరిగి చేయాలనే ఉద్దేశం ఆమెకు లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఓటీటీ వేదికలు మాత్రం కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే స్థలంగా మారాయి. వయస్సు, ఇమేజ్ పరిమితులు లేకుండా విభిన్న పాత్రలను పోషించే అవకాశాలు అక్కడ ఎక్కువగా ఉన్నాయి. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' ద్వారా ఇప్పటికే పాన్-ఇండియా స్థాయిలో తన ప్రతిభను చాటుకున్న సమంతకు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు మరింత విస్తృతమైన అవకాశాలను అందించగలవు. అంతేకాదు, థియేటర్లలో ఇటీవల స్టార్ హీరోయిన్ల సినిమాలకు కలెక్షన్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం కూడా ఒక వాస్తవం. ఈ నేపథ్యంలో సమంత తీసుకుంటున్న ఈ కొత్త దారి ఆమె కెరీర్‌కు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించవచ్చు. స్టార్ ఇమేజ్ కంటే కంటెంట్ ఆధారిత పాత్రలను ఎంచుకుంటూ, ఓటీటీ-థియేటర్ మధ్య సమతుల్యత సాధించే ప్రయత్నంలో సమంత ఉన్నట్టు కనిపిస్తోంది. మొత్తానికి, సమంత రెండో ఇన్నింగ్స్‌ను మరింత ప్లాన్డ్‌గా, వ్యూహాత్మకంగా ఆడేందుకు సిద్ధమవుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536